









Centre for Rural Operation Programmes Society (CROPS)
Jangaon, Warangal Dist.
Andhra Pradesh, India.
www.crops.co.in


European Union

WWF

# శ్రీ

# పద్ధతిలో వరిసాగు

## వరంగల్ జిల్లా రైతుల అనుభవాలు










Centre for Rural Operation Programmes Society (CROPS)

# శ్రీ పద్ధతిలో వరిసాగు

## వరంగల్ జిల్లా రైతుల అనుభవాలు

**క్రాప్స్ (CROPS)**

**Centre for Rural Operation Programmes Society**

ఇ.నెం. 4-5-15, వెంకన్న కుంట

జనగాం, వరంగల్ జిల్లా,

ఆంధ్రప్రదేశ్.

ఈమెయిల్ **:cropsjangaon@yahoo.com**

**www.crops.co.in**

శ్రీ పద్ధతిలో వరిసాగు
వరంగల్ జిల్లా రైతుల అనుభవాలు

ప్రథమ ముద్రణ: ఏప్రిల్, 2009
ప్రతుల సంఖ్య: 1000

**ఎడిటర్స్: డా. వేముల వినోద్‌గౌడ్**
**డా. లోగానందన్,**
**డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్ – ఇక్రిసాట్ ప్రాజెక్ట్**

ప్రచురణ ప్రతులకు:
క్రాప్స్ **(CROPS),**
ఇ.నెం. 4-5-15,
జనగాం, వరంగల్ జిల్లా,
ఆంధ్రప్రదేశ్
ఫోన్: 08716 - 223621

సాంకేతిక సహకారం:
డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్ - ఇక్రిసాట్ ప్రాజెక్ట్
ఇక్రిసాట్, పటాన్‌చెరు, హైదరాబాద్.
ఫోన్: 040-30713702

**Disclaimer:**

The views expressed in this publication do not necessarily reflect the views and opinions of the European Commission and WWF

# ముందుమాట

శ్రీ పద్ధతిలో వరి పండించటమనేది నేడు మన దేశంలో జాతీయ స్థాయి పరిణామంగా మారింది. వరి పండించే రైతులు ముఖ్యంగా ఒక హెక్టారు విస్తీర్ణం కంటే తక్కువ ఉన్నవారు ఈ పద్ధతిని పరిశీలించి, మార్పులు చేసి అవలంభించి ఈ పద్ధతి వ్యాప్తి కొరకు తోడ్పడుతున్నారు. ఆ రైతుల కఠిన పరిశ్రమ, ఈ పద్ధతిపై వారికి గల నమ్మకమే వరి పండించే అన్నీ రాష్ట్రాలలో శ్రీ పద్ధతి వ్యాప్తి చెందటానికి తోడ్పడింది. భారత దేశంలోని మొత్తం 564 వరి పండించే జిల్లాలలో, సుమారుగా 216 జిల్లాలలో ఈ పద్ధతిని రైతులు అవలంభిస్తున్నారు. ఈ పద్ధతి వ్యాప్తి చెందటానికి, వ్యక్తులు, స్వచ్ఛంధ సేవా సంస్థలు, ప్రభుత్వ శాఖలు ఎంతగానో తోడ్పడ్డాయి. కాని అంతిమంగా రైతులు మాత్రమే ఈ పద్ధతిని అవలంభించి తద్వారా ఈ పద్ధతిలోని ప్రయోజనాల గురించి రైతు లోకానికి తెలియ చేయగలిగారు. ఇప్పుడు ఈ పద్ధతి దేశంలో వరి ఉత్పత్తిని పెంచే ఉద్ధేశ్యంతో ఏర్పాటైన జాతీయ ఆహార భద్రతా పథకం **(NFSM)** ఎజెండాలో కూడా భాగంగా చేర్చబడింది.

శ్రీ పద్ధతి నిజంగా రైతుల ఉద్యమం. ఇతర ఉద్యమాలలో లాగానే ఇందులో కూడా ఈ పద్ధతిని మొదట అవలంభించినవారు కష్ట నష్టాలకు ఓర్చుకుని ఈ పద్ధతిలో అవసరమైన మార్పు చేర్పులు చేసినారు. శ్రీ పద్ధతిలో మొదటి నుండి కూడా వివిధ ప్రాంతాల రైతుల నుండి వారి అనుభవాలను వినడానికి ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతోంది. ఆ ప్రక్రియలో భాగంగా ఈ పుస్తకం, వరంగల్ జిల్లా, బచ్చన్నపేట మండలం మారుమూల గ్రామాల నుండి శ్రీ పద్ధతిని అవలంభించిన రైతుల అనుభవాలను ఒకచోట కూర్చే ప్రయత్నం చేసింది. రైతు సోదరులు శ్రీ పద్ధతిని స్వయంగా పాటించి, ఈ పద్ధతి పట్ల తమ తమ అనుభవాలను, అభిప్రాయాలను తమ స్వంత బాణిలో తెలియచేసారు. ఈ పుస్తకంలో పొందుపరిచిన కథనాలు, మనకు అందించే సందేశాలు ఏమిటంటే శ్రీ వరిసాగు: అ) అనేక సామాజిక పరిస్థితులలో, వ్యవసాయ వాతావరణాల్లో పనిచేస్తుందని, ఆ) దిగుబడులను పెంచుతుందని, ఇ) వరి సేధ్యానికి కావలసిన నీటి పరిమాణాన్ని తగ్గిస్తుందని ఈ) అధిక ఆదాయాన్ని ఇస్తుందని ఉ) ఈ పద్ధతిని మరింత మెరుగు పరిచి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దవచ్చని తెలియచేస్తాయి. ఇందులో చివరి విషయం చాలా ముఖ్యమైనది. శ్రీ పద్ధతిపై ఇప్పటికే అందుబాటులో ఉన్న సమాచారానికీ, విజ్ఞానానికీ రైతుల అనుభవాలను కూడా జత పరచటమనేది చాలా ముఖ్యమైన విషయం. కనుక శ్రీ పద్ధతిపై రైతుల

అభిప్రాయాలను ప్రచురించటం ద్వారా, పరిశోధనా సంస్థలకు, ప్రభుత్వ ఆధారిత విస్తరణ సంస్థలకు, సామాజిక సంస్థలకు మరియు ఆహార భద్రత కొరకు నిధులు సమకుర్చే సంస్థలకు, పరిష్కార మార్గాలు అన్వేషించటానికి, మరింత మెరుగు పర్చటానికి శ్రీ పద్ధతిని వ్యాప్తి చేయటానికి ఈ ప్రయత్నం తోడ్పాటును అందచేస్తుంది.

ఈ పుస్తకంలో పొందుపరచబడిన అనేక కధనాలు ఉత్తేజాన్ని కలుగ చేయడమేకాక, కొత్త పద్ధతులు పాటించడంలో రైతుల యొక్క పట్టుదలను తెలియచేస్తాయి. ఈ పుస్తకం ద్వారా శ్రీ పద్ధతిని అవలంభించటంలో రైతులకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని గమనించవచ్చును. కాని వారు ఆ ఇబ్బందులను అధిగమించటానికీ, శ్రీ పద్ధతిని అవలంభించటానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితులను మెరుగు పరచటానికి అవసరమైన సలహాలను కూడా అందించారు. ఈ పుస్తకాన్ని తెలుగులో అందించటానికి గల ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, శ్రీ పద్ధతిని అవలంభించిన రైతుల అనుభవాలను తెలియచేయటం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని వరి పండించే ఇతర రైతులకు ఈ శ్రీ పద్ధతి అవలంభించేలా ప్రేరేపించటమే. ఈ శ్రీ పద్ధతిని మరింతగా వ్యాప్తి చేయటానికి కల ఇబ్బందులను అధిగమించటానికి, పాలసీలలో తీసుకు రావాలసిన మార్పులను తెల్సుకోవటానికి, ఇంకా ఏదైనా ఇతర విషయాలను సంస్కరించటానికి, మేము ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర సంస్థలను వారి వారి ప్రాంతాలలోని రైతుల అనుభవాలను ఇదే విధంగా పుస్తక రూపంలో తీసుకు రావలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

శ్రీ పద్ధతి వెలుగులోకి వచ్చిన తరువాత భారత దేశంలో వరి సాగు ముఖ చిత్రం పూర్తిగా మారింది. రైతులు వరి సాగు పద్ధతిలో నూతన పద్ధతులను ప్రయత్నం చేస్తున్నారు. నూతన విధానాలను ప్రయోగం చేస్తున్నారు. స్థానిక పరిస్థితులకు సరిపోయే విధంగా వరిసాగు పద్ధతిలో మార్పులు చేస్తున్నారు. అవి నారు వయసులో మార్పులు కావచ్చు లేదా వీడర్ల నమూనాలో మార్పులు కావచ్చు. ఇక్కడ శ్రీ పద్ధతికి ఇతర పద్ధతికి కల తేడా ఏమిటి అనేది ముఖ్య విషయం కాదు. వరిసాగుపై రైతుకు కల అభిప్రాయాన్ని ఈ శ్రీ పద్ధతి మార్చి వేసిందన్నదే ముఖ్యమైన విషయం. ఇది ఆరంభం మాత్రమే. ఇకముందు భవిష్యత్తులో లక్షలాది మంది భారత రైతులు ఈ విధానంపై తమకున్న విజ్ఞానాన్నీ,అనుభవాన్నీ కేవలం వనరుల వినియోగపు పద్ధతిని మార్చుకోవటానికి ఉపయోగించుకోవటం మాత్రమే కాక, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను ఇటువంటి పద్ధతులపై పెట్టుబడులు పెట్టడానికి వత్తిడి తీసుకొని వస్తారు. తద్వారా ఆహార భద్రత సాధించటానికి, భూ, జల వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవటానికి సానుకూల పరిస్థితులు ఏర్పడతాయి.

నేను ఈ సందర్భంగా క్రాప్స్ సంస్థ కార్యదర్శి శ్రీ ఆర్. లింగయ్య గారిని, ఐరోపా కమీషన్ **(EC)**, ప్రపంచ ప్రకృతి నిధి **(WWF)** సంస్థల సహకారంతో ఈ శ్రీ పద్ధతిని వరంగల్ జిల్లాలోని బచ్చన్నపేట మండలంలో వ్యాప్తి చేయటానికి విశిష్ట కృషి చేస్తున్నందుకు, అధిక సంఖ్యలో రైతులను ఈ శ్రీ పద్ధతిని అవలంభింప చేసేలా ప్రేరేపించే ఉద్దేశ్యంతో ఈ ప్రచురణను తీసుకు వస్తున్నందుకు మనసారా అభినందిస్తున్నాను. ఈ ప్రచురణ కొరకు తమ తమ అనుభవాలను అందచేసిన రైతులందరికీ, ఆ రైతుల అనుభవాలను సేకరించటానికి, క్రోడీకరించటానికి కృషి చేసిన సంస్థ సిబ్బంది అందరికీ మా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము. ఈ ప్రచురణ అందరినీ ముఖ్యంగా పరిశోధకులను, వ్యవసాయాన్ని ముఖ్యంగా శ్రీ పద్ధతిని మదింపు చేసే వారి విధానాలను పున: సమీక్షించుకునేలా ఉత్తేజ పరుస్తుందని భావిస్తున్నాము.

**డాక్టరు. బిక్షం గుజ్జా**
**WWF-ICRISAT Project**

;

# ఉపోద్ఘాతం

శ్రీ వరి అంటే వరిలో ఒక రకం కాదు. ఇది వరి పండించే ఒక పద్ధతి మాత్రమే. తక్కువ నీరు, తక్కువ విత్తనం, తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే అద్భుతమైన నూతన విధానం. కొద్ది పాటి శిక్షణ, పర్యవేక్షణలతో ఈ పద్ధతిలో మంచి దిగుబడులు సాధించ వచ్చును. తరిగి పోతున్న జల వనరులు, పెరుగుతున్న వ్యవసాయ పెట్టుబడులు, అధిక మొత్తంలో వినియోగించబడుతున్న రసాయనక ఎరువులు, పురుగు మందుల వాడకం వలన పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, తరుగుతున్న భూసారం నేపధ్యంలో; తక్కువ నీరు, తక్కువ విత్తనం, తక్కువ ఎరువులు, పురుగుల మందులనుపయోగించి అధిక దిగుబడులను ఈ పద్ధతిలో సాధించవచ్చును. ఇదే విషయాన్ని గత రెండు సీజన్లుగా మా క్రాప్స్ **(CROPS)** సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా రైతులు నిరూపిస్తున్నారు.

గత రెండు దశాబ్దాలుగా సామాజిక రంగంలో ఉండి అనేక వ్యవసాయ సంబంధిత, ఇతర సామాజిక అంశాలపై విజయవంతంగా పని చేస్తున్న క్రాప్స్ సంస్థ 2007వ సంవత్సరపు రబీ సీజన్ నుండి ప్రతిష్టాత్మక **WWF & EU** సంస్థల సహకారంతో శ్రీ పద్ధతిలో వరి పండించే ప్రక్రియను చేపట్టి, వరంగల్ జిల్లా బచ్చన్నపేట మండలంలో కట్కూర్, బోనకల్లూరు గ్రామాలను ఎంచుకొని, 120 మంది రైతులకు ఈ విధానం పట్ల అవగాహన కలిగించి, వరిని పండించటానికి ముందుకు తీసుకు రావటం జరిగింది. అవగాహనా కార్యక్రమాలు, రైతు బడుల ద్వారా రైతులకు మరియు మహిళా కూలీలకు శిక్షణలు, వాలంటీర్ల ద్వారా నిరంతర పర్యవేక్షణల సహాయంతో రైతులకు నిత్యం అందుబాటులో ఉండటమే కాక క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న మార్కర్లు, వీడర్లు వంటి వాటిని అభివృద్ధిచేసి అందచేయటం జరిగింది. తద్వారా రైతులు శ్రీ పద్ధతిలో అధిక (సుమారు 15 నుండి 20 బస్తాల వరకు) దిగుబడులు సాధించటానికి తోడ్పడటంతోపాటు రైతుల మరియు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడటం జరిగింది. ఈ అమలు కార్యక్రమంలో **WWF** సంస్థ తమ సంపూర్ణ సహాయ సహకారాలను అందచేసింది. ఈ కార్యక్రమ కో-ఆర్డినేటర్ డా. వినోద్‌గౌడ్, టీమ్ లీడర్ డా. బిక్షం గుజ్జా గార్లు **(WWF)**, శ్రీ వరి క్షేత్రాలను క్రమం తప్పకుండా సందర్శించటంతో పాటు, రైతులకు, సిబ్బందికి నిరంతరం అందుబాటులో ఉండి తమ సలహా సంప్రదింపులు అందచేసి ఈ విధానాన్ని ముందుకు తీసుకొని వెళ్ళటానికి తమ తోడ్పాటును అందించారు. మా ఈ శ్రీ పద్ధతిలో వరి పండించే గ్రామాలను **WWF, ICRISAT,**

**ANGRAU & DRR** సంస్థల నుండి అనేక మంది శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఇందిరా క్రాంతి పథకం అధికారులు, ఇతర ప్రాంతాల, జిల్లాల రైతులు, స్వచ్ఛంధ సంస్థల వారు, మీడియా సిబ్బంది సందర్శించి ఈ విధానం గురించి తెలుసుకోవటంతో పాటు, ఈ పద్ధతి వ్యాప్తి చెందటానికి తోడ్పడుతున్నారు.

మొదట రైతులను శ్రీ పద్ధతిలో వరి పండించేలా ముందుకు తీసుకు రావడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేయడం జరిగింది. గ్రామ సభలు, అవగాహన కార్యక్రమాలు, కళాజాత కార్యక్రమాలు వంటి అనేక కార్యక్రమాలు ద్వారా అవగాహన కలిగించటంతో పాటు, కొంత సంశయం వ్యక్తం చేసిన రైతులకు ఈ విధానంలో ఏదైనా నష్టం వస్తే ఆ నష్టాన్ని సంస్థ భరించగలదన్న నమ్మకాన్ని కలుగ చేయడం జరిగింది. గతంలో కొద్ది మొత్తంలో అయినప్పటికీ ఈ పద్ధతిని అమలు చేయడంలో మా సంస్థకున్న అనుభవం, ఈ పద్ధతిని పాటించటం వలన లాభం పొందిన మా ఇతర రైతుల అనుభవాలు మమ్మల్ని అంత నమ్మకంగా చెప్పేలా చేసింది. మొదట ఈ రెండు గ్రామాలనుండి 120 మంది రైతులే ముందుకు వచ్చినప్పటికీ, ఈ 2008 రబీ సీజన్ కల్లా వరి పండించే రైతులందరూ శ్రీ పద్ధతిలో వరిని పండించటానికి ముందుకు వచ్చారు. 2007 సంవత్సరంలో ఈ పద్ధతిలో వరిని పండించిన రైతుల అనుభవాలే మిగిలిన రైతులను ఈ పద్ధతి పట్ల మొగ్గు చూపేలా చేసాయి. ఈ గ్రామాలనుండి కొత్తగా ముందుకు వచ్చిన రైతులందరూ కూడా స్వచ్ఛందంగానే ముందుకు వచ్చారు. ఈ గ్రామాలను చూసి చుట్టు పక్కల గ్రామాల వారు కూడా ఉత్సాహాన్ని చూపడంతో ఈ 2008 సంవత్సరపు రబీ నుండి మొత్తం బచ్చన్నపేట మండలంలోని 7 గ్రామాలల్లో 500 మంది రైతులతో ఈ పద్ధతిని అమలు చేస్తున్నాము. మా ఈ రైతుల అనుభవాలు మొత్తం రైతాంగానికి తెలియచేసి, ఈ పద్ధతిని మరింత వ్యాప్తి చేయాలన్న సంకల్పంతో, ఒక 20 మంది రైతుల అనుభవాలను ఈ పుస్తకంలో సవినయంగా అందచేస్తున్నాము. ఈ పుస్తకాన్ని చదివి, రైతుల అనుభవాలను తెలుసుకొని, మీరు కూడా ఈ పద్ధతిని అవలంబిస్తారని, మరో పది మందికి తెలియచేస్తారన్న నమ్మకంతో. . .

మీ

**రేకల లింగయ్య,** సెక్రటరీ, క్రాప్స్ సంస్థ

జనగాం, వరంగల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# విషయసూచిక

I. శ్రీ పద్ధతి - పరిచయం

II. రైతుల అనుభవాలు

| | | | |
|---|---|---|---|
| 1. | మూసిని ఎల్లయ్య | ............................ | 03 |
| 2. | పుట్టా అయోధ్య | ............................ | 09 |
| 3. | చింతల బాలయ్య | ............................ | 14 |
| 4. | మేకబొడ్డు ఐలయ్య | ............................ | 19 |
| 5. | గడిపే మధుసూధన్ | ............................ | 24 |
| 6. | కొరివి బిక్షపతి | ............................ | 29 |
| 7. | పుట్టా నర్సింహులు | ............................ | 35 |
| 8. | నిడిగొండ గౌరమ్మ | ............................ | 40 |
| 9. | కాల్వపెల్లి పోషయ్య | ............................ | 44 |
| 10. | పుట్టా లక్ష్మీనారాయణ | ............................ | 49 |
| 11. | మేకబొడ్డు ఎల్లయ్య | ............................ | 55 |
| 12. | దుడ్డెడ సుగుణమ్మ | ............................ | 59 |
| 13. | మూసిని లలిత | ............................ | 63 |
| 14. | మాల్ల ఐలయ్య | ............................ | 67 |
| 15. | బద్దెపడిగె చంద్రారెడ్డి | ............................ | 74 |
| 16. | చిక్కుడు ఉపేంద్ర | ............................ | 79 |
| 17. | బద్దెపడిగె రామిరెడ్డి | ............................ | 84 |
| 18. | చేర్యాల నర్సింహులు | ............................ | 90 |
| 19. | మోకు శ్రీశైలం రెడ్డి | ............................ | 95 |
| 20. | చొప్పరి అబ్బయ్య | ............................ | 100 |

# శ్రీ పద్ధతి – పరిచయం

ఇంగ్లీషులో SRI అనే అక్షరాలని కలిపినప్పుడు శ్రీ అవుతుంది. SRI అంటే, System of Rice Intensification అని అర్ధం. శ్రీ వరిసాగు పద్ధతిని మొట్టమొదటగా 1980 దశకంలో మడగాస్కర్ దేశంలో కనిపెట్టారు. ఫాదర్ హెన్రీ డి లౌలానీ అనే ఆయన ఈ విధానాన్ని రూపొందించాడు.

మామూలు సాగు విధానంలో వరి పొలంలో ఎప్పుడూ నీరు నిలబడి వుంటుంది. శ్రీ విధానంలో నీరు నిలువ ఉంచడం అనేది ఉండదు. పెట్టుబడులు తక్కువ. తక్కువ విత్తనం, తక్కువ నీరు, తక్కువ రసాయనిక ఎరువులు, తక్కువ పురుగు మందులతో వరిని పండించవచ్చు. కానీ పశువుల ఎరువు ఎక్కువ వాడాల్సి ఉంటుంది. ఈ పద్ధతిలో వేర్లు విస్తారంగా వ్యాప్తి చెంది, లోతుగా చొచ్చుకుపోయి, భూమి లోపలి పొరల నుండి పోషక పదార్ధాలను తీసుకోగలుగుతాయి.

వరి నీటి మొక్క కాదు. కేవలం నీటిలో బ్రతుక గలుగుతుంది. కానీ నీరు ఎల్లప్పుడూ నిల్వ ఉన్నప్పుడు పెరుగుదల బాగా ఉండదు. నీరు నిల్వ ఉన్నందువల్ల వేళ్ళకు ఆక్సిజన్ అందదు కాబట్టి కోతకు వచ్చే సమయానికి 70% కంటే ఎక్కువ వేళ్ళ మొనలు కుళ్ళి పోషకాలను తీసుకోలేని పరిస్థితుల్లో ఉంటాయి. దీనివలన వరిలో అధిక దిగుబడులు రావు. ఉత్పాదకత గణనీయంగా పడిపోతుంది. కనుక రైతులు శ్రీ విధానాన్ని పాటించి తక్కువ వనరులతో అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చు.

ఏ వరి రకాన్నైనా ఈ విధానంలో పండించవచ్చు. 'శ్రీ' అనేది రకం కాదు. 'శ్రీ' అనేది వరి సాగు చేసే విధానం మాత్రమే అనేది రైతాంగం గమనించాలి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏ ప్రాంతానికనువైన రకాన్ని ఆ ప్రాంతంలో శ్రీ విధానం ద్వారా సాగుచేయవచ్చు. గత రెండు సంవత్సరాలుగా రైతులు స్వర్ణ , సాంబమసూరి, చైతన్య, సురేఖ, సొలాసప్రభ, తెల్లహంస లాంటి అనేక రకాల్ని 'శ్రీ' విధానంలో సాగు చేసారు.

శ్రీ పద్ధతికి సాధారణ పద్ధతులకు గల తేడాలను ఈక్రింద పొందుపర్చటం జరిగింది.

| సాధారణ పద్ధతి | శ్రీ పద్ధతి |
|---|---|
| 1. ఎకరాకు 20 నుంచి 25 కిలోల విత్తనం అవసరం | 1. ఎకరాకు కేవలం 2 కిలోల విత్తనం సరిపోతుంది. |
| 2. 25 నుంచి 30 రోజుల వయస్సు కలిగిన నారును నాటుతారు. | 2. కేవలం 8-12 రోజుల వయస్సు నారుని మాత్రమే నాటాలి. |
| 3. నారుని పీకటం, జాడించటం, కట్ట కట్టడం, మోపులు కట్టడం లాంటివి చేయడం వలన నడుములు విరిగి షాక్‌కి గురువుతాయి. | 3. నారుని పసిపిల్లలాగా నెమ్మదిగా, సున్నితంగా, మట్టితో సహాతీసి చాలా నెమ్మదిగా, దెబ్బతగలకుండా నాటాలి. |
| 4. ప్రధాన పొలంలో వరుసల్లో కాకుండా ఎక్కడబడితే అక్కడ దగ్గరగా నాటుతారు. | 4. ఎటుచూసినా 25 సెం.మి. ఉండేటట్లు చతురస్ర పద్ధతిలో నాటాలి. |
| 5. చదరపు మీటరుకి ఖరీఫ్‌లో అయితే 33 కుదుళ్లు, రబీలో 44 కుదుళ్ల ఉంటాయి. | 5. చదరపు మీటరుకి కేవలం 16 మొక్కలు మాత్రమే నాటాలి. |
| 6. కుదురికి 2, 3 అంతకంటే ఎక్కువ మొక్కలు నాటుతారు. | 6. కుదురికి కేవలం ఒక మొక్క మాత్రమే నాటాలి. |
| 7. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వాడతారు. | 7. ఎక్కువగా సేంద్రియ ఎరువులు వాడాలి. |
| 8. ఎప్పుడూ నీరు నిల్వ ఉంచుతారు. | 8. తడిగా మాత్రమే ఉండాలి. నీరు నిల్వ ఉంచకూడదు. |
| 9. కూలీలతో కలుపు మొక్కలు తీయించి నివారించాలి. గట్టుపైన వేస్తారు. కొందరు కలుపు బెడద ఎక్కువగా ఉంటే రసాయనాలు వాడతారు. | 9. రసాయనాలు వాడకుండా కలుపు వీడర్ పరికరాన్ని ఉపయోగించడం ద్వారా కలుపు మొక్కలు నేలలో కలిసి పోయేలా చేస్తారు. నేలలో కలిసిన ఈ కలపు మొక్కలు పచ్చిరొట్టలా ఉపయోగపడుతుంది. |

వరంగల్ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కట్కూరు, బోనకల్లూరు గ్రామాలకు చెందిన 20 మంది శ్రీ విధానం పాటించిన రైతుల అనుభవాలను వారి మాటలలోనే ఈ పుస్తకంలో తెలుసుకోండి.

# కట్యారు గ్రామ
# రైతుల అనుభవాలు



## మూసిని ఎల్లయ్య

### కట్కూర్, వరంగల్ జిల్లా

నా పేరు మూసిని ఎల్లయ్య, నేను వరంగల్ జిల్లా, బచ్చన్న పేట మండలం, కట్కూర్ గ్రామానికి చెందిన రైతును, వయస్సు 47 సంవత్సరాలు. నేను వ్యవసాయంతో పాటుగా సామాజిక కార్యక్రమాల్లో కూడా పాల్గొంటాను. గతంలో నేను మా గ్రామానికి సర్పంచ్‌గా పనిచేసాను. నేను 8వ తరగతి వరకు చదువుకున్నాను. నా పిల్లలందరూ చదువుకుంటున్నారు. నాకు మొత్తం 5 ఎకరాల పొలం ఉన్నది. అందులో 2 లేదా 3 ఎకరాలలో వరి పండిస్తాను. మిగిలిన భూమిలో పత్తి, మొక్కజొన్న వంటి పంటలు పండిస్తాను. సాంప్రదాయ పద్ధతిలో నాగలి, గొర్రు, పార, కొడవలిని ముఖ్య సాధనాలుగా వినియోగిస్తాము. నా పొలానికి బోరు బావి సదుపాయం ఉన్నది. దీని క్రిందనే నేను వరి పండిస్తాను. మా ప్రాంతంలో సాధారణంగా లేత దశలో లేదా నాటిన 20 రోజులకు ఇస్ప పురుగు ఆశించి ఆకులను తింటుంది. దీనిని నివారించుటకు ఫోరేట్ గుళికలు ఉపయోగిస్తాము. ఆ తరువాత దశలలో దోమపోటు, కాండం తొలుచు పురుగులు ఆశిస్తాయి. వీటి నివారణ కొరకు మోనోక్రోటోఫాస్, ఎండో సల్ఫాన్ వంటి వాటిని పిచికారి చేస్తాము. ఒక్కొక్క సారి వాతావరణం అనుకూలించని పరిస్థితులలో అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగుళ్ళు ఆశిస్తాయి. వీటి నివారణ కొరకు M45 మరియు బావిస్టాన్ వంటి వాటిని ఉపయోగిస్తాము. చేను ఏపుగా పెరగడానికి డి.ఏ.పి., యూరియాలను, పొట్ట దశలో పొటాష్‌లను వినియోగిస్తాము. ఇంతవరకు నాకు సాధారణ పద్ధతిలో సుమారు 35 నుండి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

నేను తక్కువగా చదువుకున్నప్పటికీ మాజీ సర్పంచ్‌గా నా సామాజిక నేపథ్యం, ఎల్లప్పుడూ కొత్తదనాన్ని అంగీకరించేలా ఉండేది. కాని అవకాశం కూడా కలిసి రావాలి అనుకునేవాడిని. ఇటువంటి పరిస్థితులలో రెండు మూడు సంవత్సరాల క్రితం ఒకసారి వ్యవసాయ శాఖ అధికారి వద్ద నేను శ్రీ వరి గురించి విన్నాను. వారు కొంత వరకు సహకారం అందిస్తాము అన్నారు. కాని, శిక్షణ విషయంలో భరోసా ఇవ్వలేక పోయేసరికి ఆ పద్ధతిని పాటించాలని ఉన్నప్పటికీ అప్పటికి వాయిదా వేసాను. కాని 2007 సంవత్సరంలో CROPS సంస్థ వారు మా గ్రామాన్ని

సందర్శించి శ్రీ వరి గురించి తెలియచేసారు. ఈ పద్ధతిని అవలంభిస్తే వచ్చే లాభ, నష్టాలు, దీంట్లో ఉన్న కష్ట, సుఖాలు అన్ని వివరించడంతోపాటు, వారు ఈ పద్ధతిని అవలంభించే రైతులకు తాము ఇవ్వగలిగిన సహకారం గురించి కూడా తెలియచేశారు. ఈ పద్ధతి ద్వారా తక్కువ నీటితో వరి పండించ వచ్చన్నారు. దిగుబడి కూడా సాధారణ పద్ధతితో పోలిస్తే ఎక్కువగా ఉంటుందని తెలియచేశారు. ఈ పద్ధతిని పాటించడానికి కావలసిన పూర్తి శిక్షణను అందచేయగలమని వారు నమ్మకాన్ని కలుగచేయడంతో నేను సంతోషంగా ముందుకు రావడంతో పాటు నా తోటి రైతులు కొందరిని కూడా ప్రోత్సహించాను. దానితో ముందుకు వచ్చిన రైతులందరిని గ్రూపులుగా విభజించి శిక్షణలు అందచేశారు.

CROPS సంస్థ వారు మా గ్రూపుల నుండి ఉత్సాహవంతులైన వారిని కార్యకర్తలుగా నియమించి వారికి పూర్తి స్థాయి శిక్షణలు అందచేసి, వారి ద్వారా మాకు నిరంతర సాంకేతిక సహకారం అందేలా చూశారు. అంతేకాక ఈ పద్ధతికి అవసరమైన మార్కర్లు, వీడర్లు, లింగాకర్షక బుట్టలు అందచేశారు. మా రైతులందరినీ క్షేత్ర సందర్శనకు తీసుకొని వెళ్ళడం ద్వారా ఆయా ప్రాంతాల్లో శ్రీపద్ధతిలో వరి పండించే విధానాలను, అక్కడి రైతుల అనుభవాలను తెలుసుకునే అవకాశం కలుగచేశారు. గడిచిన రెండు సీజన్లలో కూడా CROPS సంస్థ నుండి మాకు సంపూర్ణ సహకారం లభించినది. నేను ఈ రెండు సీజన్ల నుండి కూడా ఈ ప్రాంతంలో ఎక్కువ మంది పండించే IR 64 రకాన్ని రెండు ఎకరాల విస్తీర్ణంలో శ్రీ పద్ధతిలో సాగు చేస్తున్నాను. మొదటి సీజన్‌లో అనుభవం లేక పోవటం వలన కలుపు తీయటంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాము. పంట దిగుబడి కూడా కొంత తక్కువ రావటం జరిగింది. కాని తరువాత సీజన్‌లో ఇబ్బందులను అధిగమించి సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే అధిక దిగుబడిని సాధించాను. రెండవ సీజన్‌లో సాంప్రదాయ పద్ధతిలో 36 బస్తాల దిగుబడి వస్తే శ్రీ పద్ధతిలో 54 బస్తాల దిగుబడి వచ్చినది. ఈ రెండు సీజన్లలో శ్రీ పద్ధతి పాటించిన వరి పొలానికి చీడ పీడల బెడద చాలా తక్కువగా ఉన్నది. మొదటి సీజన్‌లో కేవలం 5% పంటకు మాత్రమే పురుగు ఆశిస్తే రెండవ సీజన్‌లో అసలు చీడ పీడలు ఆశించలేదు.

### శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- ఒకపూట నానబెట్టి, మరో రెండు పూటలు అంటే ఒకరోజు గోనె సంచిలో వేసి మండె కట్టి, మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాము.
- నారు పెరిగే లోపల నాటటానికి ఒకరోజు ముందే పొలం దున్ని, దమ్ము చేసి మార్కర్‌తో గీతలు గీసాము.

- వరుసలు తిన్నగా ఉండటానికి పొలం పొడవునా తాడు కట్టి దాని వెంట మార్కర్‌ని లాగడం జరిగింది.
- ఆ తరువాత లేత మొక్కలు అంటే 13 రోజుల మొక్కలను దూరం దూరంగా నాటాము.
- నాటేటప్పుడు మొక్కలను, విత్తనం మరియు వేర్లతో సహా జాగ్రత్తగా పీకి ఒక్కొక్క మొక్కనే నాటించాము.
- నాటిన తరువాత రోజు పొలానికి కొద్దిగా నీరు పెట్టాము.
- ఈ పద్ధతిలో పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము. పొలాన్ని నిరంతరం తడుపుతూ, ఆరబెడుతూ ఉండేలా చూశాము.
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 10 రోజుల వ్యవధిలో మొత్తం 5 సార్లు కలుపు తీసాము.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- విత్తనం ఖర్చు చాలా తగ్గినది. సాధారణ పద్ధతిలో 30 కిలో గ్రాముల విత్తనాన్ని వాడితే ఈ శ్రీ పద్ధతిలో కేవలం 2 కిలో గ్రాముల విత్తనం సరిపోయింది.
- మొదటి సీజన్‌తో పోలిస్తే రెండవ సీజన్‌లో దుక్కి దున్నటానికి తక్కువ ఖర్చు అయినది. ఎందుకంటే ఈ శ్రీ పద్ధతిలో లోతుగా దుక్కి దున్నాల్సిన అవసరం లేదని తెలియటం వలన రెండవ సారి ఖచ్చితంగా అలాగే చేశాము. అదే విధంగా నాటు కూలీల ఖర్చు, కలుపు తీత కూలీల ఖర్చు కూడా చాలా తగ్గినది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం చాలా తగ్గినది.
- చీడ పీడల అసలు ఆశించలేదు. అదే విధంగా ఎలుకల బెడద కూడా చాలా తగ్గినది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే పంట తొందరగా చేతికి వచ్చినది.
- శ్రీ పద్ధతిలో పిలకల సంఖ్య పెరిగింది. అదే విధంగా కంకి పరిమాణం పెద్దగా ఉండి గింజ బరువు కూడా ఎక్కువగా ఉన్నది.
- సాధారణ పద్ధతిలో ఒక కంకికి 100 నుండి 120 గింజలు ఉంటే, శ్రీ పద్ధతి పాటించిన వరికి 140 నుండి 160 గింజలు ఉన్నాయి.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో కనీసం 15 బస్తాల దిగుబడి అధికంగా వచ్చినది.

## శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- ఈ పద్ధతిలో ఉన్న అన్నీ విధానాలను అర్థం చేసుకోవటానికి, నేర్చుకోవటానికి మొదట్లో కొంత ఎక్కువ సమయం పట్టింది.

- అన్ని పనులు సమయం ప్రకారం చేయాలి అన్న విషయం మొదట్లో చాలా ఇబ్బంది కలిగించింది.
- వీడర్‌ని తిప్పడం అనేది శ్రమతో కూడిన ప్రక్రియ, దీని వలన ఎక్కువ విస్తీర్ణంలో ఈ పద్ధతిలో వరి పండించలేక పోతున్నాము.
- ఆడ కూలీలు వీడర్ తిప్పలేక పోతున్నారు.
- మొదటి సీజన్‌లో ఎత్తుమడి తయారు చేయడానికి కూడా కొంత ఇబ్బంది పడ్డాను.
- మొదటి సీజన్‌లో విత్తనం నాటడానికి సాంప్రదాయ పద్ధతి కంటే ఎక్కువ ఖర్చు అయినది. కానీ, రెండవ సీజన్ కల్లా కూలీలు అలవాటు పడటం వలన ఈ ఇబ్బంది తొలగింది.
- నీటి యాజమాన్యం అంటే నీటిని ఎండగట్టడం, ఆరుతడి పంటలలో మాదిరిగా నీటిని వాడటానికి మొదట్లో కొంచెం ఇబ్బంది కలిగింది.
- ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సరి అయిన సమయంలో రాకపోవటం వలన నాటు వేయడానికి ఇబ్బంది కలిగింది.

## శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిని అవలంభించటం కొంచెం కష్టమైన ప్రక్రియ.
- దుక్కి ఎక్కువ లోతు లేకుండా చూసుకోవడం మంచిది. అందువలన వీడర్ దిగబడదు మరియు సులభంగా తిరుగుతుంది.
- దూర దూరంగా నాటడం వలన ప్రతీ మొక్క యొక్క ఆకులకు సూర్యరశ్మి బాగా సోకుతుంది. దాని ద్వారా ఒక్కో మొక్కకి తగినంత స్థలం, నీరు, పోషకాలు ఎక్కువగా అంది వేర్లు దృఢంగా పెరిగి మొక్క బాగా పెరగటానికి దోహదం చేస్తుంది.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటుకోవాలి.
- నారు వేసిన మరుసటి రోజు పలుచగా నీరు పట్టాలి.
- మొదట్లో ఈ పద్ధతిలో నాటు వేయడానికి ఎకరానికి 10 నుండి 15 మంది కూలీలు పట్టవచ్చు. ఈ పద్ధతి అలవాటు తరువాత అంతకంటే తక్కువ మంది కూలీలతోనే నాటు వేయవచ్చు.
- ఈ పద్ధతిలో సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే నీరు చాలా తక్కువగా వినియోగం అవుతుంది.
- పొలాన్ని నిరంతరం తడుపుతూ, ఆరబెడుతూ ఉండటం వలన నేలలోని సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెందుతాయి. తద్వారా మొక్కలకు పోషకాలు ఎక్కువగా మరియు సులభంగా అందుతాయి.

- వీడర్ చేరుకోలేని కుదుర్ల పక్కన ఉన్న కలుపు మొక్కలను చేతితో తీసివేయాలి.
- సేంద్రియ ఎరువులు వాడకం వలన, మొక్కల మధ్య దూరం ఎక్కువగా ఉండటం వలన శ్రీ పద్ధతిలో చీడ పీడలు ఆశించడం చాలా తక్కువగా ఉంటుంది.

## సలహాలు, సూచనలు

- ఈ పద్ధతిని పాటించడానికి తగిన శిక్షణ అవసరం కాబట్టి, పెద్ద ఎత్తున శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు, కూలీలకు తగిన శిక్షణలు ఇప్పించాలి.
- ఈ పద్ధతిలో వీడర్ ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి.
- శ్రీ పద్ధతిలో సేంద్రీయ ఎరువులు వాడి వరి పండిస్తారు కావున ఈ పద్ధతిలో పండించిన వరికి మార్కెట్ సౌకర్యం కలిగించి అధిక ధర ఇప్పించినట్లయితే రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.
- ఈ పద్ధతిలో తక్కువ నీటితో వరి పండించవచ్చు కావున మెట్ట సేద్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పద్ధతిని ఎక్కువ మంది రైతులు అవలంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
- ఈ పద్ధతిని పాటించే రైతులకు ప్రభుత్వం పరంగా సబ్సిడీలు, ఋణాల వంటి ప్రోత్సాహకాలను ఇవ్వడమే కాకుండా, వ్యవసాయ శాఖ సహకారంతో ఈ పద్ధతి ఎక్కువ మంది రైతులకు తెలిసేలా చర్యలు చేపట్టాలి.
- గ్రామాల్లో ఉన్న ప్రభుత్వం చేత గుర్తించ బడిన ఆదర్శ రైతులకు శిక్షణ అందించి వారి సేవలను సమర్ధవంతంగా వినియోగించుకుని ఈ పద్ధతిని ఎక్కువ మంది రైతులు అవలంభించేలా చేయాలి.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతినీ కూడా ఒకసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు రాబడికి సంబందించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 110 రోజులు | 132 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 10 రోజులు | 35 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ (MOP) |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఫ్యూరిడాన్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | దుక్కులు | 2,000(నాలుగు సార్లు) | 2,500(ఆరు సార్లు) |
| 2. | విత్తన ఖర్చు | 45 | 600 |
| 3. | నారుమడి తయారీ | 100 | 200 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 360 | 960 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 420 | 1,260 |
| 6. | ఎరువులు | 1,000 | 1,250 |
| 7. | పురుగు మందులు | 300 | 600 |
| 8. | పంటకోత, మార్పిడి | 1,980 | 1,800 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 5,705 | 9,170 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,125 | 3,000 |
| 11. | మొత్తం లాభం (9.50 / Kg ) | 39,187 | 28,500 |
| 12. | నికర లాభం | 33,482.00 | 19,330.00 |

## పుట్ట అయోధ్య

కట్కూర్, వరంగల్ జిల్లా



నా పేరు పుట్ట అయోధ్య. మాది కట్కూర్ గ్రామం, బచ్చన్న పేట మండలం, వరంగల్ జిల్లా. నాకు 50 సంవత్సరాలు, నాకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. నేను 7వ తరగతి వరకు చదువుకున్నాను. నా ప్రధాన వృత్తి వ్యవసాయం. గత 30 సంవత్సరాలుగా నేను వ్యవసాయమే చేస్తున్నాను. నాకున్న 2 ఎకరాల పొలం మొత్తానికి నీటి వసతి (బోరు బావి) ఉన్నది. అందుచేత ఈ 2 ఎకరాలలో వరి పండిస్తాను. దీనితో పాటు కొంత కూరగాయలు కూడా పండిస్తాను. సాధారణ పద్ధతిలో వరిని సాగుచేయడానికి ముఖ్యమైన పరికరాలుగా కర్ర నాగలి, గొర్రు మరియు కొడవళ్ళు ఉపయోగిస్తాము. ఈ పంటకు పశువుల ఎరువును తప్పకుండా ఉపయోగిస్తాను. అంతేకాక దుబ్బు బాగా కట్టడానికి యూరియా, డి.ఏ.పి., పొటాష్ వంటి రసాయనిక ఎరువులను కొద్ది మొత్తంలో వినియోగిస్తాను. చేనుకు తాటాకు తెగులు, కాండం తొలుచు పురుగు వంటివి ఆశించినప్పుడు కెల్డాన్ గుళికలు, ఫోరేటి 10g గుళికలు వాడతాను. ఎండో సల్ఫాన్ వంటి వాటిని పిచికారి చేస్తాను. గత ఏడాది నా చేనుకు వేరు కుళ్ళు తెగులు అధికంగా కనిపించినప్పుడు, పొలాన్ని ఎండకట్టి, కార్బోఫ్యూరాన్ గుళికలు వాడటం ద్వారా నివారించగలిగాను. సాధారణంగా సాంప్రదాయ పద్ధతిలో మాకు 30 నుండి 35 బస్తాల దిగుబడి వస్తుంది.

నేను శ్రీ పద్ధతిలో వరి పండించటం గురించి 2006 సంవత్సరంలో మండల కేంద్రం వెళ్ళినప్పుడు అక్కడి వ్యవసాయ అధికారి ద్వారా వినటం జరిగింది. కానీ ఆ పద్ధతిలో పాటించవలసిన విధానాలు ఏమిటో, ఎలా పాటించాలో తెలియక అప్పుడు ఆ పద్ధతి గురించి ఆలోచించలేదు. కాని గత సంవత్సరం అంటే 2007 సంవత్సరంలో రబీ సీజన్ ప్రారంభానికి ముందు CROPS సంస్థ వారు గ్రామాన్ని సందర్శించి, ఈ పద్ధతి గురించిన పూర్తి సమాచారాన్ని తెలియచేశారు. ఈ పద్ధతిని పాటించే రైతులందరికీ వీడర్లు, మార్కర్లు వంటి పరికరాలను అందచేస్తామని, అంతేకాక పంట పూర్తికాలం వరకు అందుబాటులో ఉండి, ఎంపిక చేసిన కార్యకర్తల సహాయంతో పూర్తి సహకారం, శిక్షణలు అందచేయుగలమని నమ్మకంగా తెలియ చేయడంతో అదే సీజన్‌లో ముందుకు వచ్చి, గత

రెండు సీజన్లుగా IR64 రకాన్ని ఒక ఎకరం విస్తీర్ణంలో సాగు చేస్తున్నాను. సంస్థ వారి శిక్షణలు, రైతు క్షేత్ర పాఠశాలల ద్వారా నేర్చుకొన్న అంశాల ఆధారంగా శ్రీ పద్ధతిలో ఈ క్రింది విధానాలను పాటించాను.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- మొదట నారుమడి గురించి భూమిని దున్ని, ఆ తరువాత ఎత్తు మడిగా రూపొందించాను.
- విత్తనాన్ని 12 గంటలు నానబెట్టి గోతాంలో పోసి 24 గంటలు మండె కట్టాను. ఆ తరువాత మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.
- రోజు ఉదయం, సాయంత్రం నీళ్ళు చిలకరించాను.
- దమ్ము చేసిన పొలంలో మార్కర్‌ని లాగటం ద్వారా చతురస్రాకార ఆకారంలో నిలువు, అడ్డగీతలు ఏర్పడేలా చేసాను.
- ఈ పద్ధతిలో 11 రోజులు వయసు వున్న మొక్కలను దూర దూరంగా నాటించాము.
- ఈ పద్ధతిలో పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము. ఆరుతడి పంటలో లాగా నీరు పెట్టాము.
- రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వినియోగించటం జరిగింది.
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 10 రోజుల వ్యవధిలో 3 సార్లు కలుపు తీసాము.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- శ్రీ పద్ధతిలో ఖర్చు తగ్గి, దిగుబడులు ఎక్కువ రావటం వలన, సాధారణ పద్ధతితో పోలిస్తే నాకు నికర ఆదాయం ఎక్కువగా వచ్చినది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో కనీసం 20 బస్తాల దిగుబడి అధికంగా వచ్చినది.
- శ్రీ పద్ధతిలో దుక్కి లోతుగా దున్నాల్సిన అవసరం లేదు కావున దుక్కి దున్నటం తక్కువ ఖర్చుతో అయిపోయినది.
- విత్తనం ఖర్చు చాలా తగ్గినది.
- నాటు కూలీల ఖర్చు, కలుపు తీత కూలీల ఖర్చు కూడా చాలా తగ్గినది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం చాలా తగ్గినది.
- కరెంట్ వినియోగం కూడా బాగా తగ్గినది.
- చీడ పీడలు తక్కువగా ఉండటం వలన పురుగు మందులు మీద ఖర్చు బాగా తగ్గినది.
- పోల్చి చూస్తే శ్రీ పద్ధతిలోని మొక్కలు ఎక్కువ బలంగా వేళ్ళూనుకున్నాయి.

- సాధారణ పద్ధతితో పోలిస్తే పంట తొందరగా చేతికి వచ్చినది.
- ఈ పద్ధతిలో ఎక్కువ పిలకలు, ఒక్కొక్క పిలకకు ఎక్కువ గింజలు వస్తాయి మరియు ఎక్కువ పొడవు అయిన కంకులు వస్తాయి.

## శ్రీ పద్ధతికి పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- ఖరీఫ్ సీజన్‌లో వర్షాల వలన సరైన సమయంలో నాటు వేయడానికి ఇబ్బంది కలిగింది.
- ఈ పద్ధతిలో ఉన్న అన్నీ విధానాలను అర్థం చేసుకోవటానికి, నేర్చుకోవటానికి మొదట్లో కొంత ఎక్కువ సమయం పట్టింది.
- అన్ని పనులు సమయం ప్రకారం చేయాలి అన్న విషయం మొదట్లో చాలా ఇబ్బంది కలిగించింది.
- మొదటి సీజన్‌లో ఎత్తుమడి తయారు చేయడానికి కూడా కొంత ఇబ్బంది పడ్డాను.
- మొదటి సీజన్‌లో విత్తనం నాటడానికి సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఖర్చు అయినది.
- ఈ పద్ధతిలో కలుపు కూడా ఎక్కువ వస్తుంది. కావున సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే ఎక్కువ సార్లు కలుపు తీయాల్సి వచ్చింది.
- మొదటి సీజన్‌లో నాట్ల సమయంలో ఎలా నాటాలో కూలీలలకు అర్థం కాక చాలా ఇబ్బంది కలిగింది.
- మొదటి సీజన్‌లో ఈ పద్ధతి పాటించని రైతులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడటం వలన ఒక సమయంలో ఈ పద్ధతి ఇక జీవితంలో పాటించకూడదు అనిపించింది.

## శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- తక్కువ నీరు, తక్కువ విత్తనంతో ఈ విధానంలో వరి సాగు చేయవచ్చును. కానీ సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిని అవలంభించటం కొంచెం కష్టమైన ప్రక్రియ.
- అన్నీ పనులు సమయం ప్రకారం చేయాలి.
- దుక్కి ఎక్కువ లోతు లేకుండా చూసుకోవడం మంచిది. అందువలన వీడర్ దిగబడదు మరియు సులభంగా తిరుగుతుంది.
- నాటుపెట్టేటప్పుడు మొక్క పీకిన వెంటనే నాటుకోవాలి.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటు కోవాలి.
- నాటువేసిన మరుసటి రోజు పలుచగా నీరు పట్టాలి.
- మొదట్లో ఈ పద్ధతిలో నాటు వేయడానికి ఎకరానికి ఎక్కువ మంది కూలీలు పట్టవచ్చు. ఈ పద్ధతి అలవాటు అయిన తరువాత అంతకంటే తక్కువ మంది కూలీలతోనే నాటు వేయవచ్చు.

- ప్రతీరైతు ఈ పద్ధతిలోని అన్నీ విధానాలు సరైన సమయంలో పాటించినట్లయితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి.
- ఈ పద్ధతిలో చీడ పీడలు ఆశించటం చాలా తక్కువగా ఉంటుంది. మరియు పంట తొందరగా చేతికి వస్తుంది.
- రైతులు ఈ పద్ధతిలో విత్తనాన్ని, నీటిని, విద్యుత్‌ని, డబ్బుని అన్నింటిని ఆదా చేయవచ్చును. అంతేకాక ఈ పద్ధతిలో వరిని సాగు చేసినట్లయితే నేల సారం అభివృద్ధి చెందుతుంది. ఈ పద్ధతి చిన్న, సన్న కారు రైతులకు ఎక్కువ ప్రయోజనకారిగా ఉంటుంది.
- కొన్నిసార్లు అవసరమైనంత మంది కూలీలు దొరకటం కష్టం అవుతుంది. కాబట్టి అన్నీ సమయాలలో ఈ పద్దతి అవలంభించటానికి అనుకూలంగా ఉండదు.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో వీడర్ ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి. యంత్ర సహాయంతో నడిచే వీడర్లను ప్రవేశపెట్టాలి. ఏ ఏ నేలలో ఏ ఏ రకాలు పండించాలి, శ్రీ పద్ధతిలోని ఏఏ విధానాలను అవలంభించాలన్న సమాచారాన్ని రైతు లోకానికి తెలియచేయాలి. అందువలన రైతులకు ఈ విధానం పట్ల పూర్తి అవగాహన కలుగుతుంది. ఈ పద్ధతిలో పండించిన పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఎక్కువ ధర లభించేలా చూడాలి. గ్రామ స్థాయిలో వ్యక్తులను గుర్తించి, వారికి తగు శిక్షణలు ఇప్పించి, వారి ద్వారా రైతులకు ఈ పద్ధతి పట్ల అవగాహన కలుగచేయాలి. విత్తనం నాటడం వంటి విషయాల్లో కూలీలకు కూడా శిక్షణ యిప్పించాలి.

నేను శ్రీ పద్ధతిని మరియు సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు రాబడికి సంబందించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 115 రోజులు | 125 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 9 రోజులు | 32 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ (MOP) |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఫోరేట్ 10g గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | దుక్కులు | 1,500 | 2,300 |
| 2. | విత్తన ఖర్చు | 40 | 600 |
| 3. | నారుమడి తయారీ | 200 | 300 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 400 | 700 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 300 | 800 |
| 6. | ఎరువులు | 1,000 | 1,600 |
| 7. | పురుగు మందులు | - | 300 |
| 8. | పంటకోత, మార్పిడి | 1,580 | 1,500 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 4,940 | 8,100 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,125 | 2,625 |
| 11. | మొత్తం లాభం (9.50 / Kg ) | 39,187 | 24,937 |
| 12. | నికర లాభం | 34,247.00 | 16,837.00 |



## చింతల బాలయ్య

కట్కూర్, వరంగల్ జిల్లా

నా పేరు చింతల బాలయ్య, వయస్సు 48 సంవత్సరాలు. నేను గత 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. నేను పదవ తరగతి వరకు చదువుకున్నప్పటికీ, వ్యవసాయమే నా ప్రధాన వృత్తి. మాది వరంగల్ జిల్లా, కట్కూర్ గ్రామము. నాకు భార్య, నలుగురు పిల్లలు. నా పిల్లలందరూ చదువుకుంటున్నారు. నాకు ఉన్న 8 ఎకరాల పొలంలో 2 లేదా 3 ఎకరాలలో వరి పండిస్తాను. ఇక మిగిలిన పొలంలో పత్తి, కంది వంటి ఇతర పంటలు పండిస్తాను. సాగు నీటి కొరకు నాకు ఒక బోరు, ఒక చేద బావి ఉన్నవి. మేము సాధారణ పద్ధతిలో వరి నాటు పెట్టటానికి 20 రోజుల ముందు నుంచి పొలాన్ని మురగ పెట్టి 7,8 సార్లు దున్నుతాము. దానిలో 2 బస్తాల డి.ఏ.పి., 1 బస్తా 28-28 అనే రసాయనిక ఎరువులను చల్లి నాటు వేస్తాము. మొదటి సారి కలుపు తీసినప్పుడు యూరియా చల్లుతాము. సన్నటి పొట్ట దశలో పొటాష్ ఎరువును వేస్తాము. ఈ దశలో ఎలుకల బెడద నివారించడానికి గుళికలను వాడతాము. ఈ దశలో వచ్చే కోమటి పురుగు, మొవ్వ తొలుచు పురుగుల నివారణకు ఎండ్రిన్, ఎండో సల్ఫాన్ వంటి వాటిని పిచికారి చేస్తాము. ఈ పద్ధతిలో వరిసాగుకు ట్రాక్టర్లు, నాగళ్ళు, పారలు, కొడవళ్ళు వంటి వాటిని ముఖ్య సాధనాలుగా ఉపయోగిస్తాము. నేను సాధారణంగా IR64 రకాన్ని పండిస్తాను. ఇది సాధారణంగా 140 రోజులకు కోతకు వస్తుంది, 35-40 బస్తాల దిగుబడినిస్తుంది.

గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వర్షాలు సరిగా లేక పోవటం వలన సాగు నీరు సరిగా లభించక రైతాంగం వరి సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తద్వారా ఈ పంట పట్ల తమ ఆసక్తిని కూడా కోల్పోతున్నారు. ఇటువంటి పరిస్థితులలో 2007వ సంవత్సరములో CROPS సంస్థ వారు మా గ్రామాన్ని సందర్శించినప్పుడు నేను శ్రీ పద్ధతిలో వరి పండించడం గురించి విన్నాను. వారు గ్రామములో సమావేశము ఏర్పాటు చేసి, శ్రీ పద్ధతిలో వరి పండించటం వలన కలిగే లాభాలు అనగా తక్కువ విత్తనం, తక్కువ చీడపీడలు, తక్కువ నీటి వినియోగము, సాధారణ పద్ధతితో పోలిస్తే ఎక్కువ దిగుబడి వంటి వాటిని వివరించినప్పుడు నమ్మలేక పోయాను. ముఖ్యంగా తక్కువ నీటిని వినియోగించి వరి పండించవచ్చు అన్న విషయాన్ని

అసలు నమ్మలేక పోయాను. ఎందుకంటే తర తరాలుగా మేము వింటూ వస్తున్న విషయం ఏమిటంటే వరి పండించటానికి అధిక మొత్తంలో నీరు కావాలి అనేది. కాని CROPS సంస్థ వారు ఈ శ్రీ పద్ధతి గురించిన అన్ని వివరాలు, దాని చరిత్ర ఇతర ప్రాంతాల్లో ఇతర దేశాల్లో అది అవలంభించబడుతున్న విధానం, ఈ పద్ధతిలో పాటించవలసిన విధానాలు, కలిగే ప్రయోజనాలు, ఇబ్బందులు, సాంకేతిక అంశాలు అన్నింటి గురించి తెలియచేయడం. ఈ పద్ధతిని అవలంభించటానికి అవసరమైన శిక్షణను కూడా అందచేస్తామని తెలియచేయడంతో, ఒక ప్రయత్నం చేస్తే తప్పు లేదు కదా అని ముందుకు రావడం జరిగింది.

అలా ముందుకు వచ్చిన రైతులందరినీ గ్రూపులుగా విభజించి ఆ గ్రూపుల నుండి ఉత్సాహవంతులైన రైతులను కార్యకర్తలుగా నియమించి, వారికి శిక్షణను అందించారు. ఆ తరువాత ఆ కార్యకర్తలు మాకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించారు. ఇక రైతులందరికీ కావలసిన శిక్షణను, సాంకేతిక సహకారాన్ని రైతు క్షేత్ర పాఠశాలల ద్వారా, క్షేత్ర సందర్శనల ద్వారా, మా పొలాలను నిరంతరం సందర్శించడం ద్వారా అందచేసారు. అంతేకాక ఈ పద్ధతికి అవసరమైన మార్కర్లు, వీడర్లు, లింగాకర్షక బుట్టలు అందచేసారు. గడిచిన రెండు సీజన్లలో కూడా CROPS సంస్థ నుండి మాకు సంపూర్ణ సహకారం లభించినది. నేను ఈ రెండు సీజన్ల నుండి కూడా ఈ ప్రాంతంలో ఎక్కువ మంది పండించే IR64 రకాన్ని ఒక ఎకరం విస్తీర్ణంలో శ్రీ పద్ధతిలో సాగు చేస్తున్నాను. ఈ రెండు సీజన్ల నుండి కూడా శ్రీ పద్ధతిలో సాగు చేసిన వరికి ఏ విధమైన చీడ పీడలు ఆశించలేదు. మొదటి సీజన్‌లో అనుభవం లేక పోవటం వలన కలుపు తీయుటంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవటం, పంట దిగుబడి కూడా కొంత తక్కువ రావటం జరిగింది, కాని తరువాతి సీజన్‌లో ఇబ్బందులను అధిగమించటం వలన సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే అధిక దిగుబడిని సాధించాను. గత ఖరీఫ్‌లో సాంప్రదాయ పద్ధతిలో 40 బస్తాల దిగుబడి వస్తే శ్రీ పద్ధతిలో 60 బస్తాల దిగుబడి వచ్చినది. ఈ రెండు సీజన్లలో శ్రీ పద్ధతి పాటించిన వరి పొలానికి చీడ పీడల బెడద అసలు లేదు.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- మొదట నారుమడి గురించి భూమిని దున్ని ఆ తరువాత సేంద్రియ ఎరువును చల్లాను. ఆ తరువాత ఈ మడిని గడ్డి ఎంటుతో ఒక గజం వెడల్పు కల ఎత్తు మడిగా రూపొందించాను.
- విత్తనాన్ని 12 గంటల నానబెట్టి ఆ తరువాత నీరు వంపి గోతాంలో పోసి 24 గంటలు మండె కట్టాను. ఆ తరువాత మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.

- విత్తనాన్ని చల్లిన తరువాత బాగా మాగిన పొడి పెంట ఎరువు, వరిగడ్డి నాటిన విత్తనంపై పలుచగా చల్లాను. దీనివల్ల విత్తనం నేరుగా ఎండకు గురి కాకుండ ఉంది. అంతేకాక పక్షులు, చీమలు తినకుండా ఉన్నాయి. నారు మొలకెత్తిన తర్వాత పరిచిన గడ్డి తీసివేసాను. తర్వాత రెండు రోజులపాటు అవసరాన్ని బట్టి నారు మడిపై రోజు ఉదయం, సాయంత్రం నీళ్ళు చిలకరించాను.
- నాటడానికి ఒక రోజు ముందే పొలం దున్నడం, దమ్ము చేయడం, చదును చేయడం, మార్కర్‌తో గీతలు గీయటం వంటి పనులు పూర్తి చేసాను. నాటేటప్పుడు 10 రోజుల వయసు ఉన్న మొక్కలను విత్తనంతో సహా జాగ్రత్తగా పీకి ఒక్కొక్క మొక్కనే నాటించాము.
- పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము. పొలాన్ని నిరంతరం తడుపుతూ, ఆరబెడుతూ ఉండేలా చూసాము.
- రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వినియోగించటం జరిగింది. కానీ చీడ పీడలు అసలు లేకపోవటం వలన ఏ విధమైన పురుగు మందులు వినియోగించలేదు కలుపు తీసేటప్పుడు ఆ కలుపు భూమిలో కలిసిపోయేలా చర్యలు తీసుకోవటం జరిగింది.
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 10 రోజుల వ్యవధిలో 3 సార్లు కలుపు తీసాము.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- సాధారణ పద్ధతిలో 30 కిలో గ్రాముల విత్తనాన్ని వాడితే ఈ శ్రీ పద్ధతిలో కేవలం 2 కిలో గ్రాముల విత్తనం సరిపోయింది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం చాలా తగ్గినది. నా ఈ రెండు సీజన్ల అనుభవం ప్రకారం చూస్తే, ఒక ఎకరం సాంప్రదాయ పద్ధతికి పట్టే నీరు 2 ఎకరాల శ్రీ పద్ధతి పొలానికి సరిపోతుంది అని అర్థం చేసుకున్నాను.
- శ్రీ పద్ధతి అవలంభించిన రెండు సీజన్లలో కూడా చీడ పీడలు అసలు ఆశించలేదు. పోల్చి చూస్తే శ్రీ పద్ధతిలోని మొక్కలు ఎక్కువ బలంగా వేళ్ళూనుకున్నాయి.
- విత్తనం, కూలీ, ఎరువుల, పురుగు మందుల ఖర్చు తగ్గటం వలన పెట్టుబడులు తగ్గాయి. అంతేకాక శ్రీ పద్ధతిలో మాకు ఎక్కువ పశు గ్రాసం లభించింది. సాధారణ పద్ధతిలో మాకు ఎకరాకు ఒక ట్రాక్టర్ పశుగ్రాసం వస్తే ఈ శ్రీ పద్ధతిలో 1 1/2 ట్రాక్టరు పశుగ్రాసం వచ్చింది.

## శ్రీ పద్ధతికి పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

మొదటి సీజన్‌లో ఒక్కొక్క మొక్కను నాటేలా ఒప్పించటానికి మహిళా కూలీలతో

ఇబ్బందిని ఎదుర్కొన్నాను. అదే విధంగా మొదటి సీజన్‌లో ఎత్తైన మడిని తయారు చేయడానికి కూడా కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నాము. మొదటి సీజన్‌లో విత్తనం నాటడానికి సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఖర్చు అయినది. కానీ రెండవ సీజన్ వరకు కూలీలు అలవాటు పడటం వలన ఈ ఇబ్బంది తొలగింది. పోల్చి చూస్తే రెండవ సీజన్‌లో కూలీల ఖర్చు కూడా తగ్గినది. మొదటి సీజన్‌లో వీడర్ తిప్పటంలో కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నప్పటికీ, రెండవ సీజన్ వరకు అలవాటు పడటం వలన కొంత సులభం అయింది. మొదటి సీజన్‌లో ఈ శ్రీ పద్ధతిని అవలంభించని రైతులనుండి విమర్శలను ఎదుర్కోవటం ఇబ్బందిని కలిగించింది.

## ఈ శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

నా అనుభవం ప్రకారం శ్రీ పద్ధతులైన ఎత్తు మడి ఏర్పాటు చేసుకోవటం, సరైన సమయంలో సరైన పద్ధతిలో విత్తనం నాటడం, వీడర్‌తో కలుపు తీయడం ఖచ్చితంగా అవలంభించినట్లయితే సాధారణ పద్ధతి కంటే అధిక మొత్తంలో దిగుబడి వస్తుంది అని తెలుసుకున్నాను. అదే విధంగా కూలీలకు సరైన శిక్షణ ఇచ్చినట్లయితే విత్తనం నాటేటప్పుడు, కలుపు తీసేటప్పుడు వారికి పెద్దగా ఇబ్బంది కలగదు అని తెలుసుకున్నాను. వీడర్ తిప్పటం అనేది శ్రమతో కూడిన పని అయినప్పటికీ దుక్కులు లోతుగా దున్నకుండా ఉంటే ఈ సమస్యను అధిగమించవచ్చు అని గ్రహించాను. ఈ పద్ధతిలో తక్కువ నీటితో వరి పండించవచ్చును కావున మెట్ట ప్రాంత రైతులకు ఇది వరప్రసాదంగా పని చేస్తుంది అని అర్థం చేసుకున్నాను.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతి ఎంతో సమర్ధవంతమైన పద్ధతి అయినప్పటికీ ఈ పద్ధతి గురించి రైతాంగానికి ఎక్కువగా తెలియపోవటం వలన ఈ పద్ధతికి ప్రసార సాధనాల ద్వారా ఎక్కువ ప్రచారం కలిగించి ఈ శ్రీ పద్ధతి గురించి అవగాహన తెలియచేయాలి. ఈ పద్ధతిని అవలంభించటానికి అడ్డంకులుగా నిలిచే పైన వివరించిన కొన్ని సమస్యలు అంటే ఎక్కువ శ్రమతో కలుపు తీయాల్సి రావటం, ఈ పద్ధతిని పాటించడానికి నైపుణ్యం అవసరం కావడం, ఈ పద్ధతిలో నాటు వేయడం కొంచెం కష్టంగా ఉండటం వంటి సమస్యలను యంత్ర సహాయంతో నడిచే వీడర్లను అందచేయడం ద్వారా, రైతులకు, కూలీలకు శిక్షణలు అందించడం ద్వారా, సాంకేతిక సంస్థల నుండి తగు సహకారం అందచేయ బడుతుందనే భరోసా కలిగించడం వలన ఈ శ్రీ పద్ధతిని ఎక్కువ మంది రైతులు అవలంభించేలా చూడాలి. దుక్కి దున్నే పద్ధతులలో మార్పులు తీసుకు రావడం ద్వారా, వీడర్లను అభివృద్ధి చేయడం ద్వారా, స్త్రీలు కూడా వీడర్లు తిప్పేలా చేసినట్లయితే ఈ విధానాన్ని ఎక్కువ మంది రైతుల ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టే అవకాశం ఉంటుంది.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 110 రోజులు | 120 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 9 నుండి 10 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఎకలెక్స్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | దుక్కులు | 1,500 | 2,500 |
| 2. | విత్తన ఖర్చు | 60 | 600 |
| 3. | నారుమడి తయారీ | 200 | 300 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 500 | 600 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 500 | 500 |
| 6. | ఎరువులు | 400 | 1,300 |
| 7. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | 300 |
| 8. | పంటకోత, మార్పిడి | 1,500 | 1,500 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 4,660 | 7,600 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,500 | 3,000 |
| 11. | మొత్తం లాభం (9.50 / Kg ) | 42,750 | 28,500 |
| 12. | నికర లాభం | 38,090.00 | 20,900.00 |



## మేకబొడ్డు అయిలయ్య

కట్కూర్, వరంగల్ జిల్లా

కుటుంబ సభ్యులందరూ వ్యవసాయం చేసే కుటుంబం మాది. మేము మొత్తం తొమ్మిది మందిమి. నా పేరు మేకబొడ్డు అయిలయ్య, వయస్సు 45 సంవత్సరాలు, మాకు 6 ఎకరాల భూమి ఉన్నది. అందులో 2 లేదా 3 ఎకరాలలో వరి పండిస్తాము. ఈ పొలానికి బోరు బావి సౌకర్యం కలదు. ఇక మిగిలిన పొలంలో కంది, మొక్కజొన్న, పత్తి వంటి ఇతర పంటలు పండిస్తాను. నాకు పిల్లలు లేరు, మాది ఉమ్మడి కుటుంబము, నేను గత 5 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. ఇంతకు ముందు నేను హైదరాబాదు నగరంలో రోజు కూలీగా పని చేసేవాడిని. కానీ దాని కంటే వ్యవసాయమే బాగుంటుంది అనిపించి మా గ్రామానికి తిరిగి వచ్చి వ్యవసాయం చేస్తున్నాను. ఈ అయిదు సంవత్సరాల నుండి కూడా మేము సాంప్రదాయ పద్ధతిలోనే వరి పండిస్తున్నాము. ఈ సాంప్రదాయ పద్ధతికి మేము సాధారణంగా నాగలి, గొర్రు, పార, కొడవలి వంటి వాటిని ముఖ్య సాధనాలుగా వినియోగిస్తాము. ఈ పద్ధతిలో నేను సాధారణంగా ఎకరానికి 2 బస్తాల డి.ఏ.పి. అడుగు మందుగా $1\,^1/_2$ బస్తాల యూరియాను పై మందుగా వాడుతూ వస్తున్నాను. అంతేకాక పొలం అసలు దున్నక ముందు రెండు ట్రాక్టర్ల పశువుల పెంట పోస్తాను. పొట్ట దశలో పొటాష్ ఎరువును కూడా వినియోగిస్తాను. గత రెండు మూడు సంవత్సరాలుగా నా పొలానికి కాండం తొలుచు పురుగు, దోమకాటు ఆశిస్తున్నది. దీని నివారణ కొరకు మోనోక్రోటోఫాస్, ఎండో సల్ఫాన్ మందులను పిచికారి చేస్తూ కెల్డాన్ గుళికలను వాడి ఉన్నాను. గత 4, 5 సంవత్సరాల నుండి ఈ సాంప్రదాయ పద్ధతిలో దిగుబడి 29 నుండి 35 బస్తాల మధ్య వస్తుంది.

CROPS సంస్థకు ముందు శ్రీ పద్ధతిలో వరి పండించటం గురించి నాకు ఎవరూ చెప్పలేదు. సంస్థ వారు మొదట చెప్పినప్పుడు పెద్దగా నమ్మలేదు కూడా. శ్రీ వరి అంటే ఒక రకమైన వరి అనుకున్నాను. కానీ, ఇది ఒక పద్ధతి అని చెప్పి దీంట్లో పాటించవలసిన విధానాలను తెలియచేసినప్పుడు అర్థం అయింది కానీ నమ్మలేక పోయాను. ఎంతో నీరు ఉంటే కాని పండని వరి, తక్కువ నీటితో ఎలా పండుతుంది అని అనుకున్నాను. కానీ సంస్థ వారు తాము దగ్గర ఉండి కావలసిన అన్నీ రకాల సహకారం

అందిస్తామని చెప్పడం, గ్రామంలో ఒకరిద్దరికి పూర్తి శిక్షణ యిచ్చి, వారి ద్వారా ఈ పద్ధతిలో సాగు చేయటానికి ముందుకు వచ్చిన రైతులందిరికీ సహకారం అందచేసేలా ఏర్పాటు చేస్తామని, అందుకు వారికి సంస్థ నుండి నెల నెలా కొంత జీతం కూడా ఇస్తుందని; అంతేకాక సంస్థ తరుపునుండి కూడా సిబ్బంది గ్రామాన్ని, రైతు పొలాలను సందర్శించి తగు సూచనలు అందచేస్తారని తెలియ చేయడంతో గ్రామం నుండి అనేక మంది రైతులు ముందుకు వచ్చారు. వారితో పాటు నేను కూడా 2007 రబీలో IR 64 రకాన్ని, ఆ తరువాత ఖరీఫ్‌లో 1010 రకాన్ని ఒక ఎకరం విస్తీర్ణంలో పండించాను. మొదట కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నాము, కానీ దిగుబడి ఎక్కువ రావటంతో తరువాత సీజన్‌లో కూడా ఇదే పద్ధతిని పాటించాము. ఇక ముందు ముందు కూడా ఇదే పద్ధతిలో వరి పండిస్తాము. కాని ఇందులో కొంచెం ఎక్కువ కష్టం ఉండటం వలన ఎక్కువ ఎకరాల్లో పండించలేక పోతున్నాము. కానీ, నాలుగైదు సార్లు ఈ పద్ధతికి అలవాటు పడితే ఎక్కువ ఎకరాల్లో కూడా పండించగలము అని అనుకుంటున్నాము. ఈ పద్ధతిలో కొద్ది శాతము పంటకు మాత్రమే కాండము తొలుచు పురుగు మరియు ఆకు చుట్టు తెగులు ఆశించింది. వీటి నివారణకు ఎండో సల్ఫాన్ గుళికలను వాడటం జరిగింది. ఎరువులు మాత్రము సేంద్రియ ఎరువులతో పాటు డి.ఏ.పి., యూరియా వంటి కొంత రసాయనక ఎరువులు కూడా ఉపయోగించాము. పండించిన రెండు సీజన్లలో కూడా CROPS సంస్థ వారు మంచి సహకారం అందించారు. రైతు బడుల ద్వారా కూడా చాలా విషయాలు నేర్పించారు. ఇక మాకు మార్కర్లు, వీడర్లు, పురుగులు పడే బుట్టలు కూడా అందించారు. వేరే జిల్లాలకు తీసుకుని వెళ్ళి అక్కడి రైతులు ఎలా పండిస్తున్నారో కూడా తెలియచేసారు. వారు చెప్పిన ప్రకారం ఈ పద్ధతిలో ఈ క్రింది విధానాలు పాటించాను.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- ముందుగా ఎత్తు మడి తయారు చేసుకొని; దానిపై నానబెట్టి, మండెకట్టి, మొలకెత్తిన విత్తనాలను చల్లాను.
- నారు మడి చుట్టు కాలువ తీసి అందులో నీరు బెట్టాను.
- నారు పెరిగే లోపల పొలాన్ని దున్నుకొని, దమ్ము చేసి దానితో పాటే మార్కరుతో గీతలు గీసాము.
- ఆ తరువాత లేత మొక్కలు అంటే 13 రోజుల మొక్కలను దూర దూరంగా నాటాము.
- నాటు వేసిన 10 రోజులకు ఒకసారి వీడర్ తిప్పి పశువుల పెంట పొలంలో పోసాను.
- ఆ తరువాత కూడా మూడు సార్లు వీడర్‌తో కలుపు తీయించాము. కానీ ఏ విధమైన కలుపు మందులు వాడలేదు.

- వీడర్ ద్వారా తీయలేని కలుపు మొక్కలను కూలీలను పెట్టి చేతితో ఏరి వేయించాము.
- కలుపు మొక్కలను భూమిలోనే కలిసిపోయేలా చేసాము.
- ఆరు తడి పంటలకు నీరు ఎలా పెడతామో ఈ పద్ధతిలో కూడా నీరు అలానే పెట్టాము.

**సాంప్రదాయ పద్ధతిలో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు**

- పది రోజులకు ముందుగానే కోతకు వచ్చినది.
- విత్తన ఖర్చు తక్కువ, ఎకరాకు 2 కిలోలు మాత్రమే వాడాము.
- పై పై దుక్కులు కాబట్టి, దుక్కి దున్నటానికి కూడా తక్కువ ఖర్చు తక్కువ అయింది.
- చాలా తక్కువ నీటితో పంట పండించాము.
- ఒక ఎకరా పొలానికి ఒక సెంటు నారు మడి మాత్రమే సరిపోయింది. అదే సాధారణ పద్ధతిలో 5 సెంట్ల నారు మడి అవసరం అయింది.
- నాటు కూలీల ఖర్చు, కలుపు తీత కూలీల ఖర్చు కూడా చాలా తగ్గినది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం చాలా తగ్గినది.
- చీడ పీడలు తక్కువగా ఉండటం వలన పురుగు మందుల మీద ఖర్చు బాగా తగ్గినది.
- సాధారణ పద్ధతిలో గాలికి వడ్లు రాలిపోవటం, మొక్క పడిపోవటం జరిగింది. అదే శ్రీ పద్ధతిలో నాటిన మొక్క బలంగా ఉండటం వలన అటువంటి నష్టం ఏమి జరగలేదు. ఎలుకలు బెడద కూడా చాలా తగ్గినది.
- విత్తనం, కూలీ, ఎరువులు మరియు పురుగు మందుల ఖర్చు తగ్గటం వలన పెట్టుబడులు తగ్గాయి.
- శ్రీ పద్ధతిలో ఖర్చు తగ్గి, దిగుబడులు ఎక్కువ రావటం వలన నాకు నికర ఆదాయం ఎక్కువగా వచ్చినది.

**శ్రీ పద్ధతికి పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు**

- వీడర్ తిప్పటం చాలా కష్టం, ఆడ కూలీలు తిప్పలేక పోతున్నారు.
- ఎత్తుమడి తయారు చేసుకోవటం మొదట్లో ఇబ్బంది అయింది.
- ఆడ కూలీలను ఒక్కొక్క మొక్కను నాటేలా ఒప్పించటం కష్టం అయింది.
- నీరు పెట్టడం, మళ్ళీ ఆరపెట్టడం అంటే మొదట్లో ఇబ్బంది అనిపించింది.
- ఈ పద్ధతిని పాటించని రైతులు మమ్మల్ని ఎగతాళి చేస్తుంటే బాధగా అనిపించింది. కానీ

ఆ తరువాత వాళ్ళే ఈ పద్ధతిని ఎలా పాటించాలి అని అడుగుతున్నారు.

- కలుపు కూడా ఎక్కువ వస్తుంది. అందుకనే కలుపు ఎక్కువసార్లు తీయాల్సి వస్తుంది. అందువలన ఒక్కోసారి కూలీలు దొరకక ఇబ్బంది అవుతుంది.
- ఈ పద్ధతిలో పండించిన పంటకు కూడా మామూలు ధరే వస్తుంది అని తెలిసినప్పుడు మొదట్లో కాస్త నిరుత్సాహం అనిపించింది, కాని ఎక్కువ దిగుబడి వచ్చేసరికి ఆ బాధ పోయింది.

## శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- పంట తొందరగా చేతికి వస్తుంది.
- అన్ని రకాల వరిని పండించుకోవచ్చును.
- తక్కువ వయసు ఉన్న లేత మొక్కలను (10 నుండి 12 రోజుల) మాత్రమే నాటుకోవాలి.
- పొలంలో ఎక్కువైన నీరు బయటకు పోవటానికి కాలువలు ఏర్పాటు చేసుకొని పొలం ఆరినప్పుడల్లా నీరు పెట్టుకోవాలి.
- నారు మడి చుట్టు కాలువ తీసి అందులో నీరు నింపాలి అందువలన మొక్కలకు ఇబ్బంది కలుగకుండా నీరు అందుతుంది.
- వీడర్ తిప్పి కలుపు భూమిలో కలిసిపోయేలా చేయటం వలన అలా చేసిన ప్రతీసారి పచ్చి రొట్ట ఎరువు భూమికి చేరుతుంది.
- సరైన పద్ధతిలో సరైన సమయం ప్రకారం చేస్తే ఇబ్బందులు తగ్గుతాయి అంతేకాక దిగుబడి కూడా ఎక్కువ వస్తుంది.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతి రైతాంగానికి ఎక్కువగా తెలియకపోవటం వలన ఈ పద్ధతికి ప్రసార సాధనాల ద్వారా ఎక్కువ ప్రచారం కలిగించి, ఈ శ్రీ పద్ధతి గురించి అవగాహన తెలియచేయాలి. ఈ పద్ధతిలో వీడర్‌ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి. శ్రీ పద్ధతిలో పండించిన వరికి అధిక ధర ఇప్పించినట్లయితే రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఈ పద్ధతిలో తక్కువ నీటితో వరి పండించవచ్చు కావున మెట్ట సేద్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పద్ధతిని ఎక్కువమంది రైతులు అవలంభించేలా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చర్యలు చేపట్టాలి.

నేను శ్రీ పద్ధతినీ, సాంప్రదాయ పద్ధతినీ కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 113 రోజులు | 122 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 35 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 12 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ MOP |
| 6. | పురుగు మందులు | ఎండో సల్ఫాన్ | ఎండో సల్ఫాన్ |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 20 | 500 |
| 2. | నారుమడి తయారీ | 200 | 300 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 600 | 2,000 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 480 | 950 |
| 5. | ఎరువులు | 1,020 | 1,250 |
| 6. | పురుగు మందులు | 200 | 450 |
| 7. | పంటకోత, మార్పిడి | 2,200 | 2,400 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 4.720 | 7,850 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 3,600 | 2,625 |
| 10. | మొత్తం లాభం (9.50 / Kg ) | 34,200 | 24,937 |
| 11. | నికర లాభం | 29,480.00 | 17,087.00 |



# గడిపే మధుసూధన్

కట్ట్యార్, వరంగల్ జిల్లా

నా పేరు గడిపే మధుసూధన్, ఇంటర్ మీడియట్ వరకు చదువుకున్నాను. వరంగల్ జిల్లా, బచ్చన్న పేట మండలంలోని కట్ట్యార్ గ్రామానికి చెందిన రైతును. నా వయస్సు 40 సంవత్సరాలు. నేను ఇంటర్ మీడియట్ పూర్తి చేసినప్పటికీ వ్యవసాయం పట్ల ఉన్న మక్కువతో గత 15 సంవత్సరాలుగా వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనం కొనసాగిస్తున్నాను. నాకు 5 ఎకరాల పొలం ఉన్నది. అందులో 2 ఎకరాలలో వరి పండిస్తాను, మిగిలిన పొలంలో మొక్క జొన్న, పత్తి, కందులు మరియు ఆముదం వంటి ఇతర పంటలు పండిస్తాను. నేను, నా భార్య, నా తండ్రి మాత్రమే వ్యవసాయంలో పాలు పంచుకుంటాము. నాకు పిల్లలు లేరు. మేము సాధారణ పద్ధతిలో వరిసాగు విధానంలో మొదటిసారిగా దుక్కి దున్నే సందర్భంలో 6, 7 ఎద్దుల బండ్ల పశువుల పెంటను పోస్తాము. ఎరువుల విషయంలో ఎక్కువగా ఎకరానికి 2 బస్తాల డి.ఏ.పి. నాట్లు వేసే సమయంలో దుక్కిలో పోయటమే కాకుండా మొక్కల పెరుగుదలకు 2 బస్తాల యూరియాను మూడు ధఫాలుగా చల్లుతాము. ఇక గింజ ఏర్పడే దశలో 1 బస్తా పొటాష్‌ను వాడుతాము. కాండం తొలుచు పురుగు ఆశించినప్పుడు ఫోరేట్ గుళికలు, మొవ్వ తొలుచుపురుగు వచ్చినప్పుడు క్లోరోఫైరిఫాస్, ఎకలెక్స్ గుళికలు వాడుతాము. సాధారణంగా నాకు ఈ పద్ధతిలో 35 నుండి 40 బస్తాల దిగుబడి వస్తుంది.

గతంలో నేను శ్రీ వరి గురించి అక్కడక్కడ విని ఉన్నప్పటికీ ఇది వరి పండించే ఒక విధానమని, ఏ రకమైన వరినైనా ఈ విధానంలో పండించవచ్చనీ, ఈ విధానంలో పాటించవలసిన పద్ధతులు, ఈ విధానం వలన లాభాలు మొదలగునవి అన్నీ 2007 సంవత్సరపు రబీ సమయంలోనే CROPS సంస్థ వారి వద్ద నుండి తెలుసుకున్నాను. వారి సహకారంతో శిక్షణను పొందాను. గడిచిన రెండు సీజన్‌లలో 6066 రకం వరిని ఒక ఎకరం పొలంలో శ్రీ పద్ధతిలో పండించి, సాధారణ పద్ధతిలో కంటే సుమారు 15 బస్తాల (సుమారు 55) దిగుబడిని అధికంగా పొందాను. కాని ఇందులో కొంచెం ఎక్కువ కష్టం ఉండటం వలన ఎక్కువ ఎకరాల్లో పండించలేక పోతున్నాము. నాలుగైదు సార్లు ఈ పద్ధతికి అలవాటు పడితే

ఎక్కువ ఎకరాల్లో కూడా పండించగలము అని అనుకుంటున్నాము. ఈ రెండు సీజన్‌లలో శ్రీ పద్ధతిలో పండించిన వరిలో అతి తక్కువ శాతానికి మొవ్వ తొలుచు పురుగు ఆకర్షించింది. దీనిని క్లోరోఫైరిఫాస్ మందు ఉపయోగించి నివారించ గలిగాము. ఈ కాలంలో సంస్థ యిచ్చిన సహకారం, వారిచే నియమించబడిన గ్రామ కార్యకర్తల సహకారంతో వారు ఏర్పాటు చేసిన రైతు బడుల ఆధారంగా ఈ పద్ధతిలోని మెళుకువలను తెలుసుకున్నాను.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- ముందుగా ఎత్తు మడి తయారు చేసుకున్నాను.
- 2 కిలోల విత్తనాన్ని నానబెట్టి, ఆ తరువాత మండె కట్టగా వచ్చిన మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.
- నారు మడి చుట్టు కాలువ తీసి అందులో నీరు బెట్టాను.
- నారు పెరిగే లోపల ప్రధాన పొలాన్ని తక్కువ లోతుగా దున్నుకున్నాను. దానితో పాటే మార్కరుతో గీతలు గీసాము.
- 12 రోజులయ్యేసరికి నారు పీకి పొలంలో నాటుకున్నాము.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటాము.
- నాటు వేసిన తర్వాత నాటేటప్పుడు ఉన్న నీటిని బయటకు పంపించాము.
- నాటు వేసిన 10 రోజులకు ఒకసారి, ఆ తరువాత మూడు సార్లు వీడర్‌తో కలుపు తీయించాము.
- వీడర్ ద్వారా తీయలేని కలుపు మొక్కలను కూలీలను పెట్టి చేతితో ఏరి వేయించాము.
- ఏ విధమైన కలుపు మందులు ఉపయోగించలేదు.
- కలుపు మొక్కలను భూమిలోనే కలిసిపోయేలా చేసాము. ఇలా చేయడం వలన ఇది మాకు పచ్చి రొట్ట ఎరువుగా ఉపయోగపడింది.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- పది రోజులకు ముందుగానే కోతకు వచ్చినది.
- తక్కువ విత్తనం (కేవలం 2 కిలోల విత్తనం) తో సాగుచేసాము.
- పై పై దుక్కులు కాబట్టి, దుక్కి దున్నటానికి కూడా తక్కువ ఖర్చు తక్కువ అయింది.
- ఒక ఎకరా పొలానికి ఒక సెంటు నారు మడి మాత్రమే సరి పోయింది. అదే సాధారణ పద్ధతిలో 5 సెంట్ల నారు మడి అవసరం అయింది.
- చీడ పీడలు చాలా తక్కువ మొత్తంలో ఆశించాయి.
- ఎలుకల బెడద కూడా చాలా తగ్గినది.

- తాలు గింజలు తక్కువ వచ్చాయి. గింజ బరువు కూడా ఎక్కువ ఉన్నది.
- మొక్క బలంగా పెరగటం వలన ఖరీఫ్‌లో వచ్చిన తుఫాన్ గాలులకు పడిపోలేదు.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో కనీసం 13 బస్తాల దిగుబడి అధికంగా వచ్చినది.

## శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదట్లో అన్ని విషయాలు కొత్తగా అనిపించాయి.
- నాట్లు వేసేటప్పుడు ఇబ్బంది అయింది. ఒక్కొక్క మొక్క నాటాలి అంటే కూలీలు వినలేదు.
- ఎత్తుమడి తయారు చేసుకోవటం మొదట్లో ఇబ్బంది అయింది.
- కలుపు కూడా ఎక్కువ వస్తుంది. అందుకనే కలుపు ఎక్కువ సార్లు తీయాల్సివస్తుంది.
- ఆరు తడి పంటలాగా నీరు పెట్టాలి అంటే ఇబ్బంది అనిపించింది.
- ఆడ కూలీలు వీడర్ తిప్పలేక పోతున్నారు.

## శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- ఈ పద్ధతిలో 10-12 రోజుల లేత మొక్కలను మాత్రమే నాటుకోవాలి.
- మొక్కలను చాలా జాగ్రత్తగా నాటుకోవాలి.
- నారు మడి ప్రధాన పొలానికి దగ్గరలో ఉండాలి.
- కలుపును వీడర్ ద్వారానే తీయాలి. కలుపు మందులు అసలు వాడకూడదు.
- ఈ పద్ధతిలో పొలంలో నీరు నిలుప కూడదు. పొలాన్ని తడుపుతూ ఆరబెడుతూ ఉండాలి.
- ఈ శ్రీ పద్ధతిలో దోమపోటు రాదు. ఇతర చీడ పీడలు కూడా చాలా తక్కువగా ఆశిస్తాయి.
- మొక్క బలంగా పెరగటం వలన గాలికి పడిపోదు. అందువలన గింజ కూడా రాలదు.
- ఒక్కొక్క మొక్కకు పిలకలు చాలా వస్తాయి. అదే విధంగా కంకిలో ఎక్కువ గింజలు వస్తాయి.
- సాళ్ళ మధ్య సందులు ఉండి పాములకు ఎలుకలు కనిపించి ఎలుకలు లేకుండా చేస్తాయి.
- తాలు గింజలు చాలా తక్కువగా ఉంటాయి. గింజ బరువు కూడా ఎక్కువగా ఉంటుంది.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో వీడర్‌ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున ప్రస్తుతం అందుబాటులో వున్న వీడర్లను అభివృద్ధి చేయాలి. స్త్రీలు కూడా వీడర్లు తిప్పేలా తయారు చేసినట్లయితే ఈ విధానాన్ని ఎక్కువ మంది రైతులు ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టే అవకాశం ఉంటుంది.

- ఈ పద్ధతిని అవలంభించడానికి తగిన శిక్షణ అవసరం కాబట్టి పెద్ద ఎత్తున శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు, కూలీలకు తగిన శిక్షణలు ఇప్పించాలి.
- ఈ పద్ధతిలో నాటు వేయడం అనేది నైపుణ్యంతో కూడినది కావున నాటు వేయడానికి కూడా ఏవైనా పరికరాలు అందుబాటులోకి తెస్తే చాలా ఉపయోగం ఉంటుంది.
- శిక్షణ పొందిన కార్యకర్తలు గ్రామ స్థాయిలో ఉన్నట్లయితే, వరి పండించే రైతులు ఎక్కువ మంది ఈ పద్ధతిని అవలంభించటానికి ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది.
- ఈ పద్ధతి వలన కలిగే ప్రయోజనాలను రేడియో, టెలివిజన్ల ద్వారా తెలియచేస్తూ, ఈ పద్ధతి అవలంభించడానికి పాటించాల్సిన విధానాలను కూడా ప్రసారం చేయాలి.
- ఏ ఏ నేలలో ఏ ఏ రకాలు పండించాలీ, శ్రీ పద్ధతిలోని ఏ ఏ విధానాలను అవలంభించాలన్న సమచారాన్ని రైతు లోకానికి తెలియచేయాలి. అందువలన రైతులకు ఈ విధానం పట్ల పూర్తి అవగాహన కలుగుతుంది.

నేను శ్రీ పద్ధతినీ, సాంప్రదాయ పద్ధతినీ కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | 6066 | 6066 |
| 2. | కాల పరిధి | 118 రోజులు | 135 రోజులు |
| 3. | విత్తనం | 2 కిలో గ్రాములు | 40 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 14 రోజులు | 35 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ MOP |
| 6. | పురుగు మందులు | క్లోరోఫైరిఫాస్ గుళికలు | ఫోరేట్, ఎకలెక్స్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 20 | 500 |
| 2. | నారుమడి తయారీ | 100 | 250 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 700 | 1,800 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 400 | 900 |
| 5. | ఎరువులు | 900 | 1,100 |
| 6. | పురుగు మందులు | 200 | 600 |
| 7. | పంటకోత, మార్పిడి | 2,000 | 2,000 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 4.320 | 7,150 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 3,975 | 2,850 |
| 10. | మొత్తం లాభం (9.50 / Kg ) | 37,762 | 27,075 |
| 11. | నికర లాభం | 33,442.00 | 19,925.00 |

## కొరివి భిక్షపతి

### కట్కూర్, వరంగల్ జిల్లా



నాది వరంగల్ జిల్లాలోని బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామము. నేను ఉపాధ్యాయుడిగా (తెలుగు పండిట్) రిటైర్ అయి, గత రెండు సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. ప్రస్తుతం నా ప్రధాన వృత్తి వ్యవసాయమే. నా పేరు కొరివి బిక్షపతి, వయసు 60 సంవత్సరాలు. నాకు ముగ్గురు పిల్లలు అందులో ఇద్దరు ఆడ పిల్లలు ఒక బాబు. ఒక ఆడ పిల్లకు పెళ్ళి అయిపోగా, ఇంకొక పాప ప్రస్తుతం చదువు కుంటున్నది. నా కొడుకు మాత్రం పదవ తరగతి వరకు చదువుకొని నాతో పాటే వ్యవసాయం చేస్తున్నాడు. నాకు 2 ఎకరాల పొలం ఉన్నది. ఈ రెండు ఎకరాలలో వరి మాత్రమే పండిస్తున్నాను. సాధారణ పద్ధతిలో తొలకరి కురవగానే ఖరీఫ్ సీజన్‌లో దున్నటానికి ముందు 4, 5 ఎద్దుల బండ్ల పశువుల పెంటను చల్లుతాను, పొలంలో విత్తనం చల్లి, నారు మడి పెంచేటప్పుడు విత్తనాలను బావిస్టాన్ పొడిలో ముంచి, నిద్రాణ స్థితిని పోయేవరకు మండె కట్టి నారు పోస్తాను. ఖరీఫ్, రబీ సీజన్లలో విత్తనం నాటే సమయంలో ఎకరానికి 2 బస్తాల డి.ఏ.పి. కానీ, 1 బస్తా డి.ఏ.పి, 1 బస్తా 17.17.17 లను అడుగు మందుగా వాడతాను. చీడపీడలు ఆశించినప్పుడు అయా రోగాన్ని, పురుగుని అనుసరించి ఎండో సల్ఫాను, క్లోరోఫైరిఫాస్, ఫోరేట్ గుళికలను వినియోగిస్తాను. గత రబీ సీజన్‌లో మొవ్వ తెగులు ఆశించినప్పుడు క్లోరోఫైరిఫాస్ వాడాను, కానీ ఫలితం అనుకున్నంతగా రాలేదు. అందువలన అప్పుడు దిగుబడి 29 బస్తాలే వచ్చినది. కాని సాధారణంగా నాకు సాంప్రదాయ పద్ధతిలో 35 బస్తాల వరకు దిగుబడి వస్తున్నది.

ఉపాధ్యాయుడిగా (తెలుగు పండిట్) రిటైర్ అయి వ్యవసాయం చేద్దాం అని అనుకున్నప్పుడు, మా ప్రాంతంలో పండించే పంటల గురించి చాలా సమాచారం సేకరించాను. అందులో శ్రీ పద్ధతిలో వరి పండించటం ఒకటి. కానీ దానికి శిక్షణ, సహకారం అవసరం అనిపించి, ఈ పద్ధతిని పాటించలేక పోయాను. అంతేకాక, ఈ పద్ధతికి అవసరమైన మార్కర్లు, వీడర్లు దొరుకుతాయో లేదో అని కూడా అనిపించి గతంలో ఈ పద్ధతిని పాటించలేక పోయాను. కాని CROPS సంస్థ వారు 2007 సంవత్సరపు రబీకు ముందు గ్రామాన్ని

సందర్శించి కళాజాత కార్యక్రమం ద్వారా ఈ పద్ధతి గురించి వివరించినారు. ఈ పద్ధతిని పాటించడానికి ముందుకు వచ్చే రైతులకు అన్నీ రకాల సహకారం అందచేస్తామని తెలియ చెయ్యడంతో పాటు సంస్థ తరుపు నుండి కూడా సిబ్బంది గ్రామాన్ని, రైతు పొలాలను క్రమం తప్పకుండా సందర్శిస్తారని, తగు సూచనలు అందచేస్తామని తెలియ చేయడంతో నేను సంతోషంతో ముందు వచ్చాను. సంస్థ అందించే సహాయ సహకారాలతో పాటు, ఈ కార్యక్రమం వెనుక WWF, ICRISAT లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని తెలియడంతో ఈ పద్ధతిని విజయవంతంగా పాటించ గలమన్న నమ్మకం కలగింది. మా నమ్మకానికి అనుగుణంగానే గత రెండు సీజన్లలో కూడా సంస్థ పూర్తి సహకారాన్ని అందించింది. అంతేకాక ICRISAT నుండి కూడా డాక్టరు వినోద్ గౌడ్ గారు మరియు ఇతర సీనియర్ శాస్త్రవేత్తలు మా గ్రామాన్ని, పొలాలను సందర్శించి తగు సూచనలు అందించారు. CROPS సంస్థ వారు మార్కర్లు, వీడర్లు, అందచేయడంతో పాటు, మా రైతులను క్షేత్ర సందర్శనకు తీసుకుని వెళ్ళి ఆ ప్రాంత రైతుల అనుభవాలను, వారు సాధిస్తున్న దిగుబడులను, వారు ఎదుర్కొన్న ఇబ్బందులను, వాటిని అధిగమించిన తీరును తెలుసుకున్నాము. ఈ సందర్శనలో నేర్చుకున్న అనేక విషయాలు మేము శ్రీ పద్ధతిని పాటించే క్రమంలో చాలా ఉపయోగపడ్డాయి. అంతేకాక రైతు బడుల ద్వారా మేము నేర్చుకున్న విషయాలు, సంస్థ తరుపున కార్యకర్తలు తెలిపిన విషయాల సహకారంతో మేము ఈ పద్ధతిలోని ఈ క్రింది విధానాలను పాటించి అధిక దిగుబడులను సాధించగలిగాము.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- మొదట నారుమడి గురించి భూమిని దున్ని ఆ తరువాత సేంద్రియ ఎరువును చల్లాను. ఆ తరువాత ఈ మడిని గడ్డి ఎంటుతో ఎత్తు మడిగా రూపొందించాను.
- విత్తనాన్ని 12 గంటలు నానబెట్టి ఆ తరువాత నీరు వంపి విత్తనాన్ని బస్తాలో పోసి 24 గంటలు మండె కట్టాను. ఆ తరువాత మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.
- విత్తనాన్ని చల్లిన తరువాత, వరిగడ్డి నాటిన విత్తనంపై పలుచగా చల్లాను. నారు మొలకెత్తిన తరువాత పరిచిన గడ్డి తీసివేసాను.
- నారు మడిపై రోజూ ఉదయం, సాయంత్రం నీళ్ళు చిలకరించాను.
- నాటటానికి ఒక రోజు ముందే దుమ్ము చేసిన పొలంలో మార్కర్‌ను లాగటం ద్వారా 24x24 సెంటి మీటర్ల దూరంలో చతురస్రాకార ఆకారంలో నిలువు అడ్డ గీతలు ఏర్పడేలా చేసాను.

- వరుసలు తిన్నగా ఉండటానికి పొలం పొడవునా తాడు కట్టి దానివెంట మార్కర్‌ని లాగాము.
- ఈ పద్ధతిలో నాటేటప్పుడు 11 రోజుల వయసు ఉన్న మొక్కలను, విత్తనం మరియు వేర్లతో సహా జాగ్రత్తగా పీకి ఒక్కొక్క మొక్కనే నాటించాము.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటాము.
- నాటేటప్పుడు మొక్కలకు ఏ విధమైన నష్టం కలుగకుండా మట్టితో పాటు పైకి లేవటం జరిగింది.
- మొక్కతో పాటుగా మొక్కను అంటి పెట్టుకున్న గింజ, వేర్లు చెడిపోకుండా జాగ్రత్తగా నాటించాము.
- నాటిన తరువాత రోజున పొలానికి కొద్దిగా నీరు అందించాము.
- ఈ పద్ధతిలో పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము. పొలాన్ని నిరంతరం తడుపుతూ, ఆరబెడుతూ ఉండేలా చూసాము.
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 10 రోజుల వ్యవధిలో 3 సార్లు కలుపు తీసాము.
- కలుపు తీసే సమయంలో కలుపు మొక్కలు భూమిలో కలిసిపోయేలా చూసాము. అందువలన అది పచ్చి రొట్ట ఎరువుగా పని చేసింది.

## శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- ఈ పద్ధతిలో ఉన్న అన్ని విధానాలను అర్థం చేసుకోవటానికి, నేర్చుకోవటానికి మొదట్లో కొంత ఎక్కువ సమయం పట్టింది.
- అన్ని పనులు సమయం ప్రకారం చేయాలి అన్న విషయం మొదట్లో చాలా యిబ్బంది కలిగించింది.
- వీడర్‌ని తిప్పడం అనేది శ్రమతో కూడిన ప్రక్రియ. దీని వలన ఎక్కువ విస్తీర్ణంలో ఈ పద్ధతిలో వరి పండించలేక పోతున్నాము.
- మొదటి సీజన్‌లో విత్తనం నాటటానికి సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఖర్చు అయినది.
- ఈ పద్ధతిలో కలుపు కూడ ఎక్కువ వస్తుంది. అందువల్ల సాంప్రదాయ పద్ధతిలో పోలిస్తే ఎక్కువ సార్లు కలుపు తీయాల్సి వచ్చింది.
- కలుపు తీయటానికి వినియోగించే వీడర్‌ని తిప్పటం శ్రమతో కూడుకున్న పని కావున ఈ పద్ధతిని అవలంభించటం మొదట్లో కొంచెం ఇబ్బందిగా అనిపించింది. అంతే కాక మొదట్లో ఎక్కువ లోతుగా దుక్కి దున్నటం వలన వీడర్ తిప్పటం చాలా కష్టం అయింది.

- నీటి యాజమాన్యం అంటే నీటిని ఎండగట్టటం, ఆరు తడి పంటలలో మాదిరిగా నీటిని వాడటానికి మొదట్లో కొంచెం ఇబ్బంది కలిగింది.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- పై పై దుక్కులు కాబట్టి, దుక్కి దున్నటానికి కూడా తక్కువ ఖర్చు అయింది. అంతేకాక నాకు మరియు పశువులకు కూడా శ్రమ తగ్గింది.
- విత్తనం ఖర్చు చాలా తగ్గినది. సాధారణ పద్ధతిలో 30 కిలో గ్రాముల విత్తనాన్ని వాడితే ఈ పద్ధతిలో కేవలం 2 కిలో గ్రాముల విత్తనం సరిపోయింది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం చాల తగ్గినది.
- సాధారణ పద్ధతిలో వచ్చే ఏ విధమైన పురుగులు కాని తెగుళ్ళు కాని రాలేదు.
- సాధారణ పద్ధతితో పోలిస్తే పంట తొందరగా చేతికి వచ్చినది. తాలు గింజలు చాలా తక్కువగా వచ్చాయి.
- మాములు పద్ధతిలో ఒక్కొక్క మొక్కకు 25 నుండి 30 పిలకలు వస్తే శ్రీ పద్ధతిలో ఈ సంఖ్య 50 నుండి 60 కి పెరిగింది, అదే విధంగా కంకి పరిమాణం కూడా పెద్దగా ఉండి గింజ బరువు కూడా ఎక్కువగా ఉన్నది.
- సాధారణ పద్ధతిలో ఒక కంకికి 100 నుండి 120 గింజలు ఉంటే, శ్రీ పద్ధతి పాటించి వరికి 150 నుండి 180 గింజలు ఉన్నాయి.
- సాధారణ పద్ధతితో పోలిస్తే గడ్డి దిగుబడి కూడా చాలా ఎక్కువ వచ్చింది (సుమారు 1/2 ట్రాక్టరు ఎక్కువ వచ్చింది)

## శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిని అవలంభించటం కొంచెం కష్టమైన ప్రక్రియ.
- ఈ పద్ధతిలో సమయపాలన చాలా ముఖ్యం
- నాట్లు వేసేటప్పుడు, వీడర్ తిప్పేటప్పుడు నైపుణ్యాన్ని ప్రదర్శించాలి.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటు కోవాలి. తక్కువ వయసు ఉన్న లేత మొక్కలను మాత్రమే (10 నుండి 12 రోజుల) నాటుకోవాలి.
- మొక్క దూరం దూరంగా నాటడం వలన ప్రతీ మొక్క యొక్క ఆకులకు సూర్యరశ్మి బాగా సోకుతుంది. దాని ద్వారా ఒక్కో మొక్కకి తగినంత స్థలం, నీరు, పోషకాలు ఎక్కువగా అంది వేర్లు దృఢంగా పెరిగి మొక్క బాగా పెరగటానికి దోహదం చేస్తుంది.

- లేత మొక్కలను తక్కువ లోతులో నాటడం వలన తొందరగా నిలదొక్కుకొని ఎక్కువ పిలకలు వేస్తాయి.
- మొదట అవలంభించినప్పుడు కొంచెం ఖర్చు ఎక్కువగానే అనిపిస్తుంది. కానీ, ఈ పద్ధతిలో మెళకువలను తెలుసుకొని, సమయానుకులంగా పని చేస్తే అధిక స్థాయిలో దిగుబడి సాధించ వచ్చును.
- ప్రధాన పొలాన్ని చదునుగా ఉంచటం వలన నీటి యాజమాన్యం సులువు అవుతుంది.
- నీటి యాజమాన్యం చాలా జాగ్రత్తగా చేపట్టాలి. పొలం తడిగా ఉండాలి కాని నీరు నిలువకూడదు.
- ఎక్కువైన నీరు బయటకు పోవటానికి కాలువలు ఏర్పాటు చేసుకొని పొలం ఆరినప్పుడల్లా నీరు పెట్టుకోవాలి.
- కలుపు మందులు వాడరాదు.
- రోటరీ వీడర్ వరుసల మధ్య తిరగటం వలన ఇది కలుపు మొక్కలను నేలలో కలిసిపోయేలా చేస్తుంది. ఈ విధంగా కలుపు మొక్కలను నేలలో కలిసిపోయేలా చేయటం వలన ఇది పచ్చి రొట్ట ఎరువుగా మారుతుంది.
- ఈ పద్ధతి ఖరీఫ్ మరియు రబీ రెండు సీజన్లకు కూడా చాలా అనుకూలం.

## సలహాలు, సూచనలు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి మరియు ఈ పద్ధతిని అవలంభిలంచడానికి రైతులకు, కూలీలకు తగిన శిక్షణలు ఇప్పించాలి. నాటు వేయడానికి కూడా పరికరాలు అందుబాటులోకి తీసుకు రావాలి. ఈ పద్ధతిని పాటించే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు, ఋణాల వంటి ప్రోత్సాహకాలను అందచేసి, ఈ పద్ధతిలో పండించిన పంటకు అధిక ధర నిర్ణయించాలి. గ్రామస్థాయిలో రైతులకు శిక్షణ అందించి, వారిని కార్యకర్తలుగా నియమించి, వారికి జీత భత్యాలు నిర్ణయించి వారి ద్వారా ఈ పద్ధతిని వెలుగులోనికి తీసుకుని వచ్చి ఎక్కువ మంది రైతులు అవలంభించేలా చూడాలి. ఈ పద్ధతి వలన కలిగే ప్రయోజనాలను అన్ని ప్రచార సాధనాల ద్వారా ప్రసారం చేయాలి. వీలైతే ఒక సంవత్సరాన్ని శ్రీ వరి సంవత్సరంగా ప్రకటించి పెద్ద ఎత్తున ఈ విధానానికి ప్రచారం కలిగించాలి. ప్రతీ సంవత్సరం ఈ పద్ధతిని పాటించిన రైతులను గుర్తించి, వారిలో ఉత్తమ రైతులను ఎంపిక చేసి వారికి అవార్డులు, రివార్డులు అందచేయాలి. మెట్ట ప్రాంత రైతులకు ఈ పద్ధతి యొక్క ప్రాముఖ్యాన్ని తెలియచేసి వారు ఈ పద్ధతిని అవలంభించేలా చర్యలు చేపట్టాలి.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతినీ కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 112 రోజులు | 124 రోజులు |
| 3. | విత్తనం | 2 కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 10 రోజులు | 31 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ MOP |
| 6. | పురుగు మందులు | క్లోరోఫైరిఫాస్ గుళికలు | ఫోరేట్, ఎకలెక్స్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు ) | చేతితో కలుపు తీయడం మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 20 | 600 |
| 2. | నారుమడి తయారీ | 200 | 300 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 600 | 1,650 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 800 | 1,200 |
| 5. | ఎరువులు | 1,000 | 1,300 |
| 6. | పురుగు మందులు | - | 600 |
| 7. | పంటకోత, మార్పిడి | 2,200 | 2,200 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 4.820 | 7,850 |
| | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,125 | 3,000 |
| | మొత్తం లాభం (9.50 /Kg. ) | 39,187 | 28,500 |
| | నికర లాభం | 34,367.00 | 20,650.00 |



## పుట్టా నర్సింహులు

**కట్కూర్, వరంగల్ జిల్లా**

నేను 29 సంవత్సరాల వయసు ఉన్న వరంగల్ జిల్లా లోని బచ్చన్న పేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన రైతుని. నా పేరు పుట్టా నర్సింహులు, నాకు ముగ్గురు పిల్లలు. అందరూ చిన్న వాళ్ళే, ఒకరు మాత్రమే స్కూలుకు వెళుతున్నారు. గత 10 సంవత్సరాలుగా వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనం కొనసాగిస్తున్నాను. నాకు బావి క్రింద రెండు ఎకరాల పొలం ఉన్నది. దాంట్లో వరి పండిస్తున్నాను. సాధారణ పద్ధతిలో వరిని సాగుచేయడానికి ట్రాక్టర్లు, ఎద్దులు, కర్ర, నాగలి, గొర్రు, కొడవళ్ళు, ముఖ్యమైన పనిముట్లుగా ఉపయోగిస్తాము. ఈ పంటకు పశువుల ఎరువును క్రమం తప్పకుండా ఉపయోగిస్తాను. నేను సాధారణంగా తొలకరి కురవగానే ఖరీఫ్ సీజన్‌లో దున్నటానికి ముందు 4,5 ఎద్దుల బండ్ల పశువుల పెంటను చల్లుతాను. అంతేకాక దుబ్బు బాగా కట్టడానికి యూరియా, డి.ఏ.పి., పొటాష్ వంటి రసాయనికి ఎరువులను కొద్ది మొత్తంలో వినియోగిస్తాము. ఇక చీడ పీడల విషయానికి వస్తే మా ప్రాంతంలో సాధారణంగా లేత దశలో ఇస్పా పురుగు ఆశించి ఆకులను తింటుంది. దీనిని నివారించుటకు ఫోరేట్ గుళికలు ఉపయోగిస్తాము. ఆ తరువాత దశలలో దోమపోటు, కాండం తొలుచు పురుగులు ఆశిస్తాయి. వీటి నివారణ కొరకు మోనోక్రోటోఫాస్, ఎండోసల్ఫాన్ వంటి వాటిని పిచికారి చేస్తాము. ఇక రోగాల విషయానికి వస్తే అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగులు, వేరుకుళ్ళు తెగుళ్ళు ఆశిస్తాయి. వీటిని నివారించడానికి భావిస్టాన్ పొడి, కార్బండిజన్ గుళికలు, కార్బోఫ్యూరాన్ గుళికలు వంటి వాటిని వినియోగిస్తాము. నేను సాధారణంగా ఈ ప్రాంతంలో అధికంగా పండించె IR64 రకాన్ని పండిస్తాము. అది సాధారణంగా 135 నుండి 140 రోజులలో కోతకు వస్తుంది. 35 - 40 బస్తాల దిగుబడినిస్తుంది.

శ్రీ పద్ధతిలో వరి పండించటం గురించి నేను మొదటి సారి CROPS సంస్థ ద్వారానే 2007 సంవత్సరములో రబీ సీజన్ ముందు విన్నాను. సంస్థ వారు గ్రామాన్ని సందర్శించి ఈ పద్ధతి గురించి తెలియచేసి, ఈ పద్ధతిని పాటించే రైతులతో కలిసి పని చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. మొదట నేను

ఆసక్తి చూపించలేదు. కాని ఈ పద్ధతి గురించిన పూర్తి వివరాలను అంటే తక్కువ విత్తనంతో వరి సాగుచేయువచ్చని, ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని మొదలగు విషయాలు కళాజాత కార్యక్రమం ద్వారా, గ్రామ సభను ఏర్పాటు చేయడం ద్వారా తెలియ చేయడంతో బాటు ఈ పద్ధతిని పాటించే రైతలందరికీ పూర్తి సహకారం అందిస్తామని, వారి పొలాలను సంస్థ సిబ్బంది క్రమం తప్పకుండా సందర్శించి తగు సూచనలు అందచేస్తారని చెప్పడంతో ఆసక్తి కలిగి ముందుకు వచ్చాను. అప్పటి నుండి అంటే గత రెండు సీజన్ల నుండి ఒక ఎకరంలో శ్రీ పద్ధతిలో వరి సాగు చేస్తున్నాను. మొదట రబీలో IR64 రకాన్ని తరువాత ఖరీఫ్‌లో పయనీర్ (హైబ్రిడ్) రకాన్ని సాగు చేసాను. మొదట్లో విత్తనం నాటడం, వీడర్ ద్వారా కలుపు తీయడం వంటి విషయాల్లో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ అనుభవం వచ్చిన తరువాత మెళు కువలు నేర్చుకొని తరువాతి ఖరీఫ్ సీజన్‌లో ఇబ్బందులు లేకుండా సాగు చేయగలిగాను. ఇందుకు CROPS సంస్థ వారు పూర్తి సహకారాన్ని అందచేసారు. మాకు శిక్షణలు అందచేయడంతో పాటు, గ్రామ స్థాయిలో కార్యకర్తలను నియమించి వారి ద్వారా చేసి తగు సూచనలు, సలహాలు, అందచేసారు. అంతే కాక రైతు బడుల ద్వారా అనేక విషయాలు తెలియచేసారు. సంస్థ సిబ్బంది మా పొలాలను నిత్యం సందర్శించి, ఈ విధానాన్ని అవలంభించటంలో మాకు ఏ మాత్రం ఇబ్బంది కలుగకుండా చూసారు. గడిచిన రెండు సీజ్లలో కూడా పంటకు చీడ పీడలు చాలా తక్కువ మోతాదులో ఆకర్షించాయి. సంస్థ వారి సహకారంతో ఈ పద్ధతిలోని విధానాలన్నింటినీ తెలుసుకున్నాము. తక్కువ ఖర్చుతో అధిక (సుమారు 15 బస్తాలు అధికంగా) దిగుబడులు సాధించగలిగాము.

### శ్రీ పద్ధతిలో పాటించ విధానాలు

- ముందుగా ఎత్తు మడి తయారు చేసుకున్నాను.
- ఒక పూట నానబెట్టి, మరో రెండు పూటలు అంటే ఒకరోజు గోనె సంచిలో వేసి మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాము.
- నారు పెరిగే లోపల ప్రధాన పొలాన్ని తక్కువ లోతుగా దున్నుకున్నాను దానితో పాటే మార్కరుతో గీతలు గీసాము.
- వరుసలు తిన్నగా ఉండటానికి పొలం పొడవునా తాడు కట్టి దాని వెంట మార్కర్‌ని లాగాము.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటాము.
- నాటు వేసిన తరువాత నాటేటప్పుడు ఉన్న నీటిని బయటకు పంపించాము.
- ఆ తరువాత లేత మొక్కలు అంటే 12 రోజుల మొక్కలను దూరం దూరంగా నాటాము.
- నాటు వేసిన 10 రోజులకు ఒకసారి వీడర్ తిప్పి పశువుల పెంట పొలంలో పోసాను.

- ఆ తరువాత కూడా మూడు సార్లు వీడర్‌తో కలుపు తీయించాము. కానీ ఏ విధమైన కలుపు మందులు వాడలేదు.
- వీడర్ ద్వారా తీయలేని కలుపు మొక్కలను కూలీలను పెట్టి చేతితో ఏరి వేయించాము.
- ఆరు తడి పంటలకు నీరు ఎలా పెడతామో ఈ పద్ధతిలో కూడా నీరు అలానే పెట్టాము.

### సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- పది రోజులకు ముందుగానే కోతకు వచ్చినది.
- తక్కువ విత్తనం (కేవలం 2 కిలోల) తో సాగుచేసాము.
- చీడ పీడలు చాలా తక్కువ మొత్తంలో ఆశించాయి.
- తాలు గింజలు తక్కువ వచ్చాయి, గింజ బరువు కూడా ఎక్కువ ఉన్నది.
- మొక్క బలంగా పెరగటం వలన ఖరీఫ్‌లో వచ్చిన తుఫాను గాలులకు పడిపోలేదు.
- సాళ్ళ మధ్య సందులు ఎక్కువగా ఉండటం వలన, వాటిలో ఎలుకలు తిరిగినప్పుడు వాటి సహజ శత్రువులు అయిన పాములకు కనబడి వాటి సంఖ్య గణనీయంగా తగ్గినది.
- సాధారణ పద్ధతిలో పోలిస్తే ఈ పద్ధతిలో కనీసం 15 బస్తాల దిగుబడి అధికంగా వచ్చినది.

### శ్రీ పద్ధతికి పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- అన్నీ పనులు సమయం ప్రకారం చేయాలి అన్న విషయం మొదట్లో చాలా యిబ్బంది కలిగించింది.
- మొదటి సీజన్‌లో దుక్కులు లోతుగా దున్నటం వలన వీడర్ దిగుబడి తిప్పటం కష్టం అయింది.
- ఆడ కూలీలు వీడర్ తిప్పలేక పోతున్నారు.
- ఈ పద్ధతిలో ఉన్న అన్నీ విధానాలను అర్థం చేసుకోవటానికి, నేర్చుకోవటానికి మొదట్లో కొంత ఎక్కువ సమయం పట్టింది.
- ఖరీఫ్ సీజన్‌లో వర్షాల వలన నాట్లు వేయడానికి ఇబ్బంది కలిగింది.
- మొదటి సీజన్‌లో నాట్ల సమయంలో ఎలా నాటాలో కూలీలకు అర్థం కాక చాలా ఇబ్బంది కలిగింది.

### శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- ఈ శ్రీ పద్ధతిలో దోమ పోటు రాదు.
- పంట తొందరగా చేతికి వస్తుంది.

- మొదట అవలంభించినప్పుడు కొంచెం ఖర్చు ఎక్కువగానే అనిపిస్తుంది, కానీ ఈ పద్ధతిలో మెళకువలను తెలుసుకొని, సమయాను కూలంగా పని చేస్తే అధిక స్థాయిలో దిగుబడి సాధించవచ్చును.
- దుక్కులు లోతుగా దున్న కూడదు, కలుపు మందులు వాడరాదు.
- ఈ పద్ధతి ఖరీఫ్ మరియు రబీ రెండు సీజన్లకు కూడా చాలా అనుకూలం. అన్నీ రకాల వరిని సాగు చేయవచ్చును.
- ఈ పద్ధతిలో చీడ పీడలు ఆశించటం చాలా తక్కువగా ఉంటుంది, పంట తొందరగా చేతికి వస్తుంది.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో నాటు వేయడం అనేది నైపుణ్యంతో కూడినది కావున నాటు వేసే కూలీలకు కూడా శిక్షణ ఇప్పించడంతో పాటు, నాటు వేయడానికి కూడా ఏవైన పరికరాలు అందుబాటులోకి తెస్తే చాలా ఉపయోగం ఉంటుంది. అంతేకాక సులభంగా తిప్పగలిగే కొత్త వీడర్లను కనిపెట్టాలి. దీని వలన ఎక్కువ విస్తీర్ణంలో ఈ పద్ధతిని అవలంభించే అవకాశం కలుగుతుంది. రైతు క్షేత్ర పాఠశాలల ద్వారా ఈ పద్ధతిలో విధానాలన్నిటిపై రైతులకు శిక్షణను ఇప్పించాలి. ఈ పద్ధతిని పాటించే ప్రతీ రైతుకు ఉచితంగా వీడర్లు, మార్కర్లు అందచేయాలి. వారికి ప్రభుత్వ బ్యాంకుల నుండి లోన్లు, పరికరాల కొనడానికి సబ్సిడీలు అందచేసినట్లయితే ఈ విధానానికి ఎక్కువ ప్రచారం లభిస్తుంది.

నేను శ్రీ పద్ధతినీ, సాంప్రదాయ పద్ధతినీ కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | పయనీర్ (హైబ్రిడ్) | IR 64 |
| 2. | కాల పరిధి | 115 రోజులు | 127 రోజులు |
| 3. | విత్తనం | 2 కిలో గ్రాములు | 45 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 11 రోజులు | 31 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు, డి.ఏ.పి., యూరియా, పొటాష్ | డి.ఏ.పి., యూరియా, పొటాష్ MOP |
| 6. | పురుగు మందులు | క్లోరోఫైరిఫాస్ గుళికలు | ఫోరేట్ గుళికలు ఎండో సల్ఫాన్ |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం మూడు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 40 | 650 |
| 2. | నారుమడి తయారీ | 150 | 250 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 450 | 2,100 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 240 | 900 |
| 5. | ఎరువులు | 990 | 1,750 |
| 6. | పురుగు మందులు | 200 | 1,070 |
| 7. | పంటకోత, మార్పిడి | 3,100 | 3,100 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 5.170 | 9,820 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,050 | 3,000 |
| 10. | మొత్తం లాభం (9.50 / Kg ) | 38,475 | 28,500 |
| 11. | నికర లాభం | 33,305.00 | 18,680.00 |



## నిడిగొండ గౌరమ్మ
కట్య్రార్, వరంగల్ జిల్లా

నా పేరు నిడిగొండ గౌరమ్మ, మాది కట్య్రార్ గ్రామం, బచ్చన్న పేట మండలం, వరంగల్ జిల్లా, నా వయస్సు 50 సంవత్సరాలు. నాకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. నా కుమారుడు గ్రామ సర్పంచ్‌గా పని చేస్తున్నాడు. నేను నా భర్తతో కలిసి పెళ్ళి అయిన దగ్గర నుండి వ్యవసాయం చేస్తున్నాను. నేను అసలు చదువుకోలేదు కానీ సంతకం పెట్టటం నేర్చుకున్నాను. మా కుటుంబ ప్రధాన వృత్తి వ్యవసాయమే. మాకు 2 ఎకరాల తరి పొలం ఉన్నది. ఆ రెండు ఎకరాలలో మేము వరి పండిస్తాము. సాధారణ పద్ధతిలో వరిని సాగుచేయడానికి ముఖ్యమైన పరికరాలుగా క్రర నాగలి, గొర్రు, కొడవళ్ళు ముఖ్యమైన పనిముట్లుగా ఉపయోగిస్తాము. ఈ పంటకు పశువుల ఎరువును క్రమం తప్పకుండా ఉపయోగిస్తాము. అంతేకాక యూరియా, డి.ఏ.పి., పొటాష్ వంటి రసాయనిక ఎరువులను కూడా వినియోగిస్తాము. చేనుకు తెగుళ్ళు పురుగులు ఆశించినప్పుడు గుళికలు, రసాయన మందులు ఉపయోగిస్తాము. సాధారణంగా సాంప్రదాయ పద్ధతిలో మాకు 35 బస్తాల దిగుబడి వస్తుంది.

నేను శ్రీ పద్ధతిలో వరి పండించటం గురించి 2007 రబీ సీజన్‌లో CROPS సంస్థ ద్వారా వినటం జరిగింది. కానీ, అప్పటికీ నారు పోసి 12 రోజులు దాటింది. ఈ పద్ధతిలో 10 రోజుల నారు నాటాలని చెప్పారు కదా, ఈ సారికి వద్దులే అనుకున్నాను, కానీ CROPS సంస్థ వారు మంచి పని కొంచెం ఆలస్యం అయినా ఫరవాలేదు, మేము దగ్గర ఉండి అన్నీ పనులు చేయిస్తాము మీరేమి భయపడవద్దు అని చెప్పటం వలన ముందుకు వచ్చి గత రెండు సీజన్లుగా IR 64 రకాన్ని ఒక ఎకరం విస్తీర్ణంలో సాగు చేస్తున్నాము. సంస్థ వారి శిక్షణలు, రైతు బడుల ద్వారా నేర్చుకున్న అంశాల ఆధారంగా శ్రీ పద్ధతిలో ఈ క్రింది విధానాలను పాటించాను.

### శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- నారుకు ముందే పొలాన్ని మూడు సార్లు దున్నాము.

- ఆ తరువాత మడిని క్రరల సహాయంతో ఎత్తు మడిగా చేసాము.
- 2 కేజీల విత్తనాన్ని నానబెట్టి, మండె కట్టి మొలకెత్తించాము.
- ఆ తరువాత మొలకెత్తిన నారును నాటాము.
- నారు పెరిగే లోపల పొలాన్ని దున్నుకొని, దమ్ము చేసి మార్కరుతో గీతలు గీసాము.
- ఆ తరువాత లేత మొక్కలు అంటే 13 రోజుల మొక్కలను దూరం దూరంగా నాటాము.
- నాటు వేసిన 10 రోజులకు ఒకసారి వీడర్ తిప్పి పశువుల పెంట పొలంలో పోసాను.
- ఆ తరువాత కూడా మూడు సార్లు వీడర్‌తో కలుపు తీయించాము.

### సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- విత్తన ఖర్చు తక్కువ, ఎకరాకు రెండు కిలోలు మాత్రమే వాడాము.
- నాటు కూలీల ఖర్చు, కలుపు తీత కూలీల ఖర్చు కూడా చాలా తగ్గినది.
- సాధారణ పద్ధతిలో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం తగ్గినది.
- చీడ పీడలు తక్కువగా ఉండటం వలన పురుగు మందుల మీద ఖర్చు బాగా తగ్గినది.
- చాలా తక్కువ నీటితో పంట పండించాము.
- సాధారణ పద్ధతిలో గాలికి వడ్లు రాలిపోవటం, మొక్క పడిపోవటం జరిగింది. అదే శ్రీ పద్ధతిలో నాటిన మొక్క బలంగా ఉండటం వలన అటువంటి నష్టం ఏమి జరగలేదు. ఎలుకల బెడద కూడా చాలా తగ్గినది.
- విత్తనం, కూలీ, ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గటం వలన పెట్టుబడులు తగ్గాయి.

### శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- ఎత్తుమడి తయారు చేసుకోవటం మొదట్లో ఇబ్బంది అయింది.
- నా భర్త పెద్ద వయస్సు అవటం చేత వీడర్ తిప్పలేక పోయినప్పటికీ, నేనే వీడర్ తిప్పి కలుపు తీసాను. మొదట కొంచెం కష్టం అయినప్పటికీ ఆ తరువాత ఖరీఫ్‌లో సులభంగానే చేయగలిగాను.
- నీరు బెట్టడం, మళ్ళీ ఆరబెట్టడం అంటే మొదట్లో ఇబ్బంది అనిపించింది.
- కలుపు కూడా ఎక్కువ వస్తుంది. అందుకనే కలుపు ఎక్కువ సార్లు తీయాల్సి వచ్చింది.

## ఈ శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- పంట తొందరగా చేతికి వస్తుంది.
- తక్కువ వయసు ఉన్న మొక్కలను (10 నుండి 12 రోజుల) మాత్రమే నాటుకోవాలి.
- పొలంలో ఎక్కువైన నీరు బయటకు పోవటానికి కాలువలు ఏర్పాటు చేసుకొని పొలం ఆరినప్పుడల్లా నీరు పెట్టుకోవాలి.
- నారుమడి చుట్టు కాలువ తీసి అందులో నీరు నింపాలి. అందువలన మొక్కలకు ఇబ్బంది కలుగకుండా నీరు అందుతుంది.
- ప్రతి 10 రోజులకు ఒకసారి వీడర్ తిప్పాలి.
- మామూలు పద్ధతిలో ఒక్కొక్క మొక్కకు 25 నుండి 30 పిలకలు వస్తే శ్రీ పద్ధతిలో ఈ సంఖ్య 50 నుండి 60 కి పెరిగింది. అదే విధంగా కంకి పరిమాణం కూడా పెద్దగా ఉండి గింజ బరువు కూడా ఎక్కువగా ఉన్నది.
- తాలు గింజలు చాలా తక్కువగా ఉంటాయి.
- సరైన పద్ధతిలో సరైన సమయం ప్రకారం చేస్తే ఇబ్బందులు తగ్గుతాయి. అంతేకాక దిగుబడి కూడా ఎక్కువ వస్తుంది.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో వీడర్‌ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి. శ్రీ పద్ధతిలో పండించిన వరికి అధిక ధర ఇప్పించినట్లయితే రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఈ పద్ధతిలో తక్కువ నీటితో వరి పండించవచ్చు. కావున మెట్ట సేద్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పద్ధతిని ఎక్కువమంది రైతులు అవలంభించేలా ప్రభుత్వం వివిధ చర్యలు చేపట్టాలి.

నేను శ్రీ పద్ధతిని సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 113 రోజులు | 126 రోజులు |
| 3. | కాల పరిధి | 2 రోజులు | 30 రోజులు |
| 4. | నారు వయస్సు | 12 రోజులు | 31 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు, | డి.ఏ.పి., యూరియా, పొటాష్ MOP |
| 6. | పురుగు మందులు | ఎండో సల్ఫాన్ | ఎండో సల్ఫాన్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 40 | 600 |
| 2. | నారుమడి తయారీ | 200 | 300 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 800 | 1,800 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 500 | 950 |
| 5. | ఎరువులు | 1,000 | 1,250 |
| 6. | పురుగు మందులు | 200 | 450 |
| 7. | పంటకోత, మార్పిడి | 2,200 | 2,400 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 4.940 | 7,750 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 3,100 | 2,620 |
| 10. | మొత్తం లాభం (9.50 / Kg ) | 29,450 | 24,937 |
| 11. | నికర లాభం | 24,510.00 | 17,187.00 |



## కాల్వపెల్లి పోషయ్య

కట్యాంర్, వరంగల్ జిల్లా

నా పేరు కాల్వపెల్లి పోషయ్య, వయస్సు 35 సంవత్సరాలు. 8వ తరగతి వరకు చదువుకున్నప్పటికీ గత 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. నేను బ్రహ్మచారిని. ప్రస్తుతం నేను నా తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేస్తున్నాను. మాకు మొత్తం 3 ఎకరాల పొలం ఉన్నది. నీటి సదుపాయం కొరకు మాకు ఒక బావి ఉన్నది. దాని కింద 2 ఎకరాలలో వరి పండిస్తాను. వర్షాధార పంటగా ఒక ఎకరంలో పత్తి పండిస్తాను. కుదరని పక్షంలో మొక్కజొన్న పండిస్తాము. వ్యవసాయం మొదలుపెట్టినప్పటి నుండి మేము సాంప్రదాయ పద్ధతిలోనే వరి పండిస్తున్నాము. ఈ సాంప్రదాయ పద్ధతికి మేము సాధారణంగా నాగలి, గొర్రు, పార, కొడవలి వంటి వాటిని ముఖ్య సాధనాలుగా వినియోగిస్తాము. ఈ పద్ధతిలో నేను సాధారణంగా ఎకరానికి రెండు బస్తాల డి.ఏ.పి. అడుగు మందుగా, 2 బస్తాల యూరియాను పై మందుగా వాడుతూ వస్తున్నాను. అంతేకాక పొలం అసలు దున్నక ముందు రెండు ట్రాక్టర్ల పశువుల పెంట పోస్తాను. పొట్ట దశలో పొటాష్ ఎరువును కూడా వినియోగిస్తాను. గత రెండు మూడు సంవత్సరాలుగా నా పొలానికి కాండం తొలుచు పురుగు, దోమకాటు ఆశిస్తున్నది. దీని నివారణ కొరకు మోనోక్రోటోఫాస్, ఎండో సల్ఫాన్ మందులను పిచికారి చేస్తూ, కెల్డాన్ గుళికలను వాడి ఉన్నాను. గత 4, 5 సంవత్సరాల నుండి ఈ సాంప్రదాయ పద్ధతిలో దిగుబడి 29 నుండి 35 బస్తాల మధ్య వస్తుంది.

వ్యవసాయం మొదలు పెట్టినప్పుటి నుండి నేను సాధారణ పద్ధతిలోనే వరి పండిస్తున్నాను. కొంత చదువుకొని ఉండటం వలన ఎదైన కొత్త పద్ధతి వస్తే బాగుంటుంది అని అనుకున్నాను. ఈ ఒక్క బావి నీరు పొలానికి సరిపోవటం లేదు, తక్కువ నీటితో వరి పండించే విధానాలు ఎమైనా ఉంటే బాగుంటుంది అన్న ఉద్దేశ్యంతో అక్కడక్కడ అడగటం జరిగింది. అప్పుడు ఈ శ్రీ పద్ధతి గురించి విన్నాను. కానీ ఎవరైనా దగ్గర ఉండి నేర్పిస్తే బాగుంటుంది అని అనుకుంటున్న సమయంలో CROPS సంస్థ వారు మేము ఉన్నాము అని ముందుకు వచ్చి ఈ పద్ధతి గురించి తెలియచేసారు. అంతేకాకుండా సంస్థ వారు తాము

దగ్గర ఉండి కావలసిన అన్నీ రకాల సహాకారం అందిస్తామని చెప్పడమే కాకుండా, గ్రామంలో ఒకరిద్దరికి పూర్తి శిక్షణ యిచ్చి, వారి ద్వారా ఈ పద్ధతిలో సాగు చేయటానికి ముందుకు వచ్చిన రైతులందరరికీ సహకారం అందచేసేలా ఏర్పాటు చేస్తామని, సంస్థ తరుపు నుండి కూడా సిబ్బంది గ్రామాన్ని, రైతు పొలాలను సందర్శించి తగు సూచనలు అందచేస్తామని తెలియ చేశారు. దానితో గ్రామం నుండి అనేక మంది రైతులు ముందుకు వచ్చారు. వారితో పాటు నేను కూడా గత రెండు సీజన్ల నుండి IR 64 రకాన్ని ఒక ఎకరం విస్తీర్ణంలో సాగు చేస్తున్నాను. మొదట కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నాము కానీ దిగుబడి ఎక్కువ రావటంతో తరువాత సీజన్‌లో కూడా ఇదే పద్ధతిని పాటించాము. ఇక ముందు ముందు కూడా ఇదే పద్ధతిలో వరి పండిస్తాము. ఈ పద్ధతిలో 5 శాతము పంటకు మాత్రమే కాండము తొలుచు పురుగు ఆశించింది. వీటి నివారణకు తిమ్మేటి గుళికలను వాడటం జరిగింది. సేంద్రియ ఎరువులతో పాటు D.A.P., యూరియా వంటి కొంత రసాయనక ఎరువులు కూడా ఉపయోగించాము. పండించిన రెండు సీజన్లలో కూడా CROPS సంస్థ వారు రైతు బడుల ద్వారా చాలా విషయాలు నేర్పించారు. అంతేకాక మాకు మార్కర్లు, వీడర్లు, లింగాకర్షక బుట్టలు కూడా అందించారు. వేరే జిల్లాలకు తీసుకుని వెళ్ళి అక్కడి రైతులు ఎలా పండిస్తున్నారో తెలియచేసారు. వారు చెప్పిన ప్రకారం ఈ పద్ధతిలో ఈ క్రింది విధానాలు పాటించాను.

### శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- నారుకు ముందే ప్రధాన పొలాన్ని దమ్ము చేసి పెట్టాను.
- ముందుగా ఎత్తు మడి తయారు చేసుకొని దానిపై నానబెట్టి, మండె కట్టి, మొలకెత్తిన విత్తనాలను చల్లాను.
- విత్తనాన్ని 12 గంటలు నానబెట్టి ఆ తరువాత నీరు వంపి విత్తనాన్ని బస్తాలో పోసి 24 గంటలు మండె కట్టాను. ఆ తరువాత మొలకెత్తిన లేదా ముక్కు పగిలిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.
- అవసరాన్ని బట్టి నారు మడిపై రోజూ ఉదయం, సాయంత్రం నీళ్ళు చిలకరించాను.
- నారు వయసు 7 రోజులు రాగానే ప్రధాన పొలాన్ని మరోసారి దమ్ముచేసి నీరు పెట్టాను.
- దమ్ము చేసిన పొలంలో మార్కర్‌ను లాగటం ద్వారా 24 x 24 సెంటీ మీటర్ల దూరంలో చతురస్రాకార ఆకారంలో నిలువు, అడ్డ గీతలు ఏర్పడేలా చేసాను.
- ఆ తరువాత 12 రోజుల మొక్కలను దూరం దూరంగా నాటాము.

- నాటు వేసిన 10 రోజులకు ఒకసారి వీడర్ తిప్పి పశువుల పెంట పొలంలో పోసాను.
- మొత్తం మూడు సార్లు వీడర్ తిప్పాను. కానీ ఏ విధమైన కలుపు మందులు వాడలేదు.
- వీడర్ ద్వారా తీయలేని కలుపు మొక్కలను కూలీలను పెట్టి చేతితో ఏరి వేయించాము.

**సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు**

- విత్తన ఖర్చు తక్కువ, ఎకరాకు రెండు కిలోలు మాత్రమే వాడాము.
- చాలా తక్కువ నీటితో పంట పండించాము.
- కాండం తొలుచు పురుగు శ్రీ పద్ధతిలో 5% వస్తే, సాధారణ పద్ధతిలో 10% శాతము వచ్చినది. వీటి నివారణ కొరకు ఫోరేటి గుళికలు వాడటం జరిగింది.
- అదేవిధంగా సాధారణ పద్ధతిలో అగ్గితెగులు వచ్చినది, కానీ శ్రీ పద్ధతిలో ఈ తెగులు రాలేదు.
- ఎలుకల బెడద కూడా చాలా తగ్గినది.
- సాళ్ళ మధ్య సందులు పెద్దవిగా ఉండటం వలన, అందులో ఎలుకలు తిరిగినప్పుడు పాములకు కనపడి ఎలుకల బెడద చాలా తగ్గిపోయినది.
- మామూలు పద్ధతిలో ఒక్కొక్క మొక్కకు 20 నుండి 25 పిలకలు వస్తే శ్రీ పద్ధతిలో ఈ సంఖ్య 45 నుండి 55 కి పెరిగింది.
- సాధారణ పద్ధతిలో ఒక కంకికి 80 నుండి 100 గింజలు ఉంటే, శ్రీ పద్ధతి పాటించిన వరికి 120 నుండి 150 గింజలు ఉన్నాయి.
- శ్రీ పద్ధతిలో ఖర్చులు తగ్గి, దిగుబడులు ఎక్కువ రావటం వలన నాకు ఆదాయం ఎక్కువగా వచ్చినది.

**శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు**

- మొదటిసారి నాట్ల సమయంలో ఒకే మొక్కను అదికూడా లేత మొక్కను నాటాలి కావున కూలీలకు అర్ధం కాలేదు. అందువలన కొంత ఇబ్బంది కలిగింది.
- నాట్లలో మెళుకువలు చెప్పాలి కావున మొదటి సారి నాట్లు కొంచెం ఆలస్యం అయినాయి.
- నాట్ల విషయంలో ఆడ కూలీలను కొంచెం ఎక్కువసేపు సముదాయించాల్సి వచ్చింది.
- ఈ పద్ధతిలో ఉన్న అన్నీ విధానాలను అర్ధం చేసుకోవటానికి, నేర్చుకోవటానికి మొదట్లో కొంత ఎక్కువ సమయం పట్టింది.
- అన్నీ పనులు సమయం ప్రకారం చేయాలి అన్న విషయం మొదట్లో చాలా ఇబ్బంది కలిగించింది.

- నీటి యాజమాన్యం అంటే నీటిని ఎండగట్టడం, ఆరు తడి పంటలలో మాదిరిగా నీటిని వాడటానికి మొదట్లో కొంచెం ఇబ్బంది కలిగింది.
- ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సరైన సమయంలో రాకపోవటం వలన నాట్లు వేయడానికి ఇబ్బంది కలిగింది.

## ఈ శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- నాట్లు వేసేటప్పుడు, వీడర్ తిప్పేటప్పుడు నైపుణ్యాన్ని ప్రదర్శించాలి.
- తక్కువ వయసు ఉన్న మొక్కలను (10 నుండి 12 రోజుల) మాత్రమే నాటుకోవాలి.
- పొలంలో ఎక్కువైన నీరు బయటకు పోవటానికి కాలువలు ఏర్పాటు చేసుకొని పొలం ఆరినప్పుడల్లా నీరు పెట్టుకోవాలి.
- నారుమడి చుట్టూ కాలువ తీసి అందులో నీరు నింపాలి. అందువలన మొక్కలకు ఇబ్బంది కలుగకుండా నీరు అందుతుంది.
- ఈ పద్ధతిలో సమయపాలన చాలా ముఖ్యం
- మొదట అవలంభించినప్పుడు కొంచెం ఖర్చు ఎక్కువగానే అనిపిస్తుంది, కానీ ఈ పద్ధతిలో మెళుకువలను తెలుసుకొని సమయానుకూలంగా పని చేస్తే అధిక స్థాయిలో దిగుబడి సాధించవచ్చును.
- ప్రతి పది రోజులకు ఒకసారి వీడర్ తిప్పాలి.
- వీడర్ తిప్పి కలుపు భూమిలో కలిసిపోయేలా చేయుటం వలన అలా చేసిన ప్రతీసారి పచ్చి రొట్ట ఎరువు భూమికి చేరుతుంది.
- ఈ శ్రీ పద్ధతిలో దోమపోటు రాదు. పంట తొందరగా చేతికి వస్తుంది. అన్నీ రకాల వరిని పండించుకోవచ్చును.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో తక్కువ నీటితో వరి పండించవచ్చు. కావున మెట్ట సేద్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పద్ధతిని ఎక్కువమంది రైతులు అవలంభించేలా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు వివిధ చర్యలు చేపట్టాలి. ప్రసార సాధనాల ద్వారా ఈ పద్ధతికి ఎక్కువ ప్రచారం కలిగించి రైతాంగానికి ఈ శ్రీ పద్ధతి గురించి అవగాహన కలిగించాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి. శ్రీ పద్ధతిలో పండించిన వరికి అధిక ధర ఇప్పించినట్లయితే రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.

నేను శ్రీ పద్ధతిని సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 110 రోజులు | 125 రోజులు |
| 3. | కాల పరిధి | 2 కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 12 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు, | డి.ఏ.పి., యూరియా, పొటాష్ MOP |
| 6. | పురుగు మందులు | ఫోరేట్ గుళికలు | ఫోరేట్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం 3 సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 50 | 600 |
| 2. | నారుమడి తయారీ | 200 | 300 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 400 | 800 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 300 | 800 |
| 5. | ఎరువులు | 850 | 1,300 |
| 6. | పురుగు మందులు | 300 | 500 |
| 7. | పంటకోత, మార్పిడి | 2,200 | 2,400 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 4.300 | 6,700 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 3,600 | 2,625 |
| 10. | మొత్తం లాభం (9.50 / Kg ) | 34,200 | 24,937 |
| 11. | నికర లాభం | 29,900.00 | 18,237.00 |



## పుట్టా లక్ష్మీ నారాయణ

### కట్యూర్, వరంగల్ జిల్లా

నా పేరు పుట్టా లక్ష్మీనారాయణ, వయస్సు 60 సంవత్సరాలు. మాది వరంగల్ జిల్లా లోని బచ్చన్నపేట మండలం, కట్యూర్ గ్రామము. నేను 6వ తరగతి వరకు చదువుకున్నప్పటికీ గత 40 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. నాకు ముగ్గురు పిల్లలు, అందులో ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మొగ పిల్లవాడు. అందరికీ పెళ్ళిళ్ళు అయినాయి. నాకు మొత్తం 6 ఎకరాల పొలం ఉన్నది. అందులో ఒక బోరు బావి ఉన్నది. దాని కింద 2 ఎకరాలలో వరి పండిస్తాను. మిగతా నాలుగు ఎకరాలలో పత్తి, మిర్చితో పాటు కొంత కూరగాయలు కూడా పండిస్తాను. సాధారణ పద్ధతిలో తొలకరి కురవగానే ఖరీఫ్ సీజన్లో దున్నటానికి ముందు పశువుల పెంటను చల్లుతాను. ఖరీఫ్, రబీ సీజన్లలో విత్తనం నాటే సమయంలో 2 ఎకరాలకి 2 బస్తాల డి.ఏ.పి. కాని, 1 బస్తా డి.ఏ.పి. 1 బస్తా 17.17.17 లను అడుగు మందుగా వాడతాను. చీడ పీడల నివారణ కొరకు ఎండో సల్ఫాన్, క్లోరోఫైరిఫాస్, ఫోరేట్ గుళికలను వినియోగిస్తాను. సాధారణంగా నాకు సాంప్రదాయ పద్ధతిలో 38 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. చిన్నప్పటి నుండి కూడా నేను సాధారణ పద్ధతిలోనే వరి పండిస్తున్నాను. నాకు కొత్త పద్ధతులను నేర్చుకోవాలని అనుకున్నప్పటికీ ఈ చిన్న పల్లెటూరుకు ఎవరు వస్తారు, వచ్చినా ఆ కొత్త పద్ధతి నేర్చుకోవటానికి పూర్తి సహకారం ఎవరు అందిస్తారు అనుకునేవాడిని. అటువంటి పరిస్థితులలో CROPS సంస్థ వారు మా గ్రామానికి వచ్చి ఈ శ్రీ పద్ధతి గురించి తెలియ చేసారు. అంతే కాకుండా మా రైతాంగాన్ని ఒప్పించటానికి చాలా కష్టపడినారు. కళాజాతను ఏర్పాటు చేసారు. గోడల మీద ఈ శ్రీ పద్ధతి గురించి రాసారు. ఈ పద్ధతిలో ఏదైన నష్టం కాని పంటు దిగుబడి కాని తక్కువ వస్తే మేము ఆ నష్టాన్ని పూరిస్తాము అని చెప్పారు. ఈ విధంగా అనేక రకాలుగా CROPS సంస్థ సహకారం అందిస్తామని చెప్పటంతో మిగిలిన రైతులతోపాటు నేను కూడా ముందుకు వచ్చి, మొదటగా 50 సెంట్లలో శ్రీ పద్ధతిని అవలంభించాను. అదే విస్తీర్ణంలో సాధారణ పద్ధతిలో 19 బస్తాలు వస్తే ఈ శ్రీ పద్ధతిలో 25 బస్తాలు వచ్చినది. ఇక ఆ తరువాతి ఖరీఫ్ సీజన్లో పూర్తి 1 ఎకరంలో

శ్రీ పద్ధతిని, ఇంకొక ఎకరంలో సాధారణ పద్ధతిని పాటించాను. మంచి లాభాలు వచ్చాయి. అందుకే ఇక నుండి శాశ్వతంగా ఈ శ్రీ పద్ధతినే పాటించాలని నిర్ణయం తీసుకోవడంతో పాటు ఈ విషయాన్ని నలుగురితో పంచుకోవాలని కూడా నిర్ణయం తీసుకున్నాను. ఇక సంస్థ విషయానికి వస్తే గత రెండు సీజన్లలో కూడా ముందు చెప్పినట్లుగానే తమ పూర్తి సహకారాన్ని అందచేసింది. అంతేకాక సీనియర్ శాస్త్రవేత్తలు మా గ్రామాన్ని, పొలాలను సందర్శించి తగు సూచనలు అందించారు. ఎంతో మంది ఇతర ప్రాంతాల రైతులు, స్వచ్ఛంధ సంస్థల వారు, మీడియా సిబ్బంది మా గ్రామాన్ని సందర్శించి ఈ శ్రీ పద్ధతి గురించి తెలుసుకొని సంతోషం తెలియచేస్తున్నారు. మా రైతాంగం కూడా ఈ పద్ధతి పట్ల చాలా సంతోషంగా ఉన్నది. CROPS సంస్థ వారు మార్కర్లు, వీడర్లు అందచేయడంతో పాటు, మా రైతులను క్షేత్ర సందర్శనకు తీసుకొని వెళ్ళి ఆ ప్రాంత రైతుల అనుభవాలను తెలియచేసారు. ఈ సందర్శనలో నేర్చుకున్న అనేక విషయాలు మేము శ్రీ పద్ధతిని పాటించే క్రమంలో చాలా ఉపయోగపడ్డాయి. అంతేకాక రైతుబడుల ద్వారా మేము నేర్చుకున్న విషయాలు, సంస్థ తరుపున కార్యకర్తలు తెలిపిన విషయాల సహకారంతో మేము ఈ పద్ధతిలోని ఈ క్రింది విధానాలను పాటించి అధిక దిగుబడులను సాధించగలిగాము.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- 2 కేజీల విత్తనాన్ని నానబెట్టి, ఆ తరువాత మండె కట్టి మొలకెత్తించాము.
- నారుకు ముందే ప్రధాన పొలాన్ని దమ్ము చేసి పెట్టాము.
- మొదటగా నారుమడి గురించి భూమిని దున్ని ఆ తరువాత సేంద్రియ ఎరువును చల్లాము. ఆ తరువాత ఈ మడిని గడ్డి ఎంటుతో ఎత్తు మడిగా రూపొందించాము.
- విత్తనాన్ని చల్లిన తరువాత, వరిగడ్డిని నాటిన విత్తనంపై పలుచగా చల్లాను. నారు మొలకెత్తిన తరువాత పరిచిన గడ్డి తీసివేసాము.
- నారు మడిపై రోజూ ఉదయం, సాయంత్రం నీళ్ళు చిలకరించాము.
- CROPS వారు యిచ్చిన మార్కర్‌తో నిలువు, అడ్డ గీతలు పొలంలో గీసాము.ఆ తరువాత మొలకెత్తిన నారును నాటాము.
- వరుసలు తిన్నగా ఉండటానికి పొలం పొడవునా తాడు కట్టి దానివెంట మార్కర్‌ని లాగాము.
- ఈ పద్ధతిలో 2 నుండి 3 ఆకులు ఉన్న లేత మొక్కలను దూరం దూరంగా నాటించాము.
- నాటేటప్పుడు 10 రోజుల వయసు ఉన్న మొక్కలను విత్తనం మరియు వేర్లతో సహా జాగ్రత్తగా పీకి ఒక్కొక్క మొక్కనే నాటించాము.

- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటాము.
- నాటేటప్పుడు మొక్కను పట్టుకోవడానికి వీలుగా ఉండే ఒక ఇనుప రేకుని తీసుకొని నారు మడిలో మొక్కల కింద నుండి లోపలికి చొప్పించి మొక్కలకు ఏ విధమైన నష్టం కలుగుకుండా మట్టితో పాటు పైకి లేపటం జరిగింది.
- ఈ రేకుని పొలంలోకి తీసుకొని వెళ్ళి ఒక్కో మొక్కని తీసుకొని నాటేలా జాగ్రత్త తీసుకున్నాము.
- నారు పీకిన తరువాత సాధ్యమైనంత త్వరగా మొక్కను నాటేలా జాగ్రత్త తీసుకున్నాము. ఇలా చేయడం వలన మొక్క దెబ్బ తినకుండా ఉంటుంది. నాటిన తరువాత రోజున పొలానికి కొద్దిగా నీరు అందించాము.
- ఈ పద్ధతిలో పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము, పొలాన్ని నిరంతరం తడుపుతూ, ఆరబెడుతూ ఉండేలా చూసాము.
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 10 రోజుల వ్యవధిలో 3 సార్లు కలుపు తీసాము.
- కలుపు తీసే సమయంలో కలుపు మొక్కలు భూమిలో కలిసి పోయేలా చూసాము. అందువలన అది పచ్చి రొట్ట ఎరువుగా పని చేసింది.

## శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదటి సీజన్‌లో విత్తనం నాటడానికి సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఖర్చు అయినది.
- ఈ పద్ధతిలో ఉన్న అన్నీ విధానాలను అర్థం చేసుకోవటానికి, నేర్చుకోవటానికి మొదట్లో కొంత ఎక్కువ సమయం పట్టింది.
- అన్నీ పనులు సమయం ప్రకారం చేయాలి అన్న విషయం మొదట్లో చాలా ఇబ్బంది కలిగించింది.
- నీటి యాజమాన్యం అంటే నీటిని ఎండ గట్టటం, ఆరు తడి పంటలలో మాదిరిగా నీటిని వాడటం మొదట్లో కొంచెం ఇబ్బందిని కలిగించింది.
- వరి పండించడంలో గతంలో నేర్చుకున్న సాంప్రదాయ పద్ధతులను వదిలి వేయడం అనేది కూడా మొదట్లో పెద్ద సమస్యగా అనిపించింది.
- మొదటి సీజన్‌లో ఈ శ్రీ పద్ధతిని అవలంభించని రైతులనుండి విమర్శలను ఎదుర్కోవటం ఇబ్బందిని కలిగించింది.
- ఈ పద్ధతిలో కలుపు కూడా ఎక్కువ వస్తుంది కావున సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే ఎక్కువ సార్లు కలుపు తీయాల్సి వచ్చింది.
- కలుపు తీయటానికి వినియోగించే వీడర్‌ని తిప్పటం శ్రమతో కూడుకున్న పని కావున ఈ పద్ధతిని అవలంభించటం మొదట్లో కొంచెం

ఇబ్బందిగా అనిపించింది. అంతేకాక మొదట్లో ఎక్కువ లోతు దుక్కి దున్నటం వలన వీడర్ తిప్పటం చాలా కష్టం అయింది.

### సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన లాభాలు

- పై పై దుక్కులు కాబట్టి, దుక్కి దున్నటానికి కూడా తక్కువ ఖర్చు అయింది. అంతేకాక నాకు, పశువులకు కూడా శ్రమ తగ్గింది.
- విత్తనం ఖర్చు చాలా తగ్గినది. సాధారణ పద్ధతిలో 30 కిలో గ్రాముల విత్తనాన్ని వాడితే ఈ శ్రీ పద్ధతిలో కేవలం 2 కిలో గ్రాముల విత్తనం సరిపోయింది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం చాలా తగ్గినది.
- సాధారణ పద్ధతిలో వచ్చే ఏ విధమైన పురుగులు కాని తెగుళ్ళు కాని రాలేదు.
- సాధారణ పద్ధతితో పోలిస్తే పంట తొందరగా చేతికి వచ్చినది. తాలు గింజలు చాలా తక్కువ పరిమాణంలో వచ్చాయి.
- మామూలు పద్ధతిలో ఒక్కొక్క మొక్కకు 25 నుండి 30 పిలకలు వస్తే శ్రీ పద్ధతిలో ఈ సంఖ్య 50 నుండి 60 కి పెరిగింది. అదే విధంగా కంకి పరిమాణం కూడా పెద్దగా ఉండి గింజ బరువు కూడా ఎక్కుగా ఉన్నది.
- సాధారణ పద్ధతిలో ఒక కంకికి 100 నుండి 120 గింజలు ఉంటే, శ్రీ పద్ధతి పాటించిన వరికి 150 నుండి 180 గింజలు ఉన్నాయి.
- సాధారణ పద్ధతితో పోలిస్తే గడ్డి దిగుబడి కూడా చాలా ఎక్కువ వచ్చింది (సుమారు $^1/_2$ ట్రాక్టరు ఎక్కువ వచ్చింది).

### ఈ శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిని అవలంభించటం కొంచెం కష్టమైన ప్రక్రియ
- మొదట అవలంభించినప్పుడు కొంచెం ఖర్చు ఎక్కువగానే అనిపిస్తుంది. కాని, ఈ పద్ధతిలో మెలుకువలను తెలుసుకొని, సమయాను కూలంగా పని చేస్తే అధిక స్థాయిలో దిగుబడి సాధించ వచ్చును. కలుపు మందులు వాడరాదు.
- ఒక ఎకరా పొలానికి ఒక సెంటు నారు మడి మాత్రమే సరిపోతుంది.
- మొక్క దూర దూరంగా నాటడం వలన ప్రతీ మొక్క యొక్క ఆకులకు సూర్యరశ్మి బాగా సోకుతుంది. దాని ద్వారా ఒక్కొక్క మొక్కకి తగినంత స్థలం, నీరు, పోషకాలు ఎక్కువగా అంది వేర్లు దృఢంగా పెరిగి మొక్క బాగా పెరగటానికి దోహదం చేస్తుంది.

- లేత మొక్కలను తక్కువ లోతులో నాటడం వలన తొందరగా నిలదొక్కుకొని ఎక్కువ పిలకలు వేస్తాయి.
- దుక్కి 4 అంగుళాల కంటే ఎక్కువ లోతు లేకుండా చూసుకోవడం మంచిది. అందువలన వీడర్ దిగబడదు, సులభంగా తిరుగుతుంది.
- తక్కువ లోతు దుక్కి సరిపోతుంది కావున ఎక్కువ సార్లు దున్నక్కర్లేదు. దీని వలన సమయం, డబ్బు ఆదా అవుతుంది.
- నారు మడి చుట్టూ ఒక అడుగు వెడల్పు, $^1/_2$ అడుగు లోతులో కూడిన కాలువ తీసి అందులో నీరు నింపినట్లయితే, నారు మడికి నిమ్ము అందటం వలన నీరు పెట్టాల్సిన అవసరం ఉండదు. ప్రధాన పొలాన్ని చదునుగా ఉంచడం వలన నీటి యాజమాన్యం సులువు అవుతుంది.
- నీటి యాజమాన్యం చాలా జాగ్రత్తగా చేపట్టాలి, పొలం తడిగా ఉండాలి కానీ నీరు నిలువకూడదు.
- ఎక్కువవైన నీరు బయటకు పోవటానికి కాలువలు ఏర్పాటు చేసుకొని పొలం ఆరినప్పుడుల్లా నీరు పెట్టుకోవాలి.
- సేంద్రియ ఎరువులు వాడకం వలన, మొక్కల మధ్య దూరం ఎక్కువగా ఉండటం వలన శ్రీ పద్ధతిలో చీడ పీడలు ఆశించడం చాలా తక్కువగా ఉంటుంది. ఎప్పుడైన చీడ పీడలను అదుపు చేయాల్సిన పక్షంలో సాంప్రదాయ చీడ పీడల నివారణా పద్ధతులు పాటించాలి.

## సలహాలు, సూచనలు

స్వచ్ఛంధ శిక్షణా సంస్థల సహకారం లభించినట్లయితే ఎక్కువ మంది రైతులు ఈ పద్ధతిని అవలంభించే అవకాశం ఉన్నది. ఈ పద్ధతిలో వీడర్‌ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి. ఈ పద్ధతిని పాటించే రైతులకు ప్రభుత్వ పరంగా సబ్సిడీలు, ఋణాల వంటి ప్రోత్సాహకాలను ఇవ్వడమే కాకుండా, వ్యవసాయ శాఖ సహకారంతో ఈ పద్ధతి ఎక్కువ మంది రైతులకు తెలిసేలా చర్యలు చేపట్టాలి. దుక్కి దున్నే పద్ధతులలో మార్పు తీసుకు రావడం ద్వారా, వీడర్లను అభివృద్ధి చేయడం ద్వారా స్త్రీలు కూడా వీడర్లు తిప్పేలా చేసినట్లయితే ఈ విధానాన్ని ఎక్కువ మంది రైతులు ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టే అవకాశం ఉంటుంది. ఏ ఏ నేలలో ఏ ఏ రకాలు పండించాలి. శ్రీ పద్ధతిలోని ఏ ఏ విధానాలను అవలంబించాలన్న సమాచారాన్ని రైతు లోకానికి తెలియచేయాలి. అందువలన రైతులకు ఈ విధానం పట్ల పూర్తి అవగాహన కలుగుతుంది.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతలు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబందించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 110 రోజులు | 125 రోజులు |
| 3. | కాల పరిధి | 2 కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 12 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు, | డి.ఏ.పి., యూరియా, పొటాష్ MOP |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఫోరేట్, ఎకలెక్స్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం 3 సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 50 | 600 |
| 2. | నారుమడి తయారీ | 200 | 300203 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 300 | 600 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 400 | 800 |
| 5. | ఎరువులు | 1,000 | 1,500 |
| 6. | పురుగు మందులు | 1,000 | 1,500 |
| 7. | పంటకోత, మార్పిడి | 2,200 | 2,200 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 5.150 | 7,500 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,350 | 2,850 |
| 10. | మొత్తం లాభం (9.50 /Kg ) | 41,325 | 27,075 |
| 11. | నికర లాభం | 36,175.00 | 19,575.00 |



## మేకబొడ్డు ఎల్లయ్య

కట్కూర్, వరంగల్ జిల్లా

నా పేరు మేకబొడ్డు ఎల్లయ్య, వరంగల్ జిల్లా, బచ్చన్న పేట మండంలోని కట్కూర్ గ్రామానికి చెందిన రైతును. నా వయసు 45 సంవత్సరాలు, గత 25 సంవత్సరాలుగా వ్యవసాయువే ప్రధాన వృత్తిగా జీవనం కొనసాగిస్తున్నాను. నాకు 6 ఎకరాల పొలం ఉన్నది. అందులో 2 ఎకరాలలో వరి పండిస్తాను. దీనికి బోరు సదుపాయం కలదు. మిగిలిన పొలంలో మొక్క జొన్న, పత్తి, కందులు, ఆముదం వంటి ఇతర పంటలు పండిస్తాను. నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. ఒక కొడుకు, కూతురుకి పెళ్ళిళ్ళు అయిపోయాయి. నా భార్య కూడా నాతో పాటు వ్యవసాయం చేస్తుంది. మేము సాధారణ పద్ధతిలో వరి సాగు విధానంలో మొదటిసారిగా దుక్కి దున్నే సందర్భంలో 6, 7 ఎద్దుల బండ్ల పశువుల పెంటను పోస్తాము. ఎరువుల విషయంలో ఎక్కువగా ఎకరానికి 2 బస్తాల డి.ఏ.పి. నాట్లు వేసే సమయంలో దుక్కులో పోయటమే కాకుండా మొక్కల పెరుగుదలకు 2 బస్తాల యూరియాను మూడు ధఫాలుగా చల్లుతాము. గింజ ఏర్పడే దశలో 1 బస్తా పొటాష్‌ను వాడుతాము. చేనుకు తెగుళ్ళు, పురుగులు ఆశించినప్పుడు ఫోరేట్ గుళికలు, క్లోరోఫైరిఫాస్, ఎకలెక్స్ గుళికలు వాడుతాను. నేను సాధారణంగా IR 64 రకాన్ని పండిస్తాము. అది సాధారణంగా 35 - 40 బస్తాల దిగుబడినిస్తుంది.

నేను పెద్దగా ఏమి చదువుకోలేదు, అంతేకాక వ్యవసాయంలో నూతన పద్ధతులు ఏమి అంతుకు ముందు వినలేదు. కానీ 2007 సంవత్సరపు రబీ కాలంలో CROPS సంస్థ వారు గ్రామంలో మీటింగ్ పెట్టి వరి పండించటానికి కొత్త పద్ధతి ఉన్నది అని, దీనిలో తక్కువ నీరు, తక్కువ విత్తనంతో అధిక దిగుబడి సాధించ వచ్చని చెప్పారు. అంతేకాక ఎంత పొలంలో వీలైతే అంత సాగుచేయమని, దానికి మా పూర్తి సహకారం ఉంటుందని సంస్థ వారు చెప్పడంతో సరే చూద్దామని $^1/_2$ ఎకరంలో IR 64 రకాన్ని ఈ పద్ధతిలో సాగు చేసాను. మిగిలిన 1 $^1/_2$ ఎకరంలో సాధారణ పద్ధతిలో సాగు చేసాను. $^1/_2$ ఎకరంలో శ్రీ పద్ధతిలో పండించిన వరికి 28 బస్తాల దిగుబడి వస్తే, 1 $^1/_2$ పొలానికి 60 బస్తాల దిగుబడి వచ్చింది. అంటే $^1/_2$ ఎకరాకు 8 బస్తాల అధిక దిగుబడి వచ్చింది. ఈ ఉత్సాహంతో తరువాతి ఖరీఫ్ సీజన్‌లో పూర్తి

రెండు ఎకరాలలో ఈ శ్రీ పద్ధతిలోనే వరిని పండించాను. కానీ ఈ సారి B.P.T 5204 రకం పండించాను. విత్తనం ఏదైనా దిగుబడి మాత్రం అధికంగానే వచ్చింది. ఈ సారి ఎకరాకు 55 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ రెండు సీజన్లలో కూడా CROPS సంస్థ వారు బాగా సహకరించినారు. రైతు బడులు ఏర్పాటు చేసినారు. మార్కర్లు, వీడర్లు యిచ్చినారు వాలంటీర్లను నియమించి పంటకు సంబంధించిన విషయాలు ఎప్పటికప్పుడు తెలియచేసారు. మహబూబ్‌నగర్ జిల్లాకు తీసుకు వెళ్ళి అక్కడి రైతులతో మాట్లాడించినారు. ఈ విధానంలో ఉన్న లాభాలను గ్రహించినాక భవిష్యత్తులో కూడా నేను ఇదే విధానంలో వరిని పండిస్తాను అని నిర్ణయం తీసుకున్నాను.

### శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- ముందుగా నారు మడి తయారు చేసుకున్నాను. 2 కేజీల విత్తనాన్ని నానబెట్టి, ఆ తరువాత మండె కట్టగా వచ్చిన మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.
- నారు తయారు కావటానికి ముందే ప్రధాన పొలాన్ని తక్కువ లోతుగా దున్నుకున్నాను, దానితో పాటే మార్కర్‌తో గీతలు పొలంలో గీసాము.
- 15 రోజుల నారు పీకి పొలంలో నాటుకున్నాము.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటాము.
- నాటు వేసిన 10 రోజులకు ఒకసారి, ఆ తరువాత మూడు సార్లు వీడర్‌తో కలుపు తీయించాము.
- వీడర్ ద్వారా తీయలేని కలుపు మొక్కలను కూలీలను పెట్టి చేతితో ఏరి వేయించాము. ఏ విధమైన కలుపు మందులు ఉపయోగించలేదు.

### సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- చీడ పీడలు చాలా తక్కువ మొత్తంలో ఆశించాయి. పది రోజులకు ముందుగానే కోతకు వచ్చినది.
- ఒక ఎకరా పొలానికి 1 సెంటు నారు మడి మాత్రమే సరి పోయింది. అదే సాధారణ పద్ధతిలో 5 సెంట్ల నారు మడి అవసరం అయింది. ఎలుకల బెడద కూడా చాలా తగ్గినది. తాలు గింజలు తక్కువ వచ్చాయి. గింజ బరువు కూడా ఎక్కువ ఉన్నది. మొక్క బలంగా పెరగటం వలన ఖరీఫ్‌లో వచ్చిన తుఫాను గాలులకు పడిపోలేదు.
- సాధారణ పద్ధతిలో పోలిస్తే ఈ పద్ధతిలో కనీసం 15 బస్తాల దిగుబడి అధికంగా వచ్చినది.

### శ్రీ పద్ధతి పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదట్లో అన్నీ విషయాలు కొత్తగా అనిపించాయి.

- మొదటిసారి దుక్కిలోనే 2 బండ్ల పెంటపోగు, 25 కిలోల డి.ఏ.పి., 50 కిలోల యూరియా పోసాను. కానీ రెండవ సీజన్లో రసాయనిక ఎరువులు దొరకక భయపడ్డాను. కానీ ఏదైతే అదవుతుంది చూద్దాం అనుకుని కేవలం పశువుల పెంట, గొర్రెల పెంట ఎకరానికి 5 బండ్ల చొప్పున పోసాను. అయినా పంట దిగుబడి అధికంగానే వచ్చింది.
- మొదటిసారి నారు పోయటానికి కొంచెం లేటు అయినది. అందువలన దిగుబడి ఎంత వస్తుందో అని భయపడ్డాను. కానీ సాధారణ పద్ధతితో పోలిస్తే అధికంగానే వచ్చింది.
- నాట్లు అప్పుడు ఇబ్బంది అయింది. ఒక్కొక్క మొక్క నాటాలి అంటే కూలీలు వినలేదు. ఎత్తుమడి తయారు చేసుకోవటం మొదట్లో ఇబ్బంది అయింది. ఆడ కూలీలు వీడర్ తిప్పలేక పోతున్నారు.

## శ్రీ పద్ధతి అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- విత్తనం ఏదైనా పంట దిగుబడి అధికంగా వస్తుంది.
- రసాయనిక ఎరువులు అసలు ఉపయోగించ పోయినా దిగుబడిలో అసలు తేడా రాదు. అసలు రసాయనిక ఎరువులు ఉపయోగించాల్సిన పనిలేదు.
- ఈ పద్ధతిలో 10-12 రోజులు లేత మొక్కలను మాత్రమే నాటుకోవాలి. మొక్కలను చాలా జాగ్రత్తగా నాటుకోవాలి.
- కలుపును వీడర్ ద్వారానే తీయాలి. కలుపు మందులు అసలు వాడకూడదు.ఈ పద్ధతిలో పొలంలో నీరు నిలువ కూడదు. పొలాన్ని తడుపుతూ ఆరపెడుతూ ఉండాలి.
- మామూలు పద్ధతిలో ఒక్కొక్క దుబ్బుకు 25 నుండి 30 పిలకలు వస్తే శ్రీ పద్ధతిలో ఈ సంఖ్య 45 నుండి 50 కి పెరిగింది. అదే విధంగా కంకి పరిమాణం కూడా పెద్దగా ఉండి గింజ బరువు కూడా ఎక్కువగా ఉన్నది. తాలు గింజలు చాలా తక్కువగా ఉంటాయి. గింజ బరువు కూడా ఎక్కువగా ఉంటుంది.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో వీడర్ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేసి స్త్రీలు కూడా వీడర్లు తిప్పేలా చేసినట్లయితే ఈ విధానాన్ని ఎక్కువ మంది రైతులు ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టే అవకాశం ఉంటుంది. ఏ ఏ నేలలో ఏ ఏ రకాలు పండించాలి, శ్రీ పద్ధతిలోని ఏ ఏ విధానాలను అవలంభించాలన్న సమాచారాన్ని రైతు లోకానికి తెలియచేయాలి. అందువలన రైతులకు ఈ విధానం పట్ల పూర్తి అవగాహన కలుగుతుంది. CROPS లాంటి

స్వచ్ఛంధ సంస్థలు అనేకం ముందుకు వచ్చి రైతాంగానికి తగిన సహకారం అందిచినట్లయితే ఈ పద్ధతి మరింత ముందుకు పోవటానికి అవకాశం కలుగుతుంది. నేను శ్రీ పద్ధతిని మాత్రమే అవలంభించాను దానిలో ఈ క్రింది విధంగా ఖర్చులు, ఆదాయాలు కనిపించాయి.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి |
|---|---|---|
| 1. | విత్తన రకం | B.P.T 5204 |
| 2. | కాల పరిధి | 118 రోజులు |
| 3. | విత్తనం | 2 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 11 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు |
| 6. | పురుగు మందులు | క్లోరోఫైరిఫాస్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి |
|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 50 |
| 2. | దుక్కులు | 2,000 |
| 3. | నారుమడి తయారీ | 200 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 600 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 200 |
| 6. | ఎరువులు | 1,000 |
| 7. | పురుగు మందులు | 200 |
| 8. | పంటకోత, మార్పిడి | 2,200 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 6,450 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,125 |
| 11. | మొత్తం లాభం (9.50 /Kg ) | 39,187 |
| 12. | నికర లాభం | 32,737.00 |

## దుద్దెడ సుగుణమ్మ

### కట్కూర్, వరంగల్ జిల్లా



నా పేరు దుద్దెడ సుగుణమ్మ, నా వయస్సు 38 సంవత్సరాలు. మాది వరంగల్ జిల్లా లోని బచ్చన్న పేట మండలం, కట్కూర్ గ్రామం. నాకు ముగ్గురు ఆడ పిల్లలు, అందరూ చదువుకుంటున్నారు. మాకు 2 ఎకరాల తరి పొలం ఉన్నది. దీంట్లో వరి పండిస్తాము. అంతేకాక ఇంకా మూడు ఎకరాల కుష్కి కౌలుకు తీసుకొని పత్తి, మొక్కజొన్న వంటి పంటలు పండిస్తాను. నా భర్తతో కలిసి వ్యవసాయం చేస్తాను. నేను అసలు చదువుకోలేదు. కానీ నా సంతకం నేనే చేయగలను. 18 సంవత్సరాల నుండి నా భర్తతో కలిసి వ్యవసాయం చేస్తున్నాను. వ్యవసాయమే మా కుటుంబ ప్రధాన వృత్తి. సాధారణ పద్ధతిలో వరిసాగు చేయటానికి నాగలి, గొర్రు, కొడవళ్ళు వంటి సాధనాలను ఉపయోగిస్తాము. పశువుల పెంటను కూడా ఉపయోగిస్తాము. వీటితో పాటు డి.ఏ.పి., యూరియా వంటి ఎరువులను, చీడపీడల నివారణకు గుళికల మందులు కూడా ఉపయోగిస్తాము. మేము సాధారణంగా ఈ ప్రాంతంలో అధికంగా పండించే IR 64 రకాన్ని పండిస్తాము. ఈ పద్ధతిలో మాకు 35 నుండి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

నేను పెద్దగా చదువుకోక పోయినప్పటికీ పొదుపు సంఘాల్లో బాగా చురుకుగా పాల్గొంటాను. మండల ఆఫీస్‌కి, బ్యాంకులకి, మీటింగ్‌లకి మిగిలిన ఆడవాళ్ళతో కలిసి వెళుతుంటాను. అట్లా వెళ్ళినప్పుడు ఒకసారి ఈ శ్రీ పద్ధతిలో వరి పండించటం గురించి విన్నాను. నా భర్తతో కూడా చెప్పాను. దానికి ఆయన అది నిజమో కాదో తెలియదు, ఒకవేళ అది నిజమే అయినా దాని గురించి మనకి పూర్తిగా తెలియాలి కదా, ఊర్లో కూడా ఎవరికి తెలియదు అనుకుంటాను, ఏవరైనా ఈ పద్ధతిలో చేస్తే చూద్దాములే అన్నాడు. తరువాత మా అదృష్టం కొద్ది CROPS సంస్థ వాళ్ళు మా ఊరికి వచ్చి, మా ఊరి రైతులతోనే ఈ పద్ధతిలో పంట పండించటానికి సహాయం చేస్తాము అనేసరికి, నేను, నా భర్త సంతోషంగా ఒప్పుకొన్నాము. ఊరిలో రైతులకు నేను కూడా చెప్పాను. ఇంతకు ముందే ఈ పద్ధతి గురించి విన్నాను, అందరం కలిసి చేద్దాము అని కొంత మందిని ఒప్పించగలిగాము. అలా మొదలు పెట్టిన తర్వాత రెండు కాలాలుగా

ఈ పద్ధతిలో IR 64 రకం వరిని పండిస్తున్నాను. మొదటి కాలంలో మాకు 50 బస్తాల దిగుబడి వస్తే, ఆ తరువాత కాలంలో 56 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ రెండు కాలాలలో కూడా CROPS సంస్థ వారు బాగా సహకరించారు. రైతు సంఘాలు ఏర్పాటు చేసారు. మా ఊరు నుండి ఇద్దరు రైతులను గుర్తించి వాళ్ళకు శిక్షణ ఇచ్చి వాలంటీర్లగా నియమించారు. వాళ్ళు మాకు ఎప్పటికప్పుడు విషయాలు తెలియచేశారు. సంస్థ వారు రైతు బడులు ఏర్పాటు చేశారు. మార్కర్లు, వీడర్లు ఇచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాకు తీసుకు వెళ్ళి అక్కడి రైతులతో మాట్లాడించారు. పెద్ద సార్లు వచ్చారు మా రైతులతో మాట్లాడి ఎన్నో విషయాలు చెప్పారు. ఇక నుండి ఇదే పద్ధతిలో పండించాలని నేను, నా భర్త నిర్ణయం తీసుకున్నాము. నేను అన్నీ పొదుపు మీటింగ్‌లలో ఈ పద్ధతి గురించి మా ఆడవాళ్ళకు చెప్పి, మీ భర్తలతో కూడా చేయించండి, మంచి లాభాలు ఉంటాయి అని తెలియచేస్తున్నాను.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- 2 కేజీల విత్తనాన్ని నానబెట్టి, ఆ తరువాత మండె కట్టి మొలకెత్తించాము.
- ఆ తర్వాత మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాము.
- నారు పెరిగే లోపల ప్రధాన పొలాన్ని దున్నుకున్నాను.
- దమ్ము చేసిన పొలంలో వీడర్‌ను లాగటం ద్వారా 24 x 24 సెంటి మీటర్ల దూరంలో నిలువు మరియు అడ్డ గీతలు ఏర్పడేలా చేసాను.
- వరసలు తిన్నగా ఉండటానికి పొలం పొడవునా తాడు కట్టి దాని వెంట మార్కర్‌ని లాగాము.
- నాటేటప్పుడు 10 రోజల వయసు ఉన్న మొక్కలను, విత్తనం, వేర్లతో సహా జాగ్రత్తగా పీకి ఒక్కొక్క మొక్కనే నాటించాము.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటాము.
- ఈ పద్ధతిలో పొలం తడిచేలా మాత్రమే నీళ్ల పెట్టాము. పొలాన్ని నిరంతరం తడుపుతూ, ఆరబెడుతూ ఉండేలా చూసాము.
- నాటిన పదిరోజుల తరువాత వీడర్‌తో కలుపు తీసాము.
- ఆ తరువాత మూడుసార్లు వీడర్‌తో కలుపు తీయించాము, కానీ ఏ విధమైన కలుపు మందులు వాడలేదు.
- వీడర్ ద్వారా తీయలేని కలుపు మొక్కలను కూలీలను పెట్టి చేతిలో ఏరి వేయించాము.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- తక్కువ విత్తనం (కేవలం 2 కిలోల) తో సాగుచేసాము.
- పది రోజులకు ముందుగానే కోతకు వచ్చినది.

- చీడ పీడలు చాలా తక్కువ మొత్తంలో ఆశించాయి. తాలు గింజలు తక్కువ వచ్చాయి. గింజ బరువు కూడా ఎక్కువ ఉన్నది.
- మొక్క బలంగా పెరగటం వలన ఖరీఫ్‌లో వచ్చిన తుఫాను గాలులకు పడిపోలేదు.
- పెట్టుబడులు తగ్గటమే కాకుండా, పంట దిగుబడి ఎక్కువగా రావటం వలన ఆదాయం ఎక్కువగా వచ్చినది.

## శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- ఆడ కూలీలు వీడర్ తిప్పలేక పోతున్నారు.
- ఈ పద్ధతిలో ఉన్న అన్ని విధానాలను అర్థం చేసుకోవటానికి, నేర్చుకోవటానికి మొదట్లో కొంత ఎక్కువ సమయం పట్టింది.
- ఖరీఫ్ సీజన్‌లో వర్షాల వలన సరైన సమయంలో నాటు వేయడానికి ఇబ్బంది కలిగింది.
- మొదటి సీజన్‌లో నాట్ల సమయంలో ఎలా నాటాలో కూలీలకు అర్థం కాక చాలా ఇబ్బంది కలిగింది.

## శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- మాములు పద్ధతిలో ఒక్కొక్క మొక్కకు 25 నండి 30 పిలకలు వస్తే శ్రీ పద్ధతిలో ఈ సంఖ్య 50 కి పెరిగింది. అదే విధంగా కంకి పరిమాణం కూడా పెద్దగా ఉండి గింజ బరువు కూడా ఎక్కువగా ఉన్నది.
- సాధారణ పద్ధతిలో ఒక కంకికి 100 నుండి 120 గింజలు ఉంటే, శ్రీ పద్ధతి పాటించిన వరికి 150 నుండి 170 గింజలు ఉన్నాయి.
- నారు మడి చుట్టు కాలువ తీసి అందులో నీరు పెడితే నారుకు నీరు చక్కగా అందుతుంది.
- ఈ పద్ధతిలో చీడ పీడలు ఆశించటం చాలా తక్కువగా ఉంటుంది. పంట తొందరగా చేతికి వస్తుంది.

## సలహాలు, సూచనలు

ఇందులో వీడర్ తిప్పటం చాలా కష్టంగా ఉంటుంది. చేతికి బాగా శ్రమ కలుగుతుంది. ఏదైనా మిషన్ లాంటిది ఉంటే బాగుంటుంది. ఇంత కష్టం చేసి పంట పండిస్తే మాములు ధర ఇస్తున్నారు. ఈ పంటకు ఎక్కువ ధర ఇస్తే బాగుంటుంది కదా ? పొదుపు సంఘాల మీటింగ్‌లప్పుడు ఈ పద్ధతి గురించి చెప్తే రాష్ట్రంలో ఆడవాళ్ళందరికీ ఈ పద్ధతి గురించి తెలుస్తుంది. అందువలన చాలా మంది రైతులు ముందుకు వస్తారు. అందరూ లాభ పడతారు.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతినీ కూడా ఒకేసారి పాటించడం వలన యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించడం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | పయనీర్ (హైబ్రిడ్) | IR 64 |
| 2. | కాల పరిధి | 115 రోజులు | 127 రోజులు |
| 3. | విత్తనం | 2 కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 11 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు, డి.ఏ.పి., పొటాష్ | డి.ఏ.పి., యూరియా, పొటాష్ (MOP) |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఫోరేట్ గుళికలు, ఎండోసల్ఫాన్ |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం మూడు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 50 | 650 |
| 2. | దుక్కులు | 1,500 | 2,500 |
| 3. | నారుమడి తయారీ | 150 | 250 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 450 | 600 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 300 | 800 |
| 6. | ఎరువులు | 1,000 | 1,300 |
| 7. | పురుగు మందులు | - | 1,070 |
| 8. | పంటకోత, నూర్పిడి | 3,100 | 3,100 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 6,550 | 9,270 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,200 | 2,850 |
| 11. | మొత్తం లాభం (9.50 / Kg ) | 39,900 | 27,075 |
| 12. | నికర లాభం | 33,400.00 | 17,805.00 |



## మూసిని లలిత

కట్కూర్, వరంగల్ జిల్లా

నా పేరు మూసిని లలిత, మాది వరంగల్ జిల్లాలోని బచ్చన్న పేట మండలం కట్కూర్ గ్రామం. మాకు 5 ఎకరాల పొలం ఉన్నది. 2 ఎకరాల తరి, 3 ఎకరాల మెట్ట ఉన్నది. సాగు నీటి కొరకు ఒక బోరు ఉన్నది. దాని క్రింద వరి సాగు చేస్తాము. మిగిలిన 3 ఎకరాలలో మొక్కజొన్న పండిస్తాము. నేను నా భర్తతో కలిసి 15 సంవత్సరాల నుండి వ్యవసాయం చేస్తున్నాము. వ్యవసాయమే నా కుటుంబ ప్రధాన వృత్తి. నాకు నలుగురు పిల్లలు. ఇద్దరు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలు. సాధారణ పద్ధతిలో వరిసాగు చేయటానికి నాగలి, గొర్రు, కొడవల్లు వంటి సాధనాలను ఉపయోగిస్తాము. మాకు పశువులు ఉన్నాయి. ఈ పశువుల పెంటను కూడా ఉపయోగిస్తాము. వీటితో పాటు డి.ఏ.పి., యూరియా వంటి ఎరువులను మరియు చీడపీడల నివారణకు గుళికల మందులు ఉపయోగిస్తాము. మేము సాధారణంగా ఈ ప్రాంతంలో అధికంగా పండించే IR 64 రకాన్ని పండిస్తాము. ఈ పద్ధతిలో మాకు 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

నేను ఆడమనిషిని అవటం వలన మరియు పెద్దగా చదువుకోక పోవటం వలన వ్యవసాయంలో కొత్త పద్ధతులు ఉంటాయని, పెద్ద పెద్ద సార్లు కూడా వ్యవసాయం గురించి పని చేస్తారని నాకు తెలియదు. కాని 2007 సంవత్సరపు రబీ సీజన్‌లో CROPS సంస్థ వారు మా గ్రామానికి వచ్చి కళాజాత ప్రోగ్రాం ద్వారా శ్రీ పద్ధతిలో వరి పండించటం గురించి చెప్తే విన్నాను. కాని ఇదంతా ఒక పిచ్చి, ఎక్కడైనా ఒక్క మొక్క నాటితే దానికి బోలెడన్ని పిలకలు వచ్చి పంట దిగుబడి అధికంగా వస్తుందట, అ ఒక్క మొక్క బతికేదెన్నడు, పంట పండే దెన్నడు, అని చెప్పి, నా భర్తను ఆ మాట ఎత్తకుండా చేసాను. కాని CROPS సంస్థ వారు వదలలేదు, ఇంటింటికి వచ్చి రైతులను పోగేసినారు, నా భర్త కూడా వాళ్ళతో చేరి మనం కూడా ఒక ఎకరం చేద్దామే, పంట ఎక్కువ వచ్చి, ఖర్చులు తగ్గితే మనకి లాభమే కదా అని అన్నప్పటికీ కూడా, నా మనుసులో భయం ఉన్నది. అదే ఆలోచించి వద్దు మామ వచ్చే సంవత్సరం చేద్దాములే అన్నాను. కానీ నా భర్త వచ్చే సంవత్సరం సంస్థ వారు వస్తారో లేదో ఇప్పుడు అయితే అన్నీ దగ్గర ఉండి పనులు చేయిస్తాము అంటున్నారు. శిక్షణలు యిప్పిస్తామని

కూడా అంటున్నారు, పెద్ద పెద్ద సార్లు కూడా హైదరాబాదు ఇంకా ఇతర దేశాల నుండి వచ్చి మనకి తెలియని విషయాలు చెప్తారంట, అది కూడా కాక ఈ పద్ధతిలో పంట తక్కువ వచ్చినా, ఖర్చు ఎక్కువ వచ్చినా సంస్థ వారు ఆ నష్టాన్ని భరిస్తామని, చెప్పారు చేద్దాం ఫరవాలేదు అనేసరికి కొంత అయిష్టంగానే ముందుకు వచ్చాను. మొదటి సంవత్సరం 1 ఎకరంలో సాగు చేసాము. సాధారాణ పద్ధతి కంటే 12 బస్తాల అధిక దిగుబడి రావడంతో, ఆ తరువాతి ఖరీఫ్ లో 2 ఎకరాలు సాగు చేస్తాము. అంతే కాక పక్కవారి పొలం 1 ఎకరం కౌలుకు తీసుకొని సాధారణ పద్ధతిలో ఒక ఎకరం సాగు చేసాము. ఈ రెండవ సీజన్ లో కూడా మాకు అధిక దిగుబడులు వచ్చాయి. సాధారణ పద్ధతిలో 38 బస్తాలు వస్తే ఈ శ్రీ పద్ధతిలో 56 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ రెండు సీజన్లలో కూడా CROPS సంస్థ వారు బాగా సహకరించినారు. రైతు బడులు ఏర్పాటు చేసినారు. మార్కర్లు వీడర్లు యిచ్చినారు. పెద్ద పెద్ద సార్లు వచ్చి మా రైతులతో మాట్లాడి ఎన్నో విషయాలు చెప్పినారు. మాకు పంట ఎక్కువ వస్తే వాళ్ళు మా కంటే ఎక్కువ సంతోషించినారు.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- 2 కేజీల విత్తనాన్ని నానబెట్టి, ఆ తరువాత మండె కట్టి మొలకెత్తించినాము.
- నారుకు ముందే ప్రధాన పొలాన్ని దమ్ముచేసి పెట్టాము.
- ఆ తరువాత మొలకెత్తిన నారును నాటాము.
- నారుమడిపై రోజూ ఉదయం, సాయంత్రం నీళ్ళు చిలకరించాము.
- నాటటానికి ఒక రోజు ముందే మార్కర్‌తో గీతలు గీసాము
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 2 సార్లు కలుపు తీసాము.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- విత్తన ఖర్చు తక్కువ, ఎకరాకు 2 కిలోలు మాత్రమే వాడాము
- విత్తనం, కూలీ, ఎరువులు మరియు పురుగు మందుల ఖర్చు తక్కువ
- చాలా తక్కువ నీటితో పంట పండించాము.
- ఎలుకల బెడద కడా చాలా తగ్గినది.
- శ్రీ పద్ధతిలో మాకు ఎక్కువ పశుగ్రాసం లభించింది.

## శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదటి సీజన్‌లో వీడర్‌ని తిప్పటానికి చాలా కష్టపడాల్సి వచ్చింది, దీని వలన దిగుబడి కూడా కొంత తక్కువగా వచ్చినది.
- ఆడ కూలీలు వీడర్ తిప్పలేక పోతున్నారు.

## శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటు కోవాలి మరియు లేత మొక్కలను మాత్రమే నాటుకోవాలి.
- అన్ని పనులు సమయం ప్రకారం చేయాలి
- ఈ పద్ధతిలో చీడ పీడలు ఆశించటం చాలా తక్కువగా ఉంటుంది మరియు పంట తొందరగా చేతికి వస్తుంది.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో నాటు వేయడం అనేది కొంచెం కష్టం కావున, ఆడ కూలీలకు ఎక్కువ డబ్బు యిచ్చేలా రైతులను ఒప్పించాలి. మా రైతులకు కూడా ఎక్కువ ఆదాయం వస్తున్నది కావున, కూలీలకు కొంచెం ఎక్కువ డబ్బు యిస్తే నష్టం ఏమీ లేదు. కూలీలకు కూడా ఈ పద్ధతి గురించి శిక్షణ యిస్తే వాళ్ళు బాగా అర్థం చేసుకుంటారు. మేము చెప్పేదానికంటే పెద్దసార్లు చెప్పితే వాళ్ళు బాగా వింటారు.

మేము శ్రీ పద్ధతిని మరియు సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు మరియు రాబడికి సంబందించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 113 రోజులు | 127 రోజులు |
| 3. | విత్తనం | 2 కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 10 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు, | డి.ఏ.పి., యూరియా, పొటాష్ (MOP) |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ప్యూరిడాన్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | దుక్కులు | 2,000 | 2,500 |
| 2. | విత్తన ఖర్చు | 30 | 600 |
| 3. | నారుమడి తయారీ | 100 | 200 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 400 | 600 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 300 | 800 |
| 6. | ఎరువులు | 800 | 1,300 |
| 7. | పురుగు మందులు | - | 300 |
| 8. | పంటకోత, మార్పిడి | 1,700 | 1,700 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 5,230 | 8,500 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,050 | 2,700 |
| 11. | మొత్తం లాభం (9.50 / Kg ) | 48,475 | 25,650 |
| 12. | నికర లాభం | 33,245.00 | 17,150.00 |



## మాల్ల అయిలయ్య

### కట్యూర్, వరంగల్ జిల్లా

నా పేరు మాల్ల అయిలయ్య, వయస్సు 48 సంవత్సరాలు. గత 25 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. నేను చదువుకోలేదు కాని నా సంతకం నేనే చేయగలను. వ్యవసాయమే నా ప్రధాన వృత్తి. మాది వరంగల్ జిల్లా లోని బచ్చన్నపేట మండలం, కట్యూర్ గ్రామము. నాకు ఒక భార్య , ఒక పిల్లవాడు ఉన్నారు. పిల్లవాడి వయస్సు 12 సంవత్సరాలు, చదువుకుంటున్నాడు. నాకు ఉన్న మొత్తం 5 ఎకరాల పొలంలో 2 ఎకరాలలో వరి పండిస్తాను. ఇక మిగిలిన ఎకరాలలో పత్తి, కంది వంటి ఇతర పంటలు పండిస్తాను. సాగు నీటి కొరకు ఒక బోరు, ఒక బావి ఉన్నవి. మేము సాధారణ పద్ధతిలో వరి నాటు పెట్టటానికి 20 రోజుల ముందు నుంచి పొలాన్ని మురగ పెట్టి 7, 8 సార్లు దున్నుతాము. రెండు బస్తాల డి.ఏ.పి. కాని, 1 బస్తా 28-28 అనే రసాయనిక ఎరువులను చల్లి నాటు వేస్తాము. సాధారణ పద్ధతిలో వరిని సాగుచేయడానికి ముఖ్యమైన పరికరాలుగా క్రర నాగలి, గొర్రు, కొడవళ్ళు ఉపయోగిస్తాము. చేనుకు తాటాకు తెగులు, కాండం తొలుచు పురుగు వంటివి ఆశించినప్పుడు కెల్డాన్ గుళికలు, ఫ్యూరిడాన్, ఫోరేట్ గుళికలు వాడతాము. నేను సాధారణంగా IR64 రకాన్ని పండిస్తాను. ఇది సాధారణంగా 135 రోజులకు కోతకు వస్తుంది, 40 బస్తాల దిగుబడినిస్తుంది.

2007వ సంవత్సరములో CROPS సంస్థ వారు మా గ్రామాన్ని సందర్శించినప్పుడు నేను శ్రీ పద్ధతిలో వరి పండించడం గురించి విన్నాను. వారు గ్రామములో సమావేశము ఏర్పాటు చేసి, శ్రీ పద్ధతిలో వరి పండించటం వలన కలిగే లాభాలు అంటే తక్కువ విత్తనం, తక్కువ చీడ పీడలు, తక్కువ నీటి వినియోగము, సాధారణ పద్ధతితో పోలిస్తే ఎక్కువ దిగుబడి వంటి వాటిని వివరించినప్పుడు నమ్మలేక పోయాను. ముఖ్యంగా తక్కువ నీటిని వినియోగించి వరి పండించవచ్చు అన్న విషయాన్ని అసలు నమ్మలేక పోయాను. కానీ CROPS సంస్థవారు ఈ శ్రీ పద్ధతి గురించిన అన్నీ వివరాలు, విధానాలు, కలిగే ప్రయోజనాలు, ఇబ్బందులు అన్నింటి గురించి తెలియచేయడంతో పాటు, ఈ పద్ధతిని అవలంభించటానికి అవసరమైన శిక్షణను కూడా అందచేస్తామని తెలియచేయడంతో పద్ధతి మీద

నమ్మకం కలిగి ముందుకు రావటం జరిగింది. కానీ, మొదటి రబీ కాలంలో $^1/_2$ ఎకరంలోనే సాగు చేసాను. $^1/_2$ ఎకరం శ్రీ పద్ధతిలో పండించిన పొలంలో 26 బస్తాల దిగుబడి వస్తే, $^1/_2$ సాధారణ పొలానికి 18 బస్తాలే దిగుబడి వచ్చింది. అంటే ఎకరాకు 16 బస్తాల అధికంగా వస్తుంది అని అర్థం అయింది. అందుకే తరువాత ఖరీఫ్ కాలంలో 1 ఎకరంలో సాగుచేసాను. ఈ సారి 56 బస్తాల దిగుబడి వచ్చింది. అదే సాధారణ పద్ధతిలో పొలానికి 39 బస్తాలే వచ్చినది. గడిచిన రెండు సీజన్లలో కూడా CROPS సంస్థ నుండి మాకు సంపూర్ణ సహకారం లభించినది. రైతు బడులు ఏర్పాటు చేశారు. మార్కర్లు, వీడర్లు ఇచ్చారు. వాలంటీర్లను నియమించి పంటకు సంబంధించిన విషయాలు ఎప్పటికప్పుడు తెలియచేశారు. ఇతర జిల్లాలకు తీసుకు వెళ్ళి అక్కడి రైతులతో మాట్లాడించినారు. ఇలా ఎన్నో విధాలుగా మాకు సహకారం అందించి, సంస్థవారు మా రైతాంగానికి మేలు చేసారు.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- 2 కేజీల విత్తనాన్ని నానబెట్టి, ఆ తరువాత మండె కట్టి మొలకెత్తించాము.
- అంతకు ముందే నారు మడి తయారు చేసుకున్నాను.
- ఆ తరువాత వచ్చిన మొలకెత్తిన విత్తనాలను నారుమడిలో చల్లాను.
- నారు తయారు కావటానికి ముందే ప్రధాన పొలాన్ని నాలుగు సార్లు దున్ని, దమ్ము చేసి, గొర్రుతో లెవలింగ్ చేసుకున్నాను.
- ఆ తరువాత మార్కర్‌తో నిలువు, అడ్డ గీతలు పొలంలో గీసాము.
- 11 రోజుల నారును తీసి ఒక్కొక్క మొక్కను నాటించాము.
- 10 రోజుల తరువాత వీడర్‌తో మొదటి సారి కలుపు తీసాను.
- మొదటిసారి కలుపు తీతలో 2 బండ్ల గొర్రెల పెంట పోసాను.
- వీడర్ గుంజటం వలన వచ్చిన కలుపును పొలంలోనే కలిసి పోయేలా చేసాము. అందువలన కలుపు మొక్కలు మురిగి పచ్చి రొట్ట ఎరువుగా తయారు అయింది.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- సాధారణ పద్ధతిలో 30 కిలో గ్రాముల విత్తనాన్ని వాడితే ఈ శ్రీ పద్ధతిలో కేవలం 2 కిలో గ్రాముల విత్తనం సరిపోయింది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం చాలా తగ్గినది. నా ఈ రెండు సీజన్ల అనుభవం ప్రకారం చూస్తే, ఒక ఎకరం సాంప్రదాయ పద్ధతికి పట్టే నీరు రెండు ఎకరాల

శ్రీ పద్ధతి పొలానికి సరిపోతుంది అని అర్థం చేసుకున్నాను.

- శ్రీ పద్ధతి అవలంభించిన రెండు సీజన్లలో కూడా చీడ పీడలు అసలు ఆశించలేదు.
- మొదటి సీజన్‌లో అనుభవం లేకపోవటం వలన కలుపు తీయటంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవటం, పంట దిగుబడి కూడా కొంత తక్కువ రావటం జరిగింది. కానీ తరువాత సీజన్‌లో ఇబ్బందులను అధిగమించటం వలన సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే అధిక దిగుబడిని సాధించాను.

## శ్రీ పద్ధతిని పాటించడానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

మొదటి సీజన్‌లో ఒక్కొక్క మొక్కను నాటేలా ఒప్పించటానికి మహిళా కూలీలతో ఇబ్బందిని ఎదుర్కొన్నాను. అదే విధంగా మొదటి సీజన్‌లో ఎత్తైన మడిని తయారు చేయడానికి కూడా కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నాను.

మొదటి సీజన్ లో విత్తనం నాటడానికి సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఖర్చు అయినది. కానీ రెండవ సీజన్ కల్లా కూలీలు అలవాటు పడటం వలన ఈ ఇబ్బంది తొలిగింది. పోల్చి చూస్తే రెండవ సీజన్‌లో కూలీల ఖర్చు కూడా తగ్గినది. మొదటి సీజన్‌లో వీడర్ తిప్పటంలో కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నప్పటికీ, రెండవ సీజన్ కల్లా అలవాటు పడటం వలన కొంత సులభం అయింది.

## ఈ శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిని అవలంభించటం కొంచెం కష్టమైన ప్రక్రియ. కావున సరైన సమయంలో, సరైన పద్ధతిలో విత్తనం నాటడం, వీడర్‌తో కలుపు తీయడం ఖచ్చితంగా అవలంభించినట్లయితే సాధారణ పద్ధతి కంటే అధిక మొత్తంలో దిగుబడి వస్తుంది అని తెలుసుకున్నాను. అదే విధంగా కూలీలకు సరైన శిక్షణ యిచ్చినట్లయితే విత్తనం నాటేటప్పుడు, కలుపు తీసేటప్పుడు వారికి పెద్దగా ఇబ్బంది కలగదు అని తెలుసుకున్నాను. మొక్క దూరం దూరంగా నాటడం వలన ప్రతీ మొక్క యొక్క ఆకులకు సూర్యరశ్మి బాగా సోకుతుంది. దాని ద్వారా ఒక్కో మొక్కకి తగినంత స్థలం, నీరు, పోషకాలు ఎక్కువగా అంది వేర్లు దృఢంగా పెరిగి మొక్క బాగా పెరగటానికి దోహదం చేస్తుంది. శ్రీ పద్ధతిలో తక్కువ నీటితో వరి పండించవచ్చు కావున మెట్ట ప్రాంత రైతులకు ఇది వర ప్రసాదంగా పని చేస్తుంది అని అర్థం చేసుకున్నాను. నా అనుభవం ప్రకారం వీడర్ తిప్పటం అనేది శ్రమతో కూడిన పని అయినప్పటికీ, దుక్కులు లోతుగా దున్నకుండా ఉంటే ఈ సమస్యను అధిగమించవచ్చును అని గ్రహించాను.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిని పాటించే రైతులకు ప్రభుత్వ పరంగా సబ్సిడీలు, ఋణాల వంటి ప్రోత్సాహకాలను ఇవ్వడమే కాకుండా, వ్యవసాయ శాఖ సహకారంతో ఈ పద్ధతి ఎక్కువ మంది రైతులకు తెలిసేలా చర్యలు చేపట్టాలి. గ్రామాల్లో ఉన్న, ప్రభుత్వం చేత గుర్తించ బడిన ఆదర్శ రైతులకు శిక్షణ అందించి వారి సేవలను సమర్థవంతంగా వినియోగించుకుని ఈ పద్ధతిని ఎక్కువ మంది రైతులు అవలంభించేలా చేయాలి.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతలు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబందించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 112 రోజులు | 127 రోజులు |
| 3. | విత్తనం | 2 కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 11 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ |
| 6. | పురుగు మందులు | ఫ్యూరిడాన్ గుళికలు | ఫ్యూరిడాన్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | దుక్కులు | 2,000 | 3,000 |
| 2. | విత్తన ఖర్చు | 30 | 600 |
| 3. | నారుమడి తయారీ | 200 | 300 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 400 | 600 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 300 | 400 |
| 6. | ఎరువులు | 600 | 1,300 |
| 7. | పురుగు మందులు | 300 | 400 |
| 8. | పంటకోత, మార్పిడి | 2,200 | 2,200 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 6,030 | 8,800 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,200 | 2,925 |
| 11. | మొత్తం లాభం (9.50 / Kg ) | 39,900 | 27,787 |
| 12. | నికర లాభం | 33,870.00 | 18,987.00 |

# బోనకల్లూరు గ్రామ రైతుల అనుభవాలు



## బద్దెపడిగె చంద్రారెడ్డి

**బోనకల్లూరు, వరంగల్ జిల్లా**

నేను వరంగల్ జిల్లా, బచ్చన్న పేట మండలం, బోనకల్లూరు గ్రామానికి చెందిన రైతును. నా పేరు బద్దెపడిగె చంద్రారెడ్డి, వయస్సు 36 సంవత్సరాలు, నేను ఉన్నత విద్యావంతుడైన (M.Com., B.Ed.) రైతుని. గత 12 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. వ్యవసాయమే నా ప్రధాన వృత్తి. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద కూతురు 10వ తరగతి చదువుతుంటే, చిన్న పాప 3వ తరగతి చదువుతున్నది. నేను ఉన్నత చదువులు చదివినప్పటికీ, చిన్నప్పటి నుండి వ్యవసాయం పట్ల ఉన్న మక్కువ కొద్దీ ఈ వృత్తిలోనే కొనసాగుతున్నాను. నాకు ఉన్న 9 ఎకరాల పొలంలో 3 ఎకరాలలో వరి పండిస్తాను. ఇక మిగిలిన పొలంలో పత్తి, కంది, మొక్క జొన్న వంటి ఇతర పంటలు పండిస్తాను. సాంప్రదాయ పద్ధతిలో ట్రాక్టర్లు, నాగలి, గొర్రు, పార, కొడవలిని ముఖ్య సాధనాలుగా వినియోగిస్తాము. వ్యవసాయానికి ముఖ్యంగా వర్షం మీద ఆధారపడినప్పటికీ, బోరు బావులు కూడా ఉన్నవి. వరిని ముఖ్యంగా ఈ బోర్ల క్రిందే పండిస్తాము. సాంప్రదాయ పద్ధతిలో సాధారణంగా మొదటి దశలో ఇస్సా, తరువాత దుబ్బు దశలో కాండము తొలుచు పురుగు, పొట్ట దశలో దోమపోటు వంటి పురుగులు ఆశిస్తాయి. వీటిని నివారించడానికి M45, కార్బోఫ్యూరాన్ గుళికలు, ఫోరేట్ గుళికలు, మోనోక్రోటోఫాస్ మందు, ఎండో సల్ఫాన్ వంటి వాటిని ఉపయోగిస్తాము. ఇక రోగాల విషయానికి వస్తే అగ్గి తెగులు, ఆకు మచ్చ తెగులు మరియు వేరుకుళ్ళు తెగులు ఆశిస్తాయి. వీటిని నివారించడానికి భావిస్టాన్ పొడి, కార్బండిజమ్ గుళికలు, కార్బోఫ్యూరాన్ గుళికలు వంటి వాటిని వినియోగిస్తాము. ఇక ఎరువులు విషయానికి వస్తే సాధారణంగా D.A.P., యూరియా, పొటాష్ వంటి వాటిని వినియోగిస్తాము. నేను వ్యవసాయం మొదలు పెట్టినప్పటి నుండి ఈ సాంప్రదాయ పద్ధతిలో సాధారణంగా వరి దిగుబడి 36 నుండి 40 బస్తాల (75 కిలోగ్రాములు/బస్తా) వరకు వస్తుంది.

నేను విద్యావంతుడైన రైతును అవ్వడం వలన వ్యవసాయంలో ఎల్లపుడూ నూతన విధానాల గురించి ఆలోచించే వాడిని. అనేకమైన విషయాలను రేడియోలో వినటం, టెలివిజన్‌లో చూడటం

జరుగుతుంది. కాని మా గ్రామం లాంటి చిన్న గ్రామాల్లో ఆ విధానాలు అవలంభించటానికి తగిన శిక్షణ లభించే అవకాశం లేకపోవటం వలన కొత్త పద్ధతులు పెద్దగా ఎప్పుడూ పాటించలేదు. కానీ గత సంవత్సరం అంటే 2007 లో CROPS సంస్థ నుండి వారి సిబ్బంది గ్రామాన్ని సందర్శించి రైతులకు శ్రీ వరి గురించి తెలియచేయడమే కాక అందుకు తగిన శిక్షణ, వీడర్లు, మార్కర్లు, లింగాకర్షక బుట్టలు, క్షేత్ర సందర్శనలు వంటి వాటి ద్వారా సహకారం అందిస్తామని తెలియచేశారు. అందువలన నేను ఇతర రైతులను ప్రేరేపించడంతో పాటు, నేను కూడా ఈ విధానాన్ని అవలంభించటానికి ముందుకు వచ్చాను. గత రెండు సీజన్లుగా ఒక ఎకరంలో ఈ పద్ధతిని అవలంభిస్తున్నాను.

ఈ పద్ధతిని అవలంభించటానికి CROPS సంస్థ నుండి మాకు సంపూర్ణ సహకారం లభిస్తున్నది. ఈ పద్ధతిని పాటించటానికి ముందుకు వచ్చిన రైతులందరినీ గ్రూపులుగా విభజించారు. ఆ గ్రూపులనుండి ఆసక్తి మరియు ఉత్సాహం కలిగిన వ్యక్తులను కార్యకర్తలుగా ఎన్నుకుని, రైతు క్షేత్ర పాఠశాలల ద్వారా శిక్షణను అందించారు. ఈ పద్ధతిని పాటించటానికి మాకు వీడర్లు, మార్కర్లు, లింగాకర్షక బుట్టలు అందచేసారు. నేను ఈ రెండు సీజన్ల నుండి కూడా IR 64 రకాన్ని ఒక ఎకరం విస్తీర్ణంలో శ్రీ పద్ధతిలో సాగు చేస్తున్నాను. మొదటి సీజన్‌లో అనుభవం లేక పోవటం వలన కలుపు తీయటంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవటం జరిగింది. పంట కూడా కొంత తక్కువ దిగుబడి వచ్చింది, కానీ తరువాత సీజన్‌లో ఇబ్బందులను అధిగమించి సాంప్రదాయ పద్ధతిలో పోలిస్తే అధిక దిగుబడిని సాధించాను. ఈ రెండు సీజన్లలో శ్రీ పద్ధతి పాటించిన వరి పొలానికి చీడ పీడల బెడద చాలా తక్కువగా ఉన్నది. కేవలం 5% పంటకు మాత్రమే పురుగు ఆశిస్తే దానిని ఫ్యూరడాన్ గుళికలు వాడి నివారించడం జరిగింది. అదేవిధంగా ఈ విధానంలో రసాయనిక ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులను వాడటం జరిగింది. అందుచేత ఖర్చు తక్కువ అవడమే కాకుండా, కలుషితం కాని రుచికరమైన పంట చేతికి వచ్చింది. నేను శ్రీ పద్ధతిలో ఈ క్రింది విధానాలను పాటించాను.

- మొదట నారుమడి గురించి భూమిని దున్ని ఆ తరువాత సేంద్రియ ఎరువును చల్లాను. ఆ తరువాత ఈ మడిని చెక్క ముక్కలు ఉపయోగించి ఒక గజం వెడల్పు 20 గజాల పొడవు ఉన్న కల ఎత్తు మడిగా రూపొందించాను.
- విత్తనాన్ని 12 గంటలు నానబెట్టి ఆ తరువాత నీరు వంపి, ఆ విత్తనాన్ని గోతాంలో పోసి 24 గంటలు మండె కట్టాను. ఆ తరువాత మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.

- ఆ తరువాత బాగా చివికిన పొడి పెంట ఎరువు, వరిగడ్డి (విత్తనాలు వంటివి లేకుండా) నాటిన విత్తనంపై పలుచగా చల్లాను. దీనివల్ల విత్తనం నేరుగా ఎండకు గురి కాకుండ ఉంది. అంతేకాక పక్షులు, చీమలు తినకుండా ఉంటాయి. నారు మొలకెత్తిన తరువాత పరిచిన గడ్డి తీసివేసాను.
- నారు మడి చుట్టు కాలువ తీసి అందులో నీరు బెట్టాను.
- నాటటానికి ఒకరోజు ముందే పొలం దున్నడం, దమ్ము చేయడం, చదును చేయడం వంటి పనులను పూర్తి చేసాను.
- దమ్ము చేసిన పొలంలో మార్కరును లాగటం ద్వారా 24 x 24 సెంటి మీటర్ల దూరంలో జల్లెడ ఆకారంలో నిలువు, అడ్డ గీతలు ఏర్పడేలా చేసాను.
- ఈ పద్ధతిలో 2 నుండి 3 ఆకుల (10 నుండి 12 రోజుల) లేత మొక్కలను దూరం దూరంగా నాటించాము.
- ఈ పద్ధతిలో పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము. పొలాన్ని నిరంతరం తడుపుతూ ఆరబెడుతూ ఉండేలా చూసాము.
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 10 రోజుల వ్యవధిలో 4 సార్లు కలుపు తీసాము.

## నూతన ఆవిష్కరణలు

- నేను మొదటి సీజన్ అంటే రబీలో 24 x 24 సెంటీ మీటర్ల కొలతలతో మార్కింగ్ చేసి విత్తనం నాటటం జరిగింది కానీ రెండవ సీజన్ అంటే ఖరీఫ్‌లో 24 x 12 సెంటీ మీటర్ల కొలతతో మార్కింగ్ చేసి విత్తనం నాటాను. ఈ విధంగా చేసినప్పుడు నాకు మొదటి సీజన్ కంటే 6 బస్తాల పంట ఎక్కువగా వచ్చినది. అందుచేత వచ్చే సీజన్‌లో కూడ నేను ఇదే విధానాన్ని అవలంభిస్తాను.

## ఈ శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- దుక్కి 4 అంగుళాల కంటే ఎక్కువ లోతు లేకుండా చూసుకోవడం మంచిది. అందువలన వీడర్ దిగబడదు, సులభంగా తిరుగుతుంది.
- దూర దూరంగా నాటడం వలన ప్రతీ మొక్క యొక్క ఆకులకు సూర్యరశ్మి బాగా సోకుతుంది. దాని ద్వారా ఒక్కో మొక్కకి తగినంత స్థలం, నీరు, పోషకాలు ఎక్కువగా అంది వేర్లు ధృడంగా పెరిగి మొక్క బాగా పెరగటానికి దోహదం చేస్తుంది.
- తక్కువ వయసు ఉన్న లేత మొక్కలను (10 నుండి 12 రోజుల) మొక్కలను నాటుకోవాలి.
- నారు పీకిన తరువాత సాధ్యమైనంత త్వరగా మొక్కను నాటాలి. ఇలా చేయడం వలన మొక్క దెబ్బ తినకుండా ఉంటుంది.

- నారు వేసిన మరుసటి రోజు నారు మడి చుట్టు తీసిన కాలువలో నీరు బెట్టాలి.
- మొదట్లో ఈ పద్ధతిలో నాటు వేయడానికి ఎకరానికి 10 నుండి 15 మంది కూలీలు పట్టవచ్చు. ఈ పద్ధతి అలవాటు తరువాత అంతకంటే తక్కువ మంది కూలీలతోనే నాటు వేయవచ్చు.
- ఈ పద్ధతిలో సాంప్రధాయ పద్ధతితో పోలిస్తే నీరు చాలా తక్కువగా వినియోగం అవుతుంది.
- నీటి యాజమాన్యం చాలా జాగ్రత్తగా చేపట్టాలి. పొలం తడిగా ఉండాలి కాని నీరు నిలువకూడదు. ఎక్కువైన నీరు బయటకు పోవటానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- వీడర్ చేరుకోలేని కుదుర్ల పక్కన ఉన్న కలుపు మొక్కలను చేతితో తీసివేయాలి.
- కలుపు మందులు వాడరాదు.
- సేంద్రియ ఎరువులు వాడకం వలన, మొక్కల మధ్య దూరం ఎక్కువగా ఉండటం వలన శ్రీ పద్ధతిలో చీడ పీడలు ఆశించడం చాలా తక్కువగా ఉంటుంది.
- ఈ పద్ధతి ఖరీఫ్ మరియు రబీ రెండు సీజన్లకు కూడా చాలా అనుకూలం.

## సలహాలు, సూచనలు

సరైన శిక్షణా సంస్థల నిరంతర సహకారం, శిక్షణ లేనట్లయితే ఈ పద్ధతిని పాటించటం కష్టం. కావున శిక్షణా సంస్థల సహకారం లభించినట్లయితే ఎక్కువ మంది రైతులు ఈ పద్ధతిని అవలంభించే అవకాశం ఉన్నది. ఈ పద్ధతిలో వీడర్‌ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి. శ్రీ పద్ధతిలో పండించిన వరికి మార్కెట్ సౌకర్యం కలిగించి సరైన ధర యిప్పించినట్లయితే రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది అని నా అభిప్రాయం. ఈ పద్ధతిలో తక్కువ నీటితో వరి పండించవచ్చు కావున మెట్ట సేద్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పద్ధతిని ఎక్కువమంది రైతులు అవలంభించేలా ప్రభుత్వం వివిధ చర్యలు చేపట్టాలి. శిక్షణా సంస్థలు రైతులకే కాకుండా కూలీలకు కూడా తగు శిక్షణలు, ప్రోత్సాహకాలు అందించాలి.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతినీ కూడా ఒకేసారి పాటించటం వలన యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 120 రోజులు | 132 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 40 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 11 రోజులు | 33 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ (MOP) |
| 6. | పురుగు మందులు | ఫ్యూరిడాన్ గుళికలు | ఫ్యూరిడాన్ గుళికలు, ఎండోసల్ఫాన్ |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం ఐదు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 45 | 600 |
| 2. | నారుమడి తయారీ | 100 | 200 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 360 | 960 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 420 | 1,260 |
| 5. | ఎరువులు | 1,000 | 1,250 |
| 6. | పురుగు మందులు | 300 | 600 |
| 7. | పంటకోత, మార్పిడి | 1,980 | 1,800 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 5,705 | 9,170 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,125 | 3,000 |
| 10. | మొత్తం లాభం (9.50 /Kg ) | 39,187 | 28,500 |
| 11. | నికర లాభం | 33,482.00 | 19,330.00 |



## చిక్కుడు ఉపేంద్ర

**బోనకల్లూరు, వరంగల్ జిల్లా**

మేము వరి మాత్రమే పండించే రైతులం. నేను నా భర్తతో కలిసి వ్యవసాయం చేస్తాను. మాకు 2 ఎకరాల పొలం ఉన్నది. మాది బోనకల్లూరు గ్రామము, వరంగల్ జిల్లా. నా పేరు చిక్కుడు ఉపేంద్ర, వయసు 35 సంవత్సరాలు, నేను 5వ తరగతి వరకు చదువుకున్నాను. నా ప్రధాన వృత్తి వ్యవసాయమే. గత 15 సంవత్సరాలుగా నేను వ్యవసాయం చేస్తున్నాను. నాకు ముగ్గురు ఆడ పిల్లలు, ఆడ పిల్లలైనప్పటికీ పిల్లలందరినీ చదివిస్తున్నాము. మేము గత సంవత్సరం వరకు సాంప్రదాయ పద్ధతిలో మాత్రమే వరి పండించే వాళ్ళము, కానీ పోయిన సంవత్సరం అంటే 2007 నుండి శ్రీ పద్ధతిలో కూడా వరి పండిస్తున్నాము. సాధారణ పద్ధతిలో వరి పండించుటకు నాగలి, గొర్రు, కొడవళ్ళు వంటి సాధనాలను ఉపయోగిస్తాము. ఈ పద్ధతిలో దుక్కి దున్నటానికి ముందు పశువుల ఎరువు, దమ్ము చేసేటప్పుడు గ్లిరిసీరియా చెట్ల లేత కొమ్మలను నరికి పొలంలో తొక్కుతాము. దీని వలన నేల సారవంతమై దిగుబడి మంచిగా వస్తుంది. దీనితో పాటుగా రసాయనక ఎరువులైన డి.ఏ.పి., యూరియా, పొటాష్ వంటి వాటిని కూడా వినియోగిస్తాము. ఈ ప్రాంతంలో ఎదిగిన చేనుకు కాండం తొలుచు పురుగు ఆశించి కంకులు ఎండిపోతాయి. వీటి నివారణ కొరకు ఫోరేట్ గుళికలు ఉపయోగిస్తాము. అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగులు వంటి వాటికి భావిస్టాన్ పొడి, కార్బండిజమ్ గుళికలు, కార్బోసిరాన్ గుళికలు వినియోగిస్తాము. ఏ రకమైన వరిని పండించినప్పటికీ ఈ పద్ధతిలో సాధారణంగా సుమారు 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

శ్రీ పద్ధతిలో వరి పండించటం గురించి అక్కడక్కడా రేడియో, టెలివిజన్ ద్వారా గతంలో విని ఉన్నప్పటికీ, CROPS సంస్థ వారు గ్రామంలో ఏర్పాటు చేసిన కళాజాత కార్యక్రమం ద్వారా బాగా తెలుసుకున్నాను. కానీ ఈ పద్ధతిలో పండించాలి అనుకుంటే ఎవరైనా పూర్తి సహకారం, శిక్షణ అందించాలి అనుకునే వాళ్ళము. ఆ తరువాత జరిగిన గ్రామ సమావేశంలో సంస్థ వారు ఈ పద్ధతిని పాటించడానికి అవసరమైన పూర్తి సహకారం, శిక్షణ అందించగలమని తెలియచేయడంతో నమ్మకం కలిగి, నా భర్తను ఒప్పించి గత రబీలో అంటే 2007

సంవత్సరంలో ఒక ఎకరం పొలంలో శ్రీ పద్ధతిలో IR64 రకం వరి పండించటానికి ముందుకు వచ్చాను. ఆ సీజన్‌లో కలుపు తీయటం, నాటడం వంటి విషయాల్లో కొంత ఇబ్బంది కలిగినప్పటికీ సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే ఎక్కువ దిగుబడి వచ్చేసరికి, ఆ తరువాతి ఖరీఫ్‌లో కూడా అంతే విస్తీర్ణంలో అదే రకాన్ని సాగు చేసాను. ఈ రెండు సీజన్‌లలో కూడా CROPS సంస్థ వారు శిక్షణలు ఇవ్వడం, వీడర్లు, మార్కర్లు, మొదలగునవి అందచేయడం, ఇతర జిల్లాలకు క్షేత్ర సందర్శన నిమిత్తం తీసుకు వెళ్ళడం లాంటి అన్ని విధానాలైన సహకారాన్ని అందచేయడంతో పాటు, వారి సిబ్బంది క్రమం తప్పకుండా మా పొలాన్ని సందర్శించి తగు సలహాలు ఇచ్చి మేము విజయవంతంగా ఈ పద్ధతిని అవలంభించటానికి, ఈ పద్ధతిలోని మెళుకువలను తెలుసుకోవటానికి తోడ్పడ్డారు. వారి సహకారంతో మేము శ్రీ పద్ధతిలో ఈ క్రింది విధానాలను పాటించాము.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- 2 కిలోల విత్తనాన్ని ఒక పూట నానబెట్టి ఆ తరువాత నీరు వంపి విత్తనాన్ని బస్తాలో పోసి 24 గంటలు మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.
- దానికి ముందు గడ్డి ఎంటుతో ఒక గజం వెడల్పు కల ఎత్తు మడి రూపొందించాను.
- నారు మడిపై రోజూ ఉదయం, సాయంత్రం నీళ్ళు చిలకరించాను.
- నాటటానికి ఒకరోజు ముందే పొలం దున్ని, దమ్ము చేసి, చదును చేసి, మార్కర్‌తో గీతలు గీసాము.
- 13 రోజులయ్యేసరికి నారు పీకి పొలంలో దూర దూరంగా నాటుకున్నాము.
- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటాము.
- పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము.
- నాటిన పదిరోజుల తరువాత కలుపు తీసి 2 ట్రాక్టర్లు సేంద్రీయ ఎరువును పొలంలో చల్లాము.
- ఆ తరువాత 3 సార్లు కలుపు తీసాము.
- మొదటిసారి కలుపు తీసే సమయంలో కలుపు మొక్కలు భూమిలో కలిసిపోయేలా చూసాము. అందువలన అది పచ్చి రొట్ట ఎరువుగా పనిచేసింది.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- విత్తన ఖర్చు తక్కువ, ఎకరాకు రెండు కిలోలు మాత్రమే వాడాము.
- సాధారణ పద్ధతిలో 30 కిలో గ్రాముల విత్తనాన్ని వాడితే ఈ శ్రీ పద్ధతిలో కేవలం 2 కిలో గ్రాముల విత్తనం సరిపోయింది.

- విత్తనం, కూలీ, ఎరువుల, పురుగు మందుల ఖర్చు తగ్గటం వలన పెట్టుబడులు తగ్గాయి.
- పై పై దుక్కులు కాబట్టి దుక్కి దున్నటానికి కూడా తక్కువ ఖర్చు అయింది.
- చాలా తక్కువ నీటితో పంట పండించాము.
- ఒకరోజు కరెంట్ పోయినప్పటికీ నష్టం లేదు, అందువలన ఆందోళన తక్కువ అయింది.
- సాధారణ పద్ధతిలో వచ్చే ఏ విధమైన పురుగులు కానీ తెగుళ్ళు కానీ రాలేదు.
- శ్రీ పద్ధతిలో ఖర్చు తగ్గి, దిగుబడులు ఎక్కువ రావటం వలన నాకు నికర ఆదాయం ఎక్కువగా వచ్చినది.
- శ్రీ పద్ధతిలో మాకు ఎక్కువ పశుగ్రాసం లభించింది.

### శ్రీ పద్ధతికి పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదటి సీజన్‌లో నారుమడిని తయారు చేయడానికి కొంత ఇబ్బంది పడ్డాను.
- మొదటి సీజన్‌లో విత్తనం నాటడానికి సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఖర్చు అయినది.
- అన్నీ పనులు సమయం ప్రకారం చేయాలి కాబట్టి మొదట్లో చాలా యిబ్బంది కలిగింది.
- మొదటి సీజన్‌లో వీడర్‌ని తిప్పటానికి చాలా కష్ట పడాల్సి వచ్చింది. దీని వలన దిగుబడి కూడా కొంత తక్కువగా వచ్చినది.
- ఆడ కూలీలు వీడర్ తిప్పలేక పోతున్నారు.
- నీటి ఎండగట్టటం, ఆరు తడి పంటలలో మాదిరిగా నీటిని వాడటానికి మొదట్లో కొంచెం ఇబ్బంది కలిగింది.
- మొదటి సీజన్‌లో విత్తనం నాటడానికి సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఖర్చు అయినది. కానీ రెండవ సీజన్ కల్లా కూలీలు అలవాటు పడటం వలన ఈ ఇబ్బంది తొలిగింది.

### శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- కుదురుకి ఒక్క మొక్క మాత్రమే నాటు కోవాలి, లేత మొక్కలను మాత్రమే నాటుకోవాలి.
- దుక్కి లోతు ఎక్కువ లేకుండా చూసుకోవడం మంచిది. అందువలన వీడర్ దిగబడదు సులభంగా తిరుగుతుంది.
- అన్నీ పనులు సమయం ప్రకారం చేయాలి.
- ఈ పద్ధతిలో దోమపోటు రాదు.
- ఈ పద్ధతిలో చీడ పీడలు ఆశించటం చాలా తక్కువగా ఉంటుంది. పంట తొందరాగా చేతికి వస్తుంది.

- ఈ పద్ధతి చిన్న, సన్న కారు రైతులకు ఎక్కువ ప్రయోజనకారిగా ఉంటుంది.
- మొక్క బలంగా పెరగటం వలన గాలికి పడిపోదు, అందువలన గింజ కూడా రాలదు.
- ఒక్కొక్క మొక్కకు పిలకలు చాలా వస్తాయి. అదే విధంగా కంకిలో ఎక్కువ గింజలు వస్తాయి.
- తాలు గింజలు చాలా తక్కువగా ఉంటాయి.
- కూలీలకు సరైన శిక్షణ ఇచ్చినట్లయితే విత్తనం నాటేటప్పుడు, కలుపు తీసేటప్పుడు వారికి పెద్దగా ఇబ్బంది కలగదు.
- కొన్నిసార్లు అవసరమైనంత మంది కూలీలు దొరకటం కష్టం అవుతుంది కాబట్టి అన్నీ సమయాలలో ఈ పద్ధతి అవలంభించటానికి అనుకూలంగా ఉండదు.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో నాటు వేయడం అనేది నైపుణ్యంతో కూడినది కావున నాటు వేసే కూలీలకు కూడా శిక్షణ ఇప్పించడంతో పాటు నాటు వేయుడానికి కూడా ఏవైనా పరికరాలు అందుబాటులోకి తెస్తే చాలా ఉపయోగం ఉంటుంది.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబందించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 110 రోజులు | 120 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 35 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 10 రోజులు | 32 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఫోరేట్ (10 g) గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 30 | 600 |
| 2. | నారుమడి తయారీ | 100 | 200 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 300 | 840 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 820 | 1,940 |
| 5. | ఎరువులు | 1,000 | 1,500 |
| 6. | పురుగు మందులు | - | 300 |
| 7. | పంటకోత, మార్పిడి | 2,140 | 2,140 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 4.360 | 7,520 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,125 | 2,625 |
| 10. | మొత్తం లాభం (9.50 / Kg ) | 39,187 | 24,937 |
| 11. | నికర లాభం | 34,827.00 | 17,417.00 |



## బద్దెపడిగె రామిరెడ్డి

బోనకల్లూరు, వరంగల్ జిల్లా

నా పేరు బద్దెపడిగె రామిరెడ్డి, వయసు 55 సంవత్సరాలు. నాది బోనకల్లూరు గ్రామము, బచ్చన్నపేట మండలం, వరంగల్ జిల్లా. గత 35 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. తర తరాలుగా వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న కుటుంబం మాది. నాకు మొత్తం 16 ఎకరాల పొలం ఉన్నది. అందులో రెండు ఎకరాలలో వరి పండిస్తుంటే, 8 ఎకరాలలో మామిడి తోట ఉన్నది. మిగిలిన 6 ఎకరాలలో మిరప, పత్తి వంటి వాణిజ్య పంటలు పండిస్తాను. పొలానికి, తోటకు కలిపి మొత్తం నాకు మూడు బోర్లు ఉన్నాయి. నేను, నా భార్య ప్రాధమిక విధ్యాభ్యాసం మాత్రమే పూర్తి చేసాము. కానీ నా పిల్లలు ఉన్నత చదువులు చదువుతున్నారు. నా పెద్ద కుమారుడు కంప్యూటర్ ఇంజనీర్‌గా పని చేస్తుంటే, ఇతర పిల్లలు చదువుకుంటున్నారు. సాంప్రదాయ పద్ధతిలో నేను సాధారణంగా ఎకరానికి 2 బస్తాల డి.ఏ.పి. అడుగు మందుగా, 2 బస్తాల యూరియాపై మందుగా వాడుతూ వస్తున్నాను. అంతేకాక పొలం అసలు దున్నక ముందు రెండు ట్రాక్టర్ల పశువుల పెంట పోస్తాను. పొట్ట దశలో పొటాష్ ఎరువును కూడా వినియోగిస్తాము. పంటకు పురుగులు ఆశించినప్పుడు ఆయా పురుగుని బట్టి ఎండోసల్ఫాను, క్లోరోఫైరిఫాస్, ఫోరేట్, ఎకలెక్స్ గుళికలను వినియోగిస్తాను. ఒక్కొక్కసారి వాతావరణం అనుకూలించని పరిస్థితులలో పంటకు అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగులు వంటివి ఆశిస్తాయి. వీటి నివారణ కొరకు M45, బావిస్టాన్ వంటి వాటిని ఉపయోగిస్తాము. నేను సాధారణంగా ఈ ప్రాంతంలో అధికంగా పండించే IR64 రకాన్ని పండిస్తాను. అది సాధారణంగా 140 రోజులలో కోతకు వస్తుంది. 38 - 40 బస్తాల దిగుబడినిస్తుంది.

సాంప్రదాయాలను అనుసరించే వ్యక్తిని అయిన నేను, మొదటి నుండి కూడా సాధారణ పద్ధతులలో మాత్రమే వ్యవసాయం చేస్తున్నాను, ఎప్పుడూ కూడా నూతన పద్ధతులు పాటించలేదు. కానీ ఈ మధ్య 2007వ సంవత్సరంలో CROPS సంస్థవారు వచ్చి శ్రీ పద్ధతిలో వరిని పండించటం గురించి చెప్పేంతవరకు కూడా నేను నూతన పద్ధతులలో వ్యవసాయం చేస్తాను అనుకోలేదు, కానీ వారు ఈ పద్ధతిని పాటించటం వలన కలిగే ప్రయోజనాలను వివరించిన తరువాత, ఆ సంస్థ

వారు ఈ పద్ధతిని అవలంభించటానికి అవసరమైన పూర్తి శిక్షణను అందచేస్తామని చెప్పిన తరువాత మొదట కొస్తంత అయిష్టంగా అనిపించినప్పటికీ వారి ప్రోత్సాహం, ఈ పద్ధతి పట్ల వారికున్న నమ్మకాన్ని చూసి ముందుకు రావటం జరిగింది. నాతో పాటుగా మా గ్రామం నుండి అనేక మంది రైతులు ముందుకు వచ్చారు. అలా వచ్చిన వారిని గ్రూపులుగా విభజించి, శిక్షణను, మార్కర్లు, వీడర్లు వంటి వాటిని అందచేసి, నిరంతరం మా పొలాలను సందర్శించడం ద్వారా పూర్తి సహకారం అందించారు. CROPS సంస్థ వారు ఇచ్చిన శిక్షణలు, సాంకేతిక సహకారంతో గత రెండు సీజన్ల నుండి ఒక ఎకరం విస్తీర్ణంలో శ్రీ పద్ధతిలో వరి సాగు చేసాను. ఈ రెండు సీజన్ల నుండి కూడా ఈ ప్రాంతంలో ఎక్కువ మంది పండించే IR 64 రకాన్ని పండిస్తున్నాను. అనుభవ రాహిత్యం వలన మొదటి సీజన్‌లో పంట కొంత తక్కువ వచ్చినప్పటికీ, రెండవ సీజన్లో చాలా తక్కువ ఇబ్బందులతో అధిక దిగుబడిని సాధించడం జరిగింది. ఈ రెండు సీజన్ల నుండి కూడా శ్రీ పద్ధతిలో సాగు చేసిన వరికి ఏ విధమైన చీడ పీడలు ఆశించ బడలేదు. గింజ నాణ్యతలో కాని, దిగుబడిలో కాని, గడ్డి దిగుబడిలో కాని సాధారణ పద్ధతిలో కంటే చాలా మెరుగైన ఫలితాలు వచ్చాయి.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- మొదట 4 x 30 అడుగుల కొలతలతో నారుమడిని పశువుల పెంట, మట్టిని ఉపయోగించి 4 పొరలుగా తయారు చేసాను.
- 2 కిలో గ్రాముల విత్తనాన్ని తీసుకొని 12 గంటలు నానబెట్టి, ఆ తరువాత నీరు వంపి గోతాంలో పోసి 24 గంటలు మండె కట్టాను. ఆ తరువాత మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లాను.
- విత్తనాన్ని చల్లిన తరువాత బాగా మాగిన పొడి పెంట ఎరువు (విత్తనాలు వంటివి లేకుండా), నాటిన విత్తనంపై పలుచగా చల్లాను.
- తరువాత నారుమడి చుట్టూ కాలువ తీసి అందులో నీరు పెట్టాను.
- పొలం దున్నడం, దమ్ము చేయడం, చదును చేయడం వంటి పనులను నాటడానికి ఒక రోజు ముందే పూర్తి చేసాను.
- దమ్ము చేసిన పొలంలో మార్కరును లాగటం ద్వారా 24x24 సెంటి మీటర్ల దూరంలో చతురస్రాకార ఆకారంలో నిలువు, అడ్డ గీతలు గీసాను.
- నాటేటప్పుడు 10 రోజుల వయసు ఉన్న మొక్కలను, విత్తనం వేర్లుతో సహా జాగ్రత్తగా పీకి ఒక్కొక్క మొక్కనే నాటించాము.

- నాటేటప్పుడు మొక్కను పట్టుకోవడానికి వీలుగా ఉండే ఒక ఇనుప రేకుని తీసుకొని నారు మడిలో మొక్కల కింద నుండి లోపలికి చొప్పించి మొక్కలకు ఏ విధమైన నష్టం కలుగకుండా మట్టితో పాటు పైకి లేపటం జరిగింది.
- నాటిన రెండు రోజుల తరువాత పొలానికి కొద్దిగా నీరు అందించాము.
- ఈ పద్ధతిలో పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము. పొలాన్ని నిరంతరం తడుపుతూ, ఆరబెడుతూ ఉండేలా చూసాము.
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 10 రోజుల వ్యవధిలో 3 సార్లు కలుపు తీసాము.
- మొదటి సారి కలుపు తీసే సమయంలో 2 ట్రాక్టర్ల సేంద్రీయ ఎరువును పొలంలో చల్లాము.
- కలుపు తీసే సమయంలో కలుపు మొక్కలు భూమిలో కలిసి పోయేలా చూసాము. అందువలన అది పచ్చిరొట్ట ఎరువుగా పని చేస్తుంది.
- రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వినియోగించటం జరిగింది. చీడ పీడలు అసలు లేకపోవటం వలన ఏ విధమైన పురుగు మందులు వినియోగించలేదు. కలుపు తీసేటప్పుడు ఆ కలుపు భూమిలో కలిసిపోయేలా చర్యలు తీసుకోవటం జరిగింది.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- సాధారణ పద్ధతిలో 30 కిలో గ్రాముల విత్తనాన్ని వాడితే ఈ శ్రీ పద్ధతిలో కేవలం 2 కిలో గ్రాముల విత్తనం సరిపోయింది.
- సాధారణ పద్ధతిలో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం 30 నుండి 40 శాతము తగ్గినది.
- శ్రీ పద్ధతి అవలంభించిన రెండు సీజన్లలో కూడా చీడ పీడలు అసలు ఆశించలేదు.
- పోల్చి చూస్తే శ్రీ పద్ధతిలోని మొక్కలు ఎక్కువ బలంగా వేళ్ళూనుకున్నాయి.
- విత్తనం, కూలీ, ఎరువుల, పురుగు మందుల ఖర్చు తగ్గటం వలన పెట్టుబడులు తగ్గాయి.
- పోల్చి చూస్తే శ్రీ పద్ధతిలో ఖర్చు తగ్గి, దిగుబడులు ఎక్కువ రావటం వలన నాకు నికర ఆదాయం ఎక్కువగా వచ్చినది.
- పోల్చి చూస్తే శ్రీ పద్ధతిలో మాకు ఎక్కువ పశు గ్రాసం లభించింది.

## శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదటి సీజన్‌లో నీటి యాజమాన్యం కష్టతరంగా అనిపించింది. అదే విధంగా ఈ పద్ధతిలో సాధారణ పద్ధతి కంటే ఎక్కువ శ్రద్ధ చూపించాల్సి వచ్చింది.

- మొదటగా ఈ పద్ధతిలో విత్తనం నాటటానికి, కలుపు తీయటానికి ఎక్కువ సంఖ్యలో కూలీలు అవసరమైనందువలన కూలీలు దొరకటం కష్టం అయింది, డబ్బు కూడా ఎక్కువ ఖర్చు అయింది.
- మొదటి సీజన్‌లో విత్తనం నాటటానికి, మార్కర్‌తో గీతలు గీయటానికి అవసరమైన నైపుణ్యం సంపాదించటానికి కష్ట పడవలసి వచ్చింది.
- మొదటి సీజన్‌లో ఒక్కొక్క మొక్కను నాటేలా ఒప్పించటానికి మహిళా కూలీలతో ఇబ్బందిని ఎదుర్కొన్నాను.
- మొదటి సీజన్‌లో వీడర్‌ని తిప్పటానికి చాలా కష్ట పడాల్సి వచ్చింది. దీని వలన దిగుబడి కూడా కొంత తక్కువగా వచ్చినది.

## ఈ శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

ఈ పద్ధతిలో సమయపాలన చాలా ముఖ్యం. ప్రతీ రైతు ఈ పద్ధతిలోని అన్ని విధానాలను సరైన సమయంలో పాటించనట్లయితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. ఈ పద్ధతిని అవలంభించే తొలి దశలో విత్తనం నాటటానికి, కలుపు తీయటానికి కూలీల ఖర్చు ఎక్కువ అవుతుంది, కాని అనుభవం గడించిన కొద్ది ఈ ఖర్చులను గణనీయంగా తగ్గించ వచ్చును. ఈపద్ధతిలో చీడ పీడలు ఆశించటం చాలా తక్కువగా ఉంటుంది. పంట తొందరగా చేతికి వస్తుంది. ఈ పద్ధతి బోర్ల క్రింద వరి పండించే వారికి అద్భుతంగా పని చేస్తుంది, కాని పల్లపు ప్రాంతాలకు పని చేయదు. కొన్ని సార్లు అవసరమైనంత మంది కూలీలు దొరకటం కష్టం అవుతుంది కాబట్టి అన్ని సమయాలలో ఈ పద్ధతి అవలంభించటానికి అనుకూలంగా ఉండదు. ఈ పద్ధతిలో ఎక్కువ పిలకలు, ఒక్కొక్క పిలకకు ఎక్కువ గింజలు వస్తాయి. ఎక్కువ పొడవు అయిన కంకులు వస్తాయి. రైతులు ఈ పద్ధతిలో విత్తనాన్ని, నీటిని, విద్యుత్‌ని, డబ్బుని అన్నింటిని ఆదా చేయవచ్చును. అంతే కాక ఈ పద్ధతిలో వరిని సాగు చేసినట్లయితే నేల సారం అభివృద్ధి చేందుతుంది. ఈ పద్ధతి చిన్న, సన్న కారు రైతులకు ఎక్కువ ప్రయోజనకారిగా ఉంటుంది. ఈ పద్ధతిని ప్రతీ సీజన్‌లో తప్పక పాటించినట్లయితే రైతుకు ఈ పద్ధతి పట్ల అవగాహన పెరుగుతుంది. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకునే అవకాశం కలుగుతుంది. తద్వారా ఈ పద్ధతిని సులభంగా పాటించటానికి, అధిక లాభాలను, ప్రయోజనాలను పొందటానికి అవకాశం కలుగుతుంది.

## సలహాలు, సూచనలు

- ఈ పద్ధతిలో వీడర్ ను తిప్పటం శ్రమతో కూడిన పని కావున, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వీడర్లను అభివృద్ధి చేయాలి. యంత్ర సహాయంతో నడిచే వీడర్లను అందచేయాలి. తద్వారా ఎక్కువ మంది రైతులు ఈ పద్ధతిని పాటించే అవకాశం కలుగుతుంది.
- ఈ పద్ధతిని పాటించే రైతులకు ప్రభుత్వ పరంగా సబ్సిడీలు, ఋణాల వంటి ప్రోత్సాహకాలను అందించినట్లయితే ఈ పద్ధతి ఎక్కువ మంది తెలిసే అవకాశం ఉంటుంది.
- ఈ పద్ధతిలో నాటు వేయడం అనేది నైపుణ్యంతో కూడినది కావున నాట్లు వేయడానికి కూడా ఏవైన పరికరాలు అందుబాటులోకి తెస్తే చాలా ఉపయోగం ఉంటుంది.
- శిక్షణ పొందిన కార్యకర్తలు గ్రామస్థాయిలో ఉన్నట్లయితే వరి పండించే రైతులు ఎక్కువ మంది ఈ పద్ధతిని అవలంభించటానికి ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది.
- ఈ పద్ధతి వలన కలిగే ప్రయోజనాలను రేడియో, టెలివిజన్ల ద్వారా తెలియచేస్తూ, ఈ పద్ధతి అవలంభించడానికి పాటించాల్సిన విధానాలను కూడా ప్రసారం చేయాలి.
- సాంకేతిక నైపుణ్యం కలిగిన సంస్థలు కూడా ముందుకు వచ్చి ఈ పద్ధతి ఎక్కువ మంది రైతులు పాటించేలా తమ సహకారాన్ని అందించాలి.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 110 రోజులు | 120 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 9 నుండి 10 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా మరియు పొటాష్ |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఎకలెక్స్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | దుక్కులు | 1,500 | 2,500 |
| 2. | విత్తన ఖర్చు | 60 | 700 |
| 3. | నారుమడి తయారీ | 200 | 300 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 450 | 1,000 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 500 | 700 |
| 6. | ఎరువులు | 600 | 1,600 |
| 7. | పురుగు మందులు | 100 | 300 |
| 8. | పంటకోత, మార్పిడి | 2,000 | 2,000 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 5,410 | 9,100 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,875 | 3,000 |
| 11. | మొత్తం లాభం (9.50 /Kg ) | 46,312 | 28,500 |
| 12. | నికర లాభం | 40,902.00 | 19,400.00 |



## చేర్యాల నర్సింహులు

బోనకల్లూరు, వరంగల్ జిల్లా

నా పేరు చేర్యాల నర్సింహులు, మాది వరంగల్ జిల్లాలోని బచ్చన్నపేట మండలానికి చెందిన బోనకల్లూరు గ్రామము. నాకు మొత్తం 5 ½ ఎకరాల పొలం ఉన్నది. అందులో రెండు ఎకరాలు బావి క్రింద ఉన్నది. బావి క్రింద ఉన్న రెండు ఎకరాలలో వరి పండిస్తాను. మిగిలిన పొలంలో వర్షాధార పంటగా పత్తి పండిస్తాను. నా ప్రధాన వృత్తి వ్యవసాయమే. నేను గత 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. సాంప్రదాయ పద్ధతిలో వరి పండించటానికి నాగలి, గొర్రు వంటి సాధనాలను ఉపయోగిస్తాను. ఈ పద్ధతిలో పశువుల ఎరువుని ఖచ్చితంగా ఉపయోగిస్తాను. అంతేకాక డి.ఎ.పి. మరియు యూరియా వంటి రసాయనక ఎరువులను కూడా ఉపయోగిస్తాను. చీడ పీడలకు గుళికలను ఉపయోగిస్తాను. నేను సాధారణంగా IR 64 రకాన్ని పండిస్తాను. సాధారణ పద్ధతిలో నాకు 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

వ్యవసాయం మొదలు పెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు కూడా సాంప్రదాయ పద్ధతిలోనే వరిని పండిస్తున్నాను. కాని 2007 సంవత్సరం రబీలో CROPS సంస్థ వారు గ్రామానికి వచ్చి ఈ శ్రీ పద్ధతిలో వరిని పండించే విధానాన్ని గురించి చెప్పినప్పుడు మొదలు అసలు నమ్మలేదు. ఒక్క మొక్క నాటితే ఎక్కువ పిలకలు రావటం ఏమిటి? ఎక్కువ దిగుబడి ఎలా వస్తుంది? అంతేకాక పుష్కలంగా నీరు ఉంటే కాని పండని వరి ఆరుతడి పంటల్లాగా ఎలా పండిస్తారు అనుకున్నాను. కాని సంస్థ వారు మాకు చక్కగా ఈ విధానాన్ని తెలియచేసి శ్రీ పద్ధతిని పాటించడానికి అవసరమైన శిక్షణలు అందిస్తాము అని చెప్పేసరికి ఒకసారి చూద్దాం అనుకున్నాను. అంతేకాక గ్రామం నుండి రైతులు కూడా చాలా మంది ముందుకు వచ్చేసరికి ధైర్యం వచ్చింది. మొదట ½ ఎకరంలో వేద్దాం అనుకున్నాను కానీ సంస్థ వారు తాము పూర్తి సహకారం అందిస్తామని చెప్పేసరికి ఒక ఎకరంలో సాగు IR64 రకాన్ని సాగుచేసాను. ఆ తరువాత సీజన్‌లో ఇదే రకాన్ని ఒక ఎకరంలోనే సాగు చేసాను. మొదటి సీజన్‌లో తెలియక కొన్ని ఇబ్బందులు పడ్డప్పటికీ తరువాత సులభంగానే సాగు చేసాము. మొదటి సీజన్‌లో 46 బస్తాల దిగుబడి వస్తే రెండవ

సీజన్‌లో 55 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ రెండు సీజన్‌లలో కూడా CROPS సంస్థ తమ పూర్తి సహకారంతో శిక్షణలు అందచేసింది, రైతు బడులను ఏర్పాటు చేసి తగు సూచనలు తెలియచేసింది. ఇతర జిల్లాలకు, వ్యవసాయ విశ్వ విద్యాలయానికి తీసుకొని వెళ్ళి అనేక కొత్త విషయాలను తెలియచేసింది.

## శ్రీ విధానంతో పాటించిన పద్ధతులు

- మొదట నారుమడి గురించి భూమిని దున్ని ఆ తరువాత సేంద్రియ ఎరువును చల్లాము.
- ఆ తరువాత ఈ మడిని కర్రల సహాయంతో ఎత్తు మడిగా తయారు చేసాము.
- 2 కేజీల విత్తనాన్ని ఒక రోజు నానబెట్టి ఆతరువాత మండె కట్టి మొలకెత్తించాము.
- ఆ తరువాత ఆ మొలకెత్తిన వాటిని నారు పోసాము.
- అవసరాన్ని బట్టి నారు మడిపైన ప్రతిరోజూ ఉదయం సాయంత్రం నీళ్ళు చల్లాము.
- కుదురుకు ఒక్క మొక్క మాత్రమే నాటాము.
- నారు పీకిన తరువాత ఆలస్యం కాకుండా మొక్కను నాటాము.
- దుక్కిలో ముందే కంపోస్టు ఎరువుతో పాటు ఒక బస్తా డి.ఎ.పి., యూరియా చల్లాను.
- నారు తయారీకి ముందే ప్రధాన పొలాన్ని దమ్ము చేసి నీరు పెట్టించాము.
- తెల్లవారి మార్కర్ సహాయంతో అడ్డము, నిలువు గీతలు వచ్చేటట్లు లాగాము.
- వరుసలు చక్కగా ఉండటానికి పొలం పొడవునా తాడు కట్టి దాని వెంట మార్కర్‌ని లాగాము.
- రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడాను.
- 10వ రోజు వీడర్‌ను సాళ్ళ మధ్య తిప్పాము. ఇలా ప్రతి పది రోజులకు ఒకసారి నిలువుగా మరియు అడ్డంగా వీడర్‌ను తిప్పాము. మొత్తం 4 సార్లు వీడర్ తిప్పాము.
- నీరు ఆరుతడిగా పారించాము.
- వీడర్‌కు దొరకని, దుబ్బు మొదళ్ళ మధ్య మరియు గట్టుపై ఉన్న కలుపును కూలీల సహాయంతో తీయించాము.

## శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- మొదటి సీజన్‌లో దుక్కి దున్నటానికి అంతే ఖర్చు అయినప్పటికీ, రెండవ సీజన్‌లో ఈ ఖర్చు తగ్గినది. ఎందుకంటే లోతుగా దుక్కి దున్నాల్సిన అవసరం లేదు అని తెలియటం వలన రెండవ సారి ఖచ్చితంగా చేసాము.

- ఒక ఎకరానికి ఒక సెంటు నారు మడి మాత్రమే సరిపోయినది. అదే సాధారణ పద్ధతిలో 5 సెంట్ల నారు మడి అవసరం. అందువలన ఈ శ్రీ పద్ధతిలో నారు మడికి అయిన ఖర్చు మరియు శ్రమ తగ్గినది.
- విత్తన ఖర్చు బాగా తగ్గినది. సాధారణ పద్ధతిలో 30 కేజీల విత్తనాన్ని వాడితే ఈ శ్రీ పద్ధతిలో కేవలం 2 కేజీల విత్తనం సరిపోయినది.
- మొదటి సారితో పోలిస్తే రెండవసారి నాటు కూలీల ఖర్చు, కలుపు తీత కూలీల ఖర్చు కూడా తగ్గినది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే పంట చాలా తొందరగా చేతికి వచ్చినది.
- చీడ పీడలు తక్కువ మొత్తంలో ఆశించాయి.
- మాకు మార్చి నెలలో రాళ్ళ వర్షం కురిసింది. అందువలన ఎక్కువ నష్టం కలుగ లేదు కానీ సాధారణ పద్దతిలో 10% వడ్లు రాలితే శ్రీ పద్ధతిలోని పొలంలో 5% శాతమే పంట రాలింది.
- మొక్కలు దూరం దూరంగా ఉండటం వలన మొక్క బలంగా పెరిగి ఈ శ్రీ పద్ధతిలో తక్కువ నష్టం జరిగింది అని తెలుసుకున్నాను.
- సాళ్ల మధ్య సందులు ఎక్కువగా ఉండటం వలన వాటిలో ఎలుకలు తిరిగినప్పుడు అవి పాములకు కనబడి వాటి సంఖ్య బాగా తగ్గినది.

## శ్రీ పద్ధతిని పాటించడానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదటి సారి నాట్ల సమయంలో ఒకే మొక్కను అది కూడా లేత మొక్కను నాటాలి కావున కూలీలకు అర్థం కాలేదు. అందువలన సాధారణంగా 5 గురు కూలీలు పట్టే ఈ పనికి శ్రీ పద్ధతిలో 12 మంది కూలీలు పట్టారు.
- నాటులో మెళుకువలు చెప్పాల్సి రావటం వలన నాట్లు కొంచెం ఆలస్యమైనాయి.
- ఆడ కూలీలను ఎక్కువ సేపు సముదాయించాల్సి వచ్చింది.

## శ్రీ పద్ధతిలో పాటించడం వలన తెలుసుకున్న విషయాలు

- ఈ పద్ధతిలో రెండు మూడు ఆకులున్న లేత మొక్కలనే దూరం దూరంగా నాటాలి. కుదురుకు ఒక్క మొక్క మాత్రమే నాటాలి.
- ఒక వైపు వీడర్‌ను తిప్పిన తరువాత దానికి అడ్డంగా రెండవ వైపు తిప్పునప్పుడు నీరు పెట్టనవసరం లేదు. అప్పటికే నేల మెత్తబడి ఉండటం వలన వీడర్ సులభంగా తిరుగుతుంది.

- మొక్కలు బలంగా పెరగటం వలన గాలికి పడిపోవు మరియు గింజలు రాలవు.
- ఒక్కో మొక్కకు పిలకలు చాలా వస్తాయి మరియు కంకిలో ఎక్కువ గింజలు వస్తాయి.
- ఎలుకల బెడద ఉండదు.
- నీరు నిలువ ఉండాల్సిన అవసరం లేదు కావున, ఒకరోజు కరెంట్ పోయినప్పటికీ భయపడాల్సిన అవసరం ఉండదు.
- సాధారణ పద్ధతిలో పోలిస్తే నీటి వినియోగం తగ్గినది. అందువలన కరెంట్ వినియోగం కూడా తగ్గినది.
- ఒక ఎకరం సాధారణ పద్ధతికి పట్టే నీరు రెండు ఎకరాల శ్రీ పద్ధతి పొలానికి సరిపోతుంది.
- పల్లపు భూములలో, నీరు నిలువ చేయలేని భూములలో ఈ శ్రీ పద్ధతిని పాటించలేము
- కూలీలకు ఈ సాగు పద్ధతులపై పూర్తి అవగాహన అవసరం.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో కలుపు తీయడానికి, వీడర్‌ని తిప్పడానికి ఎక్కువ శ్రమించాల్సి ఉంటుంది కావున చేతితో తిప్పే వీడర్లు బదులు మెషిన్‌తో తిప్పే వీడర్లు అయితే బాగుంటుంది. అందుకని మెషిన్‌తో తిప్పే వీడర్లని కనుక్కోవాలి. అంతేకాక వీటిని కొనటానికి ప్రభుత్వం సబ్సిడీ యిచ్చినట్లయితే ఎక్కువ మంది రైతులు ముందుకు వచ్చి ఈ పద్ధతిని పాటించడానికి అవకాశం కలుగుతుంది. అదే విధంగా మార్కింగ్ చేయడం మరియు పొలాన్ని ఆరుతడి పంటల్లోలాగా తరుచుగా ఆర పెట్టడం కష్టం కావున, వీటిపై రైతాంగానికి మరియు రైతు కూలీలకు శిక్షణను అందించాలి. ముఖ్యంగా నాట్లు వేసే విధానంపై మహిళా రైతు కూలీలకు శిక్షణను అందించాలి. ఈ విధానంలో పండించిన పంటకు అధిక ధరను యిప్పించినట్లయితే రైతులకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

నేను శ్రీ పద్ధతిని మరియు సాంప్రదాయ పద్ధతిని ఒకేసారి పాటించడం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు మరియు ఆదాయానికి సంబంధించిన, ఈ క్రింద తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 114 రోజులు | 126 రోజులు |
| 3. | కాల పరిధి | 2 రోజులు | 30 రోజులు |
| 4. | నారు వయస్సు | 12 రోజులు | 31 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు, డి.ఏ.పి. యూరియ, పొటాష్ | డి.ఏ.పి., యూరియా, పొటాష్ MOP |
| 6. | పురుగు మందులు | ఏమి వాడలేదు | ఫోరేట్ 10g గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం మూడు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన ఖర్చు | 40 | 600 |
| 2. | నారుమడి తయారీ | 180 | 300 |
| 3. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 400 | 600 |
| 4. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 300 | 800 |
| 5. | ఎరువులు | 1,300 | 1,300 |
| 6. | పురుగు మందులు | - | 300 |
| 7. | పంటకోత, మార్పిడి | 2,200 | 2,200 |
| 8. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 6.420 | 8,600 |
| 9. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,050 | 3,000 |
| 10. | మొత్తం లాభం (9.50 / Kg ) | 38,475 | 28,500 |
| 11. | నికర లాభం | 32,055.00 | 19,900.00 |



## మోకు శ్రీశైలం రెడ్డి

బోనకల్లూరు, వరంగల్ జిల్లా

నా పేరు మోకు శ్రీశైలం రెడ్డి, వయస్సు 55 సంవత్సరాలు, చదువు ప్రాథమిక విద్యాభ్యాసం. వరంగల్ జిల్లా, బచ్చన్న పేట మండలం బోనకల్లూరు గ్రామము. గత 35 సంవత్సరాలుగా వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్నాను. నాకు ఉన్న నలుగురి పిల్లలలో అందరి పెళ్ళిళ్ళు అయిపోగా, నేను ప్రస్తుతం నా చిన్న కుమారుడు దగ్గర ఉండి వ్యవసాయం చేస్తున్నాను. నాకు 10 ఎకరాల భూమి ఉన్నది. అందులో రెండు బోర్లు ఉన్నాయి. ఒక బోరుని వరి పంటకు ఉపయోగిస్తే ఇంకొక బోరు ఇతర పంటలకు ఉపయోగిస్తాము. సాంప్రదాయ పద్ధతిలో వరి పండించటానికి నాగలి, గొర్రు వంటి సాధనాలను ఉపయోగిస్తాము.ఈ పద్ధతిలో పశువుల ఎరువుని ఖచ్చితంగా ఉపయోగిస్తాను. అంతేకాక డి.ఎ.పి., యూరియా వంటి రసాయనక ఎరువులను కూడా ఉపయోగిస్తాను. చీడ పీడలకు గుళికలను ఉపయోగిస్తాను. సాధారణ పద్ధతిలో మాకు 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

2007 సంవత్సరం రబీలో CROP సంస్థ గ్రామానికి వచ్చి ఈ శ్రీ పద్ధతిలో వరిని పండించే విధానాన్ని చెప్పటానికి ముందే వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా విన్నాను, కానీ వేరే ఎవరైన పండించినప్పుడు చూద్దాంలే అనుకున్నాను, కాని సంస్థ వారు గ్రామాన్ని సందర్శించి ఈ పద్ధతి వల్ల లాభాలను తెలియచేయడమే కాకుండా ఈ పద్ధతి పాటించే రైతులందరికీ తమ సహాయ సహకారాలు అందించగలమని తెలియచేయడంతో సంతోషంగా ముందుకు వచ్చాను. గత రెండు సీజన్‌లలో ప్రతీ సీజన్ లో 1.10 ఎకరాలలో IR 64 రకాన్ని ఈ పద్ధతిలో పండించాను. మొదటి సీజన్‌లో ఎకరానికి 50 బస్తాల దిగుబడి వస్తే రెండవ సీజన్‌లో 60 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ రెండు సీజన్‌లలో కూడా CROP సంస్థ తమ పూర్తి సహకారాన్ని అందించింది, శిక్షణలు అందచేసింది, రైతు బడులను ఏర్పాటు చేసి తగు సూచనలు తెలియచేసింది, ఇతర జిల్లాలకు మరియు వ్యవసాయ విశ్వ విద్యాలయానికి తీసుకొని వెళ్లి అనేక కొత్త విషయాలను తెలియచేసింది.

## శ్రీ విధానంతో పాటించిన పద్ధతులు

- 2 కేజీల IR 64 విత్తనాన్ని ఒక రోజు నానబెట్టి , మండె కట్టి మొలకెత్తించాము.
- సాంప్రదాయ విధానానికి నారు పోసిన 15 రోజుల తరువాత ఈ శ్రీ పద్ధతి గురించి నారు పోసాము.
- ఆ తరువాత ఈ మడిని గడ్డి ఎంటు సహాయంతో ఎత్తు మడిగా తయారు చేసాము.
- ఆ తరువాత ఆ మొలకెత్తిన వాటిని నారు పోసాము.
- దుక్కిలో ముందే కంపోస్టు ఎరువుతో పాటు ఒక బస్తా డి.ఎ.పి., ఒక బస్తా యూరియా చల్లాను.
- దమ్ము చేసిన పోలంలో మార్కర్ సహాయంతో సుమారు ఒక అడుగు (24 x 24 సెం.మీ) దూరంలో గీతలు గీసాము.
- వరుసలు తిన్నగా ఉండటానికి పొలం పొడవునా తాడు కట్టి దాని వెంట మార్కర్‌ని లాగాము.
- నాటేటప్పుడు ఒక్కొక్క మొక్క చొప్పున రెండు గీతలు కలిసే చోట వద్ద గింజలు ఊడిపోకుండా నారు మొక్కను నాటాను. నారు తయారీకి ముందే ప్రధాన పొలాన్ని దమ్ము చేసి నీరు పెట్టించాము.
- 10వ రోజు వీడర్‌ను సాళ్ళ మధ్య తిప్పాము. ఇలా ప్రతి పది రోజులకు ఒకసారి నిలువుగా మరియు అడ్డంగా వీడర్‌ను తిప్పాము.
- మొదటిసారి కలుపు తీసే సమయంలో 2 ట్రాక్టర్ల, సేంద్రియ ఎరువును పొలంలో చల్లాము.
- వీడర్ నడుపుటకు ముందు, పొలానికి నీరు పెట్టి నడిపిన తరువాత సాయంత్రం నీరు తీసివేసాము.

## సాంప్రదాయ పద్ధతిలో పోలిస్తే ఈ శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- తక్కువ విత్తనంతో అంటే కేవలం రెండు కేజీల విత్తనం సాగు చేసాము.
- మొదటి సారితో పోలిస్తే రెండవసారి నాటు కూలీల ఖర్చు, కలుపు తీత కూలీల ఖర్చు కూడా తగ్గినది.
- పదిరోజుల ముందుగానే కోతకు వచ్చింది.
- సాధారణ పద్ధతితో పోలిస్తే చాలా తొందరగా చేతికి వచ్చినది.
- చీడ పీడలు తక్కువ మొత్తంలో ఆశించాయి.
- ఈ పద్ధతిలో ఒక్కో దుబ్బుకు 50 నుండి 55 పిలకలు వచ్చాయి. అదే సాధారణ పద్ధతిలో 30 వరకు పిలకలు వచ్చాయి.

- సాదారణ పద్ధతిలో ఒక్కో మొక్కకు 25 నుండి 30 పిలకలు వస్తే ఈ శ్రీ పద్ధతిలో 55 నుండి 65 పిలకలు వచ్చాయి. కంకి కూడా పెద్దదిగా ఉండి గింజ కూడా ఎక్కువ బరువు ఉన్నది.
- సాదారణ పద్ధతిలో ఒక కంకికి 90 నుండి 110 గింజలు ఉంటే ఈ శ్రీ పద్ధతిలో 145 నుండి 170 గింజలు వచ్చాయి.
- తాలు గింజలు తక్కువగా వచ్చాయి. గింజ బరువు కూడా ఎక్కువగా ఉన్నది.
- సాధారణ పద్ధతిలో ఎకరాకు 1 ట్రాక్టరు పశు గ్రాసం వస్తే ఈ శ్రీ పద్ధతిలో 1 $^1/_2$ ట్రాక్టర్ల పశుగ్రాశం వచ్చింది.
- పోల్చి చూస్తే ఈ శ్రీ పద్ధతిలో ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరగటం వలన నికర ఆదాయం పెరిగింది.

## శ్రీ పద్ధతిని పాటించడానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదటి సీజన్‌లో నారు మడిని ఎత్తుగా తయారు చేయుటంలో ఇబ్బంది ఎదుర్కొన్నాను.
- అన్ని పనులు సమయం ప్రకారం చేయాలి అంటే మా లాంటి పెద్ద రైతులకు కొంచెం కష్టంగా అనిపిస్తుంది.
- మొదట సీజన్‌లో ఆడ కూలీలకు శిక్షణ లేకపోవటం వలన వాళ్ళకు అర్ధం అయ్యేలా చెప్పటానికి కొంచెం కష్టం అయ్యింది.
- నీటి యాజమాన్యం కూడా మొదట సీజన్‌లో అర్ధం కాక ఇబ్బంది అయ్యింది.

## శ్రీ పద్ధతిని పాటించడం వలన తెలుసుకున్న విషయాలు

- ఒక ఎకరం సాధారణ పద్ధతికి బట్టే నీరు రెండు ఎకరాల శ్రీ పద్ధతి పొలానికి సరిపోతుంది.
- మాములు పద్ధతిలో నారు మడి 30 రోజులు ఉండటం వలన పురుగు మందులు మరియు గుళికలు వాడాల్సి వస్తుంది, కానీ ఈ శ్రీ పద్ధతిలో నారు కేవలం 11, 12 రోజుల ఉంటే సరిపోతుంది కావున పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదు.
- ఈ పద్ధతిలో 10, 12 రోజులు వయస్సు ఉన్న లేత మొక్కలనే దూరం దూరంగా నాటాలి
- మొక్క బలంగా పెరగటం వలన గాలికి పడిపోవు మరియు గింజలు రాలవు
- నీరు నిలువ ఉండాల్సిన అవసరం లేదు.
- పల్లపు భూములలో నీరు నిలువ చేయలేని భూమూలలో ఈ శ్రీ పద్ధతిని పాటించలేము.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో చాలా లాభాలు ఉన్నప్పటికీ, కష్టం ఎక్కువగా ఉంటుంది. అంతే కాక సేంద్రియ పద్ధతిలో పండిస్తాము కావున ఈ పద్ధతిలో పండించిన పంటకు అధిక ధర ఇప్పించినట్లయితే రైతాంగానికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అదే విధంగా ఈ పద్ధతిని పాటించే రైతులకు ప్రత్యేక ఋణాలు మరియు ఇతర ప్రోత్సాహకాలను కూడా అందించినట్లయితే ఎక్కువ మంది రైతులు ముందుకు వస్తారు. వర్షాధారంగా పంటలు పండించే తెలంగాణా వంటి ప్రాంతాలల్లో సాధారణ పద్ధతిని నిషేదించినట్లయితే ఎక్కువ మంది రైతులు ఈ పద్ధతిని పాటిస్తారు. అంతే కాక అందువలన నీటి వనరుల వినియోగం తగ్గి భూగర్భజలాలు కూడా పెరుగుతాయి.

నేను శ్రీ పద్ధతిని మరియు, సాంప్రదాయ పద్ధతిని ఒకేసారి పాటించడం వలన యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు మరియు ఆదాయానికి సంబంధించిన ఈ క్రింది తేడాలను గమనించడం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 110 రోజులు | 120 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 9 నుండి 10 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఎకలెక్స్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | దుక్కులు | 1,500 | 2,500 |
| 2. | విత్తన ఖర్చు | 60 | 700 |
| 3. | నారుమడి తయారీ | 200 | 300 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 450 | 1,000 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 500 | 700 |
| 6. | ఎరువులు | 600 | 1,600 |
| 7. | పురుగు మందులు | 100 | 300 |
| 8. | పంటకోత, మార్పిడి | 2,000 | 2,000 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 5,410 | 9,100 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,875 | 3,000 |
| 11. | మొత్తం లాభం (9.50 / Kg ) | 46,312 | 28,500 |
| 12. | నికర లాభం | 40,902.00 | 19,400.00 |

## చొప్పరి అబ్బయ్య
బోనకల్లూరు, వరంగల్ జిల్లా



నా పేరు చొప్పరి అబ్బయ్య, వయస్సు 50 సంవత్సరాలు. నాది బోనకల్లూరు గ్రామము, బచ్చన్న పేట మండలం, వరంగల్ జిల్లా. గత 30 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాను. నాకు మొత్తం 6 ఎకరాల పొలం ఉన్నది, అందులో రెండు ఎకరాలలో వరి పండిస్తుంటే, 4 ఎకరాలలో మిరప, పత్తి వంటి వాణిజ్య పంటలు పండిస్తాను. పొలానికి, తోటకు కలిపి మొత్తం 1 బోరు బావి ఉన్నది. నాకు ఇద్దరు కూతుర్లు. అందులో ఒక కూతురు పెండ్లి అయినది. నేను 6 వ తరగతి వరకు చదువుకున్నాను. సాంప్రదాయ పద్ధతిలో నేను సాధారణంగా ఎకరానికి 2 బస్తాల డి.ఏ.పి. అడుగు మందుగా 2 బస్తాల యూరియానుపై మందుగా వాడుతూ వస్తున్నాను. అంతేకాక పొలం అసలు దున్నక ముందు రెండు ట్రాక్టర్ల పశువుల పెంట పోస్తాను. పొట్ట దశలో పొటాష్ ఎరువును కూడా వినియోగిస్తాము. పంటకు పురుగులు ఆశించినప్పుడు ఆయా పురుగుని బట్టి ఎండోసల్ఫాను, క్లోరోఫైరిఫాస్, ఫోరేట్, ఎకలెక్స్ గుళికలను వినియోగిస్తాను. ఒక్కొక్క సారి వాతావరణం అనుకూలించని పరిస్థితులలో పంటకు అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగులు వంటివి ఆశిస్తాయి. వీటి నివారణ కొరకు M45, బావిస్టాన్ వంటి వాటిని ఉపయోగిస్తాము. నేను సాధారణంగా ఈ ప్రాంతంలో అధికంగా పండించే IR 64 రకాన్ని పండిస్తాను. అది సాధారణంగా 135 రోజులలో కోతకు వస్తుంది. 35 - 40 బస్తాల దిగుబడినిస్తుంది.

మొదటి నుండి కూడా సాధారణ పద్ధతులలో మాత్రమే వరిని పండిస్తున్నాను. ఎప్పుడూ కూడా నూతన పద్ధతులు పాటించలేదు కానీ ఈ మధ్య 2007వ సంవత్సరంలో CROPS సంస్థవారు వచ్చి శ్రీ పద్ధతిలో వరిని పండించటం గురించి చెప్పేంతవరకు కూడా నేను నూతన పద్ధతులలో వ్యవసాయం చేస్తాను అనుకోలేదు కానీ వారు ఈ పద్ధతిని పాటించటం వలన కలిగే ప్రయోజనాలను వివరించి, ఈ పద్ధతిని అవలంభించటానికి అవసరమైన పూర్తి శిక్షణను అందచేస్తామని చెప్పిన తరువాత నా ప్రక్క పొలం రైతు ఈ విధానాన్ని పాటించటానికి ముందుకు వచ్చేసరికి నేను కూడా ఈ సారికి ఒక ఎకరం పొలంలో సాగు చేద్దాము అనుకున్నాను. కానీ ఈ పద్ధతిలో లాభాలను గ్రహించాక, ఇదే పద్ధతిని

శాశ్వతంగా పాటించాలి అనుకుంటున్నాను. నాతో పాటుగా మా గ్రామం నుండి అనేక మంది రైతులు ముందుకు వచ్చారు. అలా వచ్చిన వారిని గ్రూపులుగా విభజించి, శిక్షణను, మార్కర్లు, వీడర్లు వంటి వాటిని అందచేసి, నిరంతరం మా పొలాలను సందర్శించడం ద్వారా పూర్తి సహకారం అందించారు. ఈ రెండు సీజన్ల నుండి కూడా ఈ ప్రాంతంలో ఎక్కువ మంది పండించే IR 64 రకాన్ని పండిస్తున్నాను. ఈ రెండు సీజన్ల నుండి కూడా శ్రీ పద్ధతిలో సాగు చేసిన వరికి ఏ విధమైన చీడ పీడలు ఆశించ బడలేదు. గింజ నాణ్యతలో కాని, దిగుబడిలో కాని, గడ్డి దిగుబడిలో కాని సాధారణ పద్ధతిలో కంటే చాలా మెరుగైన ఫలితాలు వచ్చాయి.

## శ్రీ పద్ధతిలో పాటించిన విధానాలు

- 2 కిలో గ్రాముల విత్తనాన్ని నానబెట్టి, ఆ తరువాత మండె కట్టాను. .
- నారుకు ముందే పొలాన్ని మూడు సార్లు దున్నాను.
- ఆ తరువాత మడిని కర్రల సహాయంతో ఎత్తు మడిగా చేసాము.
- ఆ తరువాత మొలకెత్తిన నారును నాటము.
- నారు వయసు 8 రోజులు రాగానే ప్రధాన పొలాన్ని మరోసారి దమ్ము చేసి నీరు పెట్టాను.
- తరువాత నారు మడి చుట్టు కాలువ తీసి అందులో నీరు బెట్టాను.
- CROPS వారు యిచ్చిన మార్కర్‌తో నిలువు, అడ్డ గీతలు పొలంలో గీసాము.
- నాటేటప్పుడు 10 రోజుల వయస్సు ఉన్న మొక్కలను విత్తనం, వేర్లతో సహా జాగ్రత్తగా పీకి ఒక్కొక్క మొక్కనే నాటించాము.
- ఈ పద్ధతిలో పొలం తడిచేలా మాత్రమే నీళ్ళు పెట్టాము. పొలాన్ని నిరంతరం తడుపుతూ, ఆరబెడుతూ ఉండేలా చూసాము.
- నాటిన పదిరోజులకొకసారి, ఆ తరువాత 10 రోజుల వ్యవధిలో 3 సార్లు కలుపు తీసాము.
- కలుపు తీసే సమయంలో కలుపు మొక్కలు భూమిలో కలిసి పోయేలా చూసాము. అందువలన అది పచ్చిరొట్ట ఎరువుగా పని చేస్తుంది.
- రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వినియోగించటం జరిగింది. చీడ పీడలు అసలు లేకపోవటం వలన ఏ విధమైన పురుగు మందులు వినియోగించలేదు.

## సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే శ్రీ పద్ధతిలో నాకు కనిపించిన ప్రయోజనాలు

- సాధారణ పద్ధతిలో పోలిస్తే ఈ పద్ధతిలో నీటి వినియోగం తగ్గినది.

- సాధారణ పద్ధతిలో 30 కిలో గ్రాముల విత్తనాన్ని వాడితే ఈ శ్రీ పద్ధతిలో కేవలం 2 కిలో గ్రాముల విత్తనం సరిపోయింది
- ఒక ఎకరా పొలానికి 1 సెంటు నారు మడి మాత్రమే సరి పోయింది. అదే సాధారణ పద్ధతిలో 5 సెంట్ల నారు మడి అవసరం అయింది. అందువలన ఈ శ్రీ పద్ధతిలో నారు మడికి అవసరం అయిన ఖర్చు మరియు శ్రమ తగ్గింది.
- సాధారణ పద్ధతిలో గాలికి వడ్లు రాలిపోవటం, మొక్క పడిపోవటం జరిగింది. అదే శ్రీ పద్ధతిలో నాటిన మొక్క బలంగా ఉండటం వలన అటువంటి నష్టం ఏమి జరగలేదు.
- శ్రీ పద్ధతి అవలంభించిన రెండు సీజన్లలో కూడా చీడ పీడలు అసలు ఆశించలేదు.
- విత్తనం, కూలీ, ఎరువులు, పురుగు మందులు ఖర్చు తగ్గటం వలన పెట్టుబడులు తగ్గాయి.
- పోల్చి చుస్తే శ్రీ పద్ధతిలో మాకు ఎక్కువ పశు గ్రాసం లభించింది.

## శ్రీ పద్ధతిని పాటించటానికి ఎదుర్కొన్న ఇబ్బందులు

- మొదట సీజన్‌లో దుక్కులు లోతుగా దున్నటం వలన వీడర్ దిగబడి తిప్పటం కష్టం అయింది.
- మొదటి సీజన్‌లో నారుమడి తయారు చేయడానికి కూడ కొంత ఇబ్బంది పడ్డాను.
- మొదట్లో విత్తనం నాటటానికి, మార్కర్‌తో గీతలు గీయటానికి అవసరమైన నైపుణ్యం సంపాదించటానికి కష్ట పడవలసి వచ్చింది.
- మొదట్లో ఈ పద్ధతిలో విత్తనం నాటటానికి, కలుపు తీయటానికి ఎక్కువ సంఖ్యలో కూలీలు అవసరమైనందువలన కూలీలు దొరకటం కష్టం అయింది, డబ్బు కూడా ఎక్కువ ఖర్చు అయింది.
- మొదటి సీజన్‌లో ఒక్కొక్క మొక్కను నాటేలా ఒప్పించటానికి మహిళా కూలీలతో ఇబ్బందిని ఎదుర్కొన్నాను.

## ఈ శ్రీ పద్ధతిని అవలంభించటం ద్వారా నేర్చుకున్న విషయాలు

- నాట్లు వేసేటప్పుడు, వీడర్ తిప్పేటప్పుడు నైపుణ్యాన్ని ప్రదర్శించాలి.
- మొదట అవలంభించినప్పుడు కొంచెం ఖర్చు ఎక్కువగానే అవుతుంది. కానీ ఈ పద్ధతిలో మెలుకువలను తెలుసుకొని సమయాను కూలంగా పనిచేస్తే అధిక స్థాయిలో దిగుబడి సాధించ వచ్చును.
- ప్రతి 10 రోజులకు ఒకసారి వీడర్ తిప్పాలి.
- వీడర్ తిప్పిన రోజు నీరు ఉండాలి, తరువాత నీరు బయటకు పంపివేయాలి.

- మొక్క బలంగా పెరగటం వలన గాలికి పడిపోదు, అందువలన గింజ కూడా రాలదు.
- ఒక్కొక్క మొక్కకు పిలకలు చాలా వస్తాయి. అదే విధంగా కంకిలో ఎక్కువ గింజలు వస్తాయి.
- మామూలు పద్ధతిలో ఒక్కొక్క మొక్కకు 25 నుండి 30 పిలకలు వస్తే శ్రీ పద్ధతిలో ఈ సంఖ్య 50 నుండి 60 కి పెరిగింది. అదే విధంగా కంకి పరిమాణం కూడా పెద్దగా ఉండి గింజ బరువు కూడా ఎక్కువగా ఉన్నది.

## సలహాలు, సూచనలు

ఈ పద్ధతిలో నాటు వేయడం అనేది నైపుణ్యంతో కూడినది కావున నాటు వేయడానికి కూడా ఏవైన పరికరాలు అందుబాటులోకి తెస్తే చాలా ఉపయోగం ఉంటుంది.

శ్రీ పద్ధతిలో సేంద్రియ ఎరువులు వాడి వరి పండిస్తారు కావున ఈ పద్ధతిలో పండించిన వరికి మార్కెట్ సౌకర్యం కలిగించి అధిక ధర ఇప్పించినట్లయితే రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.

ఈ పద్ధతిలో తక్కువ నీటితో వరి పండించవచ్చు కావున మెట్ట సేద్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ పద్ధతిని ఎక్కువ మంది రైతులు అవలంభించేలా ప్రభుత్వం వివిధ చర్యలు చేపట్టాలి.

శిక్షణ పొందిన కార్యకర్తలు గ్రామస్థాయిలో ఉన్నట్లయితే, వరి పండించే రైతులు ఎక్కువ మంది ఈ పద్ధతిని అవలంభించటానికి ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది.

నేను శ్రీ పద్ధతిని, సాంప్రదాయ పద్ధతిని కూడా ఒకేసారి పాటించటం వలన, యాజమాన్య పద్ధతులు, కాల పరిధి, ఖర్చు, రాబడికి సంబందించిన ఈ క్రింది తేడాలను గమనించటం జరిగింది.

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | విత్తన రకం | IR 64 | IR 64 |
| 2. | కాల పరిధి | 114 రోజులు | 127 రోజులు |
| 3. | విత్తనం | 2కిలో గ్రాములు | 30 కిలో గ్రాములు |
| 4. | నారు వయస్సు | 11 రోజులు | 30 రోజులు |
| 5. | ఎరువులు | సేంద్రియ ఎరువులు | డి.ఏ.పి., యూరియా, పొటాష్ |
| 6. | పురుగు మందులు | ఏమీ వాడలేదు | ఎకలెక్స్ గుళికలు |
| 7. | కలుపు యాజమాన్యం | రోటరీ వీడరు (మొత్తం నాలుగు సార్లు | చేతితో కలుపుతీయడం (మొత్తం రెండు సార్లు) |

## రాబడి, ఖర్చుల వివరాలు

| క్ర.సం. | వివరాలు | శ్రీ పద్ధతి | సాంప్రదాయ పద్ధతి |
|---|---|---|---|
| 1. | దుక్కులు | 1,500 | 2,400 |
| 2. | విత్తన ఖర్చు | 60 | 600 |
| 3. | నారుమడి తయారీ | 250 | 300 |
| 4. | నాటు వేయుటకు కూలీల ఖర్చు | 550 | 900 |
| 5. | కలుపు తీయుటకు కూలీల ఖర్చు | 500 | 700 |
| 6. | ఎరువులు | 600 | 1,700 |
| 7. | పురుగు మందులు | 100 | 300 |
| 8. | పంటకోత, మార్పిడి | 2,000 | 2,000 |
| 9. | వ్యవసాయానికి అయిన మొత్తం ఖర్చు | 5,660 | 8,900 |
| 10. | దిగుబడి (కిలో గ్రాములలో) | 4,500 | 3,150 |
| 11. | మొత్తం లాభం (9.50 /Kg ) | 42,750 | 29,925 |
| 12. | నికర లాభం | 37,090.00 | 21,025.00 |